అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

ఆదివారం 1-10-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 | సంచిక : 221 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు + సోపతి (వెబ్‌లో) వెల : 8.00

ఐక్యంగా పోరాడాల్సిన

సమయమిది

ఇండియా కూటమికి పలు చిన్న పార్టీలు, ఉద్యమవేదికలు, ప్రజా సంఘాల మద్దతు

- 'జీతేగా ఇండియా' సదస్సులో నిర్ణయం
- దేశవ్యాప్తంగా అక్టోబర్ 2 నుంచి 1.25 లక్షల మంది వాలంటీర్ల ప్రచారం



లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు ప్రతిపక్షాల ఇండియా కూటమికి మద్దతిస్తామని చిన్న పార్టీలు, ప్రజా ఉద్యమ వేదికలు, ప్రజా సంఘాల వేదిక ప్రకటించాయి. 'జీతేగా ఇండియా - బనేగా ఇండియా' పేరుతో దేశవ్యాప్తంగా 1.25 లక్షల మంది వాలంటీర్లు ప్రచారం చేయనున్నారు. ఈ ప్రచార కార్యక్రమం అక్టోబర్ 2న వార్ధాలోని సేవాగ్రామ్, ఇతర ప్రదేశాల్లో ప్రారంభమవుతుంది. భారత్ జోడో అభియాన్, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ కమ్యూనిస్టులు, డెమోక్రటిక్ సోషలిస్టులతో రూపొందించబడిన 'జీతేగా ఇండియా' వేదిక ప్రతిపక్షాల ఇండియా కూటమికి మద్దతు తెలిపింది. ఇది 'సత్య సైన్యాల'తో బీజేపీ ట్రోల్ ఆర్మీలను కూడా ఎదుర్కొంటుంది. వారు ప్రతిపక్ష కూటమి నుంచి సీట్లు కోరలేదు. ఇండియా కూటమికి బీజేపీ మధ్య ఓట్ల వ్యత్యాసం తక్కువ ఉన్న 125-150 సీట్లను ఈ వేదిక గుర్తిస్తుందని పేర్కొంది. అయితే వేదిక గుర్తించిన స్థానాల్లో ఇండియా కూటమి పార్టీలు, బీజేపీ సులభంగా గెలిచే స్థానాలు ఉండవు.

న్యూఢిల్లీ : 'జీతేగా ఇండియా'- ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సామాజిక న్యాయం పేరుతో ఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ క్లబ్‌లో జరిగిన జాతీయ సదస్సులో ఈ నిర్ణయాలు తీసుకున్నారు. దీనికి 18 చిన్న ప్రతిపక్ష పార్టీలు, 20 రాష్ట్రాల నుంచి 50 మందికి పైగా ప్రజా ఉద్యమాల సంఘాలు, పౌర సమాజ సంస్థల నుంచి దాదాపు 500 మంది ప్రతినిధులు హాజరయ్యారు. రాబోయే ఐదు రాష్ట్రాల ఎన్నికలు, లోక్‌సభ ఎన్నికలలో బీజేపీ, దాని మిత్రపక్షాల (బహిరంగ, రహస్య)ను ఓడించడమే లక్ష్యంగా తీర్మానం ఆమోదించారు.

ఈ జాతీయ సదస్సులో సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరీ, సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, కాంగ్రెస్ నేత దిగ్విజయ్ సింగ్, ఎస్పీ నేత జావేద్ అలీ ఖాన్, ఆర్‌ఎల్‌డీ నేత త్రిలోక్ త్యాగి తదితర నేతలు ప్రసంగించారు. సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మాట్లాడుతూ ఐక్య పోరాటమే బీజేపీ ఓటమికి దారి తీస్తుందని ఉద్ఘాటించారు. భారతదేశాన్ని రక్షించాలంటే, బీజేపీని సాగనంపాలన్నది ప్రతి దేశభక్తుడి లక్ష్యం కావాలని అన్నారు. "ఇండియా గెలుస్తుంది. కానీ మనమందరం మన ప్రయత్నం చేస్తేనే అది గెలుస్తుంది. దేశం పునాదులపై దాడి జరుగుతుంది. దేశ మూల స్తంభాలపై లెక్కలేనన్ని దాడులు జరిగాయి. దేశంలో 28 పార్టీలు భారత దేశాన్ని రక్షించడం, ఉత్తమ రేపటికి భరోసా ఇవ్వడమే లక్ష్యాలను కలిగి ఉన్నాయి" అన్నారు.

ఎస్పీ నేత జావేద్ అలీ ఖాన్ మాట్లాడుతూ 'బీజేపీ దాదాపు జాతీయవాదాన్ని, దేశభక్తిని కూడా గుత్తాధిపత్యం చేసింది. ఈ తప్పుడు గుత్తాధిపత్యాన్ని అధిగమించి వారికి తమ స్థానాన్ని చూపించడమే మన కర్తవ్యం. బీజేపీకి వ్యతిరేకంగా... 11లో

ఓట్ల కోసం పాట్లు..

ఎన్నికల వేళ సెటిలర్లకు బీఆర్ఎస్ గాలం

- ఎన్టీఆర్ జపం చేసిన కేటీఆర్
- చంద్రబాబు అరెస్టుపై స్పందించిన హరీశ్‌రావు
- స్వరం మార్చిన నేతలు
- విస్తుపోతున ప్రజలు

'ఆందోళనలు ఆంధ్రాలో చేసుకోండి హైదరాబాద్‌లో కాదు'...'చంద్రబాబు అరెస్టుతో బీఆర్ఎస్‌కేం సంబంధం ? దీనిపై మా పార్టీ నాయకులెవరైనా మాట్లాడితే అది కేవలం వారి వ్యక్తిగత వ్యవహారం'... ఇవి నిన్నటి మాటలు. 'మాకు రాముడైనా, కృష్ణుడైనా ఎన్టీఆరే... 'చంద్రబాబు అరెస్టు దురదృష్టకరం'...ఇవి ఈనాటి మాటలు. నిన్న అలా.. నేడు ఇలా... ఇంతలో ఎంతమార్పు..ఎందుకీ మార్పు? రోజుల వ్యవధిలోనే బీఆర్ఎస్ నేతల వైఖరిలో వచ్చిన మార్పు దేనికి సంకేతం..? ఏ పూటకు ఆ పాట పాడటమంటే ఇదే మరి. ఓట్ల కోసం ఎన్ని పాట్లో...



ఎన్టీఆర్ విగ్రహావిష్కరణలో కేటీఆర్, తదితరులు

రాముడైనా కృష్ణుడైనా ఎన్టీఆరే

ఎన్టీఆర్ కేసీఆర్ గురుశిష్యులు

- కాంగ్రెస్‌వి అలవికాని హామీలు
- కర్నాటక, ఢిల్లీల నుంచి డబ్బు సంచులు
- డబ్బులిస్తే తీసుకోండి.. కారుకే ఓటేయండి
- ఖమ్మం సభలో మంత్రి కేటీఆర్
- ఎన్టీఆర్‌తో కేసీఆర్‌ను పోల్చడంపై విమర్శలు
- పర్యటన నేపథ్యంలో విపక్ష నేతల నిర్బంధం

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

'గ్యారెంటీలు.. గ్యారెంటీలు అని ఊదర కొడుతున్న వాళ్లకు.. వాళ్ల సీటు గ్యారెంటీ ఉందా..? వాళ్ల పార్టీకి వారెంటీ ఉందా? ఆలోచించండి. ఆరిపోయే దీపం లాంటి పార్టీ.. డైలాగులు... 11లో

బి.వి.యన్.పద్మరాజు

ఏ ఎండాకాగొడుగు పట్టటమనేది రాజకీయ నాయకులకు తెలిసినంతంగా మరెవ్వరికీ తెలియదేమో. అందునా ఓటర్ల నాడిని, జనం మూడ్‌ను పసిగట్టటంలో అధికార బీఆర్ఎస్ నేతలు మహా దిట్టలు. అందుకే రానున్న శాసనసభ ఎన్నికల్లో సెటిలర్ల ఓట్లను మూటగట్టుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. ఇటీవల టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టు వ్యవహారం తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర చర్చనీయాంశం అయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఒకప్పుడు తెలుగుదేశంలో ఓ వెలుగు వెలిగి.. ఇప్పుడు బీఆర్ఎస్‌లో కీలక హోదాలు, పదవుల్లో ఉన్న నేతలు ఆయన అరెస్టును ఖండించిన సంగతీ విదితమే. శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి, మంత్రులు ఎర్రబెల్లి దయాకరరావు, పువ్వాడ అజయకుమార్, ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, అరికెపూడి గాంధీ, కేపీ వివేకానంద తదితరులు చంద్రబాబు



అరెస్టును ఖండించిన వారిలో ఉన్నారు. తాజాగా సిద్ధిపేటలో మంత్రి హరీశ్‌రావు...'ఈ వయసులో చంద్రబాబును అరెస్టు చేయటం మంచిదికాదు...' అంటూ వ్యాఖ్యానించారు.

కానీ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి కేటీఆర్ ఇందుకు భిన్నంగా స్పందించి వార్తల్లో నిలిచారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ ఇటీవల హైదరాబాద్‌లో ఐటీ ఉద్యోగులు ఆందోళనలు చేపట్టగా ఆయన వారిపై తీవ్ర ఆగ్రహాన్ని, అసహనాన్ని వ్యక్తం చేశారు. 'చంద్రబాబుకు సంబంధించిన నిరసనలు ఏమైనా ఉంటే ఆంధ్రాలో చేసుకోండి... ఇక్కడ శాంతి భద్రతలకు విఘాతం కలిగించకండి...' అంటూ సీరియస్ అయ్యారు. సంబంధిత నిరసనలకు ప్రభుత్వం అనుమతిని కూడా నిరాకరించింది. దీనిపై విమర్శలు వెల్లువెత్తాయి. ఇది సెటిలర్లకూ ఆగ్రహాన్ని తెప్పించింది. వారి ఓట్లు ఎక్కువగా ఉన్న నియోజకవర్గాల్లోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఈ విషయాన్ని పార్టీ అధినేత దృష్టికి తీసుకుపోయారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అశ్వారావుపేట, కొత్తగూడెం, సత్తుపల్లి, భద్రాచలం, నల్లగొండ జిల్లాలోని కోదాడ, హుజూర్‌నగర్, మిర్యాలగూడ, జీహెచ్‌ఎమ్‌సీ పరిధిలోని కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్, సనత్‌నగర్, పటాన్‌చెరు, కుత్బుల్లాపూర్, ఇబ్రహీంపట్నం, నిజామాబాద్ జిల్లాల్లోని బాన్సువాడ, నిజామాబాద్ రూరల్ తదితర నియోజకవర్గాలకు చెందిన... 11లో



చంద్రబాబు అరెస్టు దురదృష్టకరం

ఈ వయసులో అలా చేయటం సరికాదు

- సిద్దిపేటలో ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు
- మన అభివృద్ధిని కీర్తించారంటూ వ్యాఖ్య
- కాంగ్రెస్, బీజేపీకి దూరదృష్టి లేదని విమర్శ

నవ తెలంగాణ - సిద్దిపేట, నంగునూరు

తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, మాజీ సీఎం చంద్రబాబునాయుడును అరెస్టు చేయడం దురదృష్టకరమని రాష్ట్ర ఆర్థికమంత్రి హరీశ్‌రావు అన్నారు. ఈ వయసులో ఆయనను అరెస్టు చేయడం సరికాదు అన్నారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట గ్రామంలో రూ.300 కోట్లతో నిర్మించనున్న ఆయిల్‌పామ్... 2లో



హైదరాబాద్‌లో ఆశా వర్కర్ల నిరసన

ఆశావర్కర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

టార్గెట్లు, పని ఒత్తిడితో చిన్న వయస్సులోనే రోగాలు

- పారితోషికాల పేరుతో అదనపు పని
- తెలంగాణ వాలంటీర్ కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షులు పి.జయలక్ష్మి
- రాష్ట్ర వ్యాప్తంగా మానవహారాల ఏర్పాటు

నవతెలంగాణ-ముషీరాబాద్/విలేకరులు

ఆశా వర్కర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, లేనియెడల సమ్మెను మరింత ఉధృతం చేస్తామని తెలంగాణ వాలంటీర్ కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షులు పి.జయలక్ష్మి అన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 28 వేల మంది ఆశా వర్కర్లు ధర్నా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమ్మెలో భాగంగా శనివారం రాష్ట్ర వ్యాప్తంగా మానవహారాలు నిర్వహించగా.. తెలంగాణ వాలంటీర్ కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ కమిటీ ఆధ్వర్యంలో ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో వినూత్న రీతిలో నిరసన తెలిపారు. 'కేసీఆర్ ఆశావర్కర్ల ఆకలి గోస వినండి! ఫిక్స్‌డ్ వేతనం రూ.18000 పెంచండి' అంటూ ప్లేట్లను మోగిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పి.జయలక్ష్మి మాట్లాడుతూ.. ...11లో

అంతిమ వీడ్కోలు

అధికార లాంఛనాలతో స్వామినాథన్ అంత్యక్రియలు..



చెన్నై : హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్ (98) అంత్యక్రియలు అశ్రునయనాల మధ్య శనివారం పూర్తయ్యాయి. అధికార లాంఛనాలతో చెన్నైలోని బీసెంట్ నగర్ శ్మశాన వాటికలో స్వామినాథన్ పార్థివ దేహానికి ఆయనకు కుటుంబసభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. స్వామినాథన్ పార్థీవదేహానికి చెన్నైలోని తేనాంపేటలోని ఆయన నివాసంలో పలువురు ప్రముఖులు, ప్రజలు అభిమానులు నివాళులర్పించారు. తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి, ముఖ్యమంత్రి స్టాలిన్, ప్రతిపక్ష నేత పళనిస్వామి తదితరులు స్వామినాథన్‌కు నివాళులర్పించి.. ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు.

లిప్‌స్టిక్‌లు పెట్టుకున్నవాళ్లే..

మహిళా రిజర్వేషన్‌పై ఆర్జేడీ నేత వివాదాస్పద వ్యాఖ్యలు



పాట్నా : ఇటీవల పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ బిల్లుపై కొందరు రాజకీయ నాయకులు వివాదాస్పద రీతిలో స్పందిస్తున్నారు. మహిళా రిజర్వేషన్‌పై ఇష్టం వచ్చినట్టుగా మాట్లాడుతు న్నారు. బీహార్‌కు చెందిన ఆర్జేడీ నేత అబ్దుల్ బారీ సిద్ధికీ ఈ జాబితాలో చేరాడు. మహిళా రిజర్వేషన్ బిల్లు పేరుతో లిప్‌స్టిక్‌లు పెట్టుకున్న, బాబ్ కట్ చేసుకున్న మహిళలు ముందుకొస్తారని అన్నారు. బీహార్‌లోని ...11లో

పిల్లల గుండె ఆపరేషన్లు నిరంతర ప్రక్రియ

నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప



డాక్టర్ల బృందంతో ఆపరేషన్లు అయిన పిల్లలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్‌లోని పంజాగుట్ట నిమ్స్ ఆస్పత్రిలో గుండె చికిత్సల క్యాంపు నేటితో ముగించడం లేదని, చిన్న పిల్లలకు గుండె ఆపరేషన్లు నిరంతరం జరుగుతూనే ఉంటాయని ఆస్పత్రి డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప వెల్లడించారు. బ్రిటన్ వైద్యుల సహకారంతో ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన చిన్నారుల గుండె ఆపరేషన్లు విజయవంతమైన సందర్భంగా శనివారం నిమ్స్ లర్నింగ్ ...11లో

కరువు జిల్లాపై కనికరం కరువు

పాలమూరు -రంగారెడ్డికి దక్కని జాతీయ హోదా

- పర్యటనలు తప్ప అభివృద్ధి శూన్యం
- పడకేసిన పాలమూరు అభివృద్ధి
- నేడు మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాలకు ప్రధాని మోడీ రాక



తెలంగాణ రాష్ట్రం ఏర్పడకముందే.. తెలంగాణ ఉద్యమ సమయంలోనే మహబూబ్‌నగర్ పట్టణంలో జరిగిన బీజేపీ సభలో పాలమూరు-రంగారెడ్డి లిఫ్టుకు జాతీయ హోదా కల్పిస్తామని అప్పుడు కేంద్ర ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న సుష్మస్వరాజ్ హామీ ఇచ్చారు. ఆ తర్వాత ప్రధాని మోడీ జిల్లాకు వచ్చిన సందర్భంగా అనేక వాగ్దానాలు చేశారు. కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటు, పారిశ్రామిక అభివృద్ధితోపాటు రైల్వే సౌకర్యాల ఏర్పాటుపై దృష్టి పెడతామని చెప్పారు. ఇచ్చిన హామీల్లో ఒక్కటీ అమలు కాలేదు.

నవతెలంగాణ- మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

కానీ, మరోసారి ప్రధాని మోడీ ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లాకు వస్తున్నారు. ఎన్నికల సమయంలో చేసే శంకుస్థాపనలకు హాజరు కావడం తప్ప.. గతంలో ఇచ్చిన హామీలను అమలు చేసే అవకాశం ఏమైనా ఉందాలని జిల్లా వాసులు ప్రశ్నిస్తున్నారు. పసుపు బోర్డు ఏర్పాటు చేయకుండానే నిజామా బాద్‌లోనూ మోడీ పర్యటించనున్నా రు.కరువు కాటకాలు, వలసలకు మారుపేరుగాంచిన పాలమూరుపై కేంద్రం వివక్ష కనబరుస్తోంది. సాగునీటి ప్రాజెక్టులు లేక జిల్లా దుర్భిక్షంగా మారిన సమయంలో పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు మొదలు పెట్టారు. రాష్ట్ర విభజన సమయంలోనూ.. ఈ ప్రాజెక్టుపై బీజేపీ ప్రకటన చేసింది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత జాతీయ హోదా కల్పించి పనులు పూర్తి చేయిస్తామని ప్రధాని మొదలుకొని మంత్రుల దాకా ఉపన్యాసాలిచ్చారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత నేతలు జాతీయ హోదా ఊసే ఎత్తడం లేదు. అడ్డంకులను సైతం తొలగించే ప్రయత్నం చేయడం లేదు. జిల్లాకు మోడీ వస్తున్న ...11లో

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదునుపెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణ మండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.





వృద్ధులపై చిన్నచూపు ఎందుకు?

పేదరికం...అనారోగ్యం...ఒంటరితనం

- తప్పని కుటుంబ సభ్యుల వేధింపులు
- ప్రభుత్వ సాయమూ అంతంతే
- సమాజ ఆదరణా తక్కువే
- నేడు అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం



న్యూఢిల్లీ : నేడు అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం. ఈ సందర్భంగా ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గటెర్రెస్ ఓ సందేశం ఇస్తూ వృద్ధుల జ్ఞానం, అనుభవం వెలకట్టలేనివని కొనియాడారు. శాంతి, సుస్థిర అభివృద్ధిలో వారి కృషి ఎనలేనిదని ప్రశంసించారు. అయితే మన దేశంలో వృద్ధుల సంరక్షణ, వారి ఆరోగ్య పరిరక్షణలో ప్రభుత్వం ఉదాశీనంగా, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది.

పౌర సమాజంలో వృద్ధుల హక్కులు అంటే వారి ప్రాథమిక మానవ హక్కులే. వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత, కర్తవ్యం ప్రభుత్వానిదే. కానీ మార్కెట్ ఆధారిత విలువలు పెద్దల సమస్యను ఏ మాత్రం పరిష్కరించలేక పోతున్నాయి. వృద్ధాప్యంలో కూడా ఎంత సమర్ధవంతంగా పనిచేయగలరు, సమాజానికి ఏ విధంగా ఉపయోగ పడతారు అనే విషయాలనే పరిగణనలోకి తీసుకుంటు న్నారు. అయితే ఈ అంశాలలో వారు బలహీనులే. పెన్షన్, సంరక్షణ, ఆరోగ్య సంబంధమైన సమస్యలు వంటి వాటిపై పెట్టే ఖర్చు వృథా అని ప్రభుత్వం భావిస్తోంది.

ఐరాస సర్వే నివేదిక మండిపాటు

ప్రధాని మోడీ చెప్పినట్లు ఇప్పుడు మనం అమృత కాలంలో ప్రవేశించాం. ఈ సందర్భంగా దేశంలో వృద్ధులకు సంబంధించిన సమాచారాన్ని తెలుసుకోవడం సముచితం గా ఉంటుంది. మన దేశంలో 13.8 కోట్ల మంది సీనియర్ సిటిజన్లు ఉన్నారు. వీరిలో 5.3 కోట్ల మంది దారిద్ర్యరేఖకు దిగువన జీవిస్తున్నారు. 1.1 కోట్ల మంది అంధులు. వీరికి ఎలాంటి వైద్య చికిత్స అందడం లేదు. జీవన భృతి కోసం 9.6 కోట్ల మంది ఇప్పటికీ పని చేయాల్సి వస్తోంది. వీరం దరికీ పెన్షన్, పీఎఫ్, గ్రాట్యుటీ, వైద్య బీమా వంటి సదుపా యాలేవీ లేవు. 2031 నాటికి దేశంలో వృద్ధుల సంఖ్య 19.4 కోట్లకు చేరుతుంది. 2050 నాటికి ఆ సంఖ్య 34 కోట్లకు చేరుతుందని అంచనా. దేశంలో వృద్ధుల పరిస్థితిపై ఐక్యరాజ్యసమితి సర్వే నివేదిక ఆగ్రహం వ్యక్తం చేసింది. భారత్‌లో వృద్ధులకు తగిన స్థానం లేదని మండిపడింది. ఐరాస సర్వే నివేదిక ప్రకారం...భారత్‌లోని వృద్ధులలో 62.1% మందికి దీర్ఘకాలిక ఉపశమనం కలిగించే రక్షణ లేదు. 52.4% మందికి ప్రాథమికంగా కుటుంబ మద్దతు లేదు. పేదలైన వృద్ధులలో 90% మంది అసంఘటిత రంగాని కి చెందిన వారే. మహిళలలో 20% మంది నిరుపేదలైన వితంతువులు. నిరుపేద వృద్ధులలో కేవలం 10% మందికి మాత్రమే పెన్షన్ లేదా ఆర్థిక మద్దతు లభిస్తోంది.

ఏం చేయాలి?

వృద్ధులపై వేధింపులు, నేరాలు కూడా అధికంగానే జరుగుతున్నాయి. వారిలో 25% మంది తమను పిల్లలే అవమానిస్తున్నారని చెబుతున్నారు. ప్రధాని మోడీ చెప్పినట్లు అమృతకాలంలో ప్రవేశించిన సందర్భంలో దేశంలోని వృద్ధులకు సంబంధించిన కఠోర వాస్తవాలు ఇవి. ఈ పరిస్థితి మారాలంటే ప్రభుత్వం ఇప్పటికైనా వృద్ధుల విషయంలో తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. వారికి సామాజిక భద్రతా పథకాలు అమలు చేయాలి. వృద్ధుల వల్ల సమాజానికి ఉపయోగం ఏమీ లేదని, పైగా వారు సమాజానికి భారంగా పరిణమించారని అనుకోకూడదు. వృద్ధుల ఆరోగ్యంపై వారి ఇంటి వద్దనే తగిన చర్యలు తీసుకోవాలి. అప్పుడే వృద్ధులు ఆనందంగా, ఉత్సాహంగా మనుగడ సాగించగలుగుతారు. అమృతకాలం దిశగా ప్రయాణం సాగిస్తారు.

ఆరోగ్య రక్షణ అంతంతే

వృద్ధుల ఆరోగ్య రక్షణ గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. పాతిక శాతం మంది వృద్ధులు తమ ఆరోగ్య అవసరాల కోసం కుటుంబ సభ్యులు లేదా పొరుగువారి దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సి వస్తోంది. నిర్లక్ష్యానికి గురవుతూ ఒంటరి బతుకు బతుకుతున్న వారి సంఖ్య తక్కువేమీ లేదు. వృద్ధులలో 11% మంది ఒంటరిగానే జీవిస్తున్నారు. 2025 నాటికి అంటే మరో రెండు సంవత్సరాలకు 60 సంవత్సరాలు దాటిన వృద్ధులలో 25% మంది, 75 సంవత్సరాలు దాటిన వారిలో 40% మందిది ఒంటరి బతుకే. వృద్ధులలో 12% శాతం మంది తమను ఎవరూ పట్టించుకోవడం లేదని బాధపడు తున్నారు.

13% మంది తాము ఇంటిలోనే బందీలమై పోయామని వాపోతున్నారు. 21% మంది తమకు కుటుంబ సభ్యులు లేదా సామాజిక మద్దతు కరువైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సౌత్ ఇండియన్ కల్చరల్ అసోసియేషన్
మేనేజింగ్ కమిటీ ఎన్నిక



హైదరాబాద్ : 1959లో జంట నగరాలలో స్థాపించబడిన ఒక ప్రధానమైన సాంస్కృతిక సంస్థ సౌత్ ఇండియన్ కల్చరల్ అసోసియేషన్ మేనేజింగ్ కమిటీ ఎన్నికైంది. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో జరిగిన అన్యువల్ జనరల్ బాడీ మీటింగ్‌లో 2023-25కుగాను కొత్త మేనేజింగ్ కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా విజ్ఞాన సమితి అధ్యక్షుడు శ్రీ సూరి వెంకటేశ్వర్లు ఈ క్రింది మేనేజింగ్ కమిటీ సభ్యులను ప్రకటించారు.

అధ్యక్షుడు : డాక్టర్ రీ. చక్రవర్తి

ఉపాధ్యక్షులు : జబామణి, గోపాల కృష్ణన్, జస్టిస్ సుబ్బారావు, డాక్టర్ ఎన్ రమేష్ కుమార్, జస్టిస్ సివిఎన్ శాస్త్రి

కార్యదర్శి : నేలటూరి రాజశేఖర్

జా. కార్యదర్శి : డా. కె.వి.రమణ, కె.ఎస్.డి.మూర్తి

కోశాధికారి : బి. సుధీంద్ర కుమార్

సభ్యులు : శ్రీలత, రఘు, కె.ఎస్ రావు, జీ. రావు, శ్రీనివాసన్, డాక్టర్ కెఎన్ ప్రసాద్, మహీధర సీతారాం, శ్యామలా చిర్రావూరి, లొల్ల ఎస్ మూర్తి, రాజభూషణ రావు, వి. రామచంద్రన్

విదేశాల్లో
ఉపాధి అవకాశాలపై 4 నుంచి అవగాహన

- కరీంనగర్, రామగుండం, మంచిర్యాలలో ఎన్‌రోల్‌మెంట్ : టామ్‌కామ్ సీఈవో విష్ణువర్ధన్‌రెడ్డి వెల్లడి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అభివృద్ధి చెందిన దేశాల్లో నైపుణ్యం కలిగిన నర్సులు, కార్మికులకు ఉపాధి అవకాశాలపై ఈనెల నాలుగు నుంచి అవగాహన కల్పించాలని తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్) నిర్ణయించింది. అందులో భాగంగా యూఏఈ, ఆస్ట్రేలియా, మాల్టా, మారిషస్, జపాన్, జర్మనీల్లోని ఖాళీలకు అభ్యర్థులను ఎంపిక చేసేందుకు కరీంనగర్, రామగుండం, మంచిర్యాల జిల్లాల్లో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్టు ప్రకటించింది. ఈ మేరకు టామ్‌కామ్ సీఈవో డాక్టర్ ఈ విష్ణువర్ధన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల నాలుగున కరీంనగర్‌లో, ఐదున రామగుండంలో, ఆరున మంచిర్యాలలో నమోదు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు రెజ్యూమ్, సంబంధిత డాక్యుమెంట్లతో ఈ డ్రైవ్‌కు హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాల కోసం www.tomcom.telangana.gov.in వెబ్‌సైట్‌ను చూడాలనీ, లేదంటే 8247838789/ 7893566493/ 9849639539 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఫార్మసీ స్పాట్ అడ్మిషన్ల గడువు 6 వరకు పొడిగింపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి బీ ఫార్మసీ, ఫార్మా-డీ, బయోటెక్నాలజీ, ఫార్మాసూటికల్ ఇంజినీరింగ్, బయోమెడికల్ ఇంజినీరింగ్, బయో టెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఎంసెట్ బైపీసీ విద్యార్థులకు స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియను చేపట్టే గడువును ఈనెల ఆరో తేదీ వరకు సాంకేతిక విద్యాశాఖ పొడిగించింది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఎంసెట్ ప్రవేశాల కన్వీనర్ వాకాటి కరుణ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇతర వివరాల కోసం https://tseamcetb.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాల్సి ఉంటుంది.

ఈ-మైనింగ్ మొబైల్ యాప్‌ను ఆవిష్కరించిన మంత్రి పట్నం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

టీఎస్ ఈ-మైనింగ్ మొబైల్ యాప్‌ను రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి శనివారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. రాష్ట్ర గనులు, భూగర్భ వనరుల శాఖ (డీఎంజీ), జాతీయ సమాచార విజ్ఞాన కేంద్రం (ఎన్ఐసీ) హైదరాబాద్ సంయుక్తంగా ఈ-మైనింగ్ యాప్‌ను అభివృద్ధి చేశాయని మహేందర్‌రెడ్డి చెప్పారు. గనులు, ఇసుక, ఖనిజ రవాణా, తనిఖీలు, అక్రమార్కులకు అడ్డుకట్ట వేసేందుకు ఇది దోహదపడుతుందని అన్నారు. ఈ-చలాన్ పద్ధతితో జరిమానాలను ఆన్‌లైన్‌లో వసూలు చేసేందుకు వీలుంటుందన్నారు. దీంతో పారదర్శకత, వెంటనే రుసుము వసూలు చేయడానికి అనుమతులు ఇవ్వొచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీఎంజీ కాత్యాయనీ దేవి తదితరులు పాల్గొన్నారు.

పాలమూరు జాతీయ హోదా మరిచారు

- మేడే రాజీవ్ సాగర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రధాని మోడీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పాలమూరు, రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించకుండా ఏ మొఖం పెట్టుకుని తెలంగాణ రాష్ట్రానికి వస్తున్నారని శనివారం ఒక ప్రకటనలో తెలంగాణ ఫుడ్స్ చైర్మెన్ మేడే రాజీవ్ సాగర్ ప్రశ్నించారు. హామీ అమలు చేస్తేనే తెలంగాణలో అడుగు పెట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును జీర్ణించుకోలేని మోడీకి తెలంగాణలో ఏం పని అని ప్రశ్నించారు. కేంద్రం సాయం చేయకున్నా కేసీఆర్ కృషితో పాలమూరు ప్రాజెక్టును ప్రజలకు అందుబాటులోకి తీసుకు వచ్చిందని తెలిపారు.ఇప్పటికైనా పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

రాముడైనా కృష్ణుడైనా ఎన్టీఆరే

(మొదటిపేజీ తరువాయి)

కొడితే మళ్లీ ఆగమవుదామా..? అభివృద్ధిలో భాగమవుదామా..? ఆలోచించండి.." అని ఐటీ, పురపాలకశాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా పర్యటనలో భాగంగా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఖమ్మం కార్పొరేషన్ ఎదుట శనివారం ఏర్పాటు చేసిన ప్రగతి నివేదన సభలో కేటీఆర్ మాట్లాడారు. అభివృద్ధి సాగాలంటే, ప్రగతి రథ చక్రాలు ముందుకు కదలాలంటే అందరి ఆశీర్వాదం కావాలన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అమలు చేయని, అలవికాని హామీలను ఇక్కడ ఇస్తున్నారని తెలిపారు. డబ్బులిస్తే తీసుకోండి కానీ ఓటు మాత్రం కారు గుర్తుకు వేయాలన్నారు. నగరంలో రూ.1370 కోట్ల పనులకు శనివారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.

ఎన్టీఆర్‌తో కేసీఆర్‌కు పోలిక..

ఖమ్మం లకారం ట్యాంక్‌బండ్ వద్ద ఎన్టీఆర్ పార్కుతోపాటు కాంస్య విగ్రహాన్ని కేటీఆర్ ప్రారంభించారు. ఎన్టీఆర్‌తో కేసీఆర్‌కు పోలిక పెడుతూ.. ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవం నేపథ్యంలో విగ్రహాన్ని ప్రారంభించామన్నారు. విశ్వవిఖ్యాత నట సార్వభౌమ నందమూరి తారక రామారావు అందర్నీ ఆదరించి.. పేదలను గుండెల్లో పెట్టుకున్నారన్నారు. చరిత్ర రాసినప్పుడు కొన్ని వాస్తవాలను మరుగున పడవేయలేమన్నారు. తెలుగు వారు ఉన్నారని దేశమంతా మనవైపు చూసేటట్టు చేసింది ఎన్టీఆర్ అని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారందరికీ ఎంతో ఆప్తుడు ఎన్టీఆర్ అని, ప్రజల మనస్సుల్లో చెరగని ముద్ర వేసిన మహానుభావుడని కొనియాడారు. రాముడు, కృష్ణుడు ఎలా ఉంటారో తెలియదని, ఆ రెండూ ఆయనేనని అన్నారు. అదే మాదిరిగా తెలంగాణవాళ్లు ఉన్నారని ఈ దేశం మొత్తం చాటిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. గురువు ఎన్టీ రామారావు చేయలేని పని, వారి శిష్యుడు కేసీఆర్‌చేసే అవకాశం ఉందన్నారు. దక్షిణ భారతదేశంలోనే ఏ ముఖ్యమంత్రి, ఎన్టీఆర్ కూడా హ్యాట్రిక్ సీఎం కాలేదని తెలిపారు. కానీ 'గురువును మించిన శిష్యుడిగా కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం అవుతారని' జోస్యం చెప్పారు. దాంతో ఎన్టీఆర్ ఆత్మ కూడా శాంతిస్తుందన్నారు. ఈ పర్యటనలో రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, బీఆర్‌ఎస్ లోక్‌సభా పక్షనేత నామ నాగేశ్వరరావు, రాజ్యసభ ఎంపీలు బండి పార్థసారథిరెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్, మేయర్ పునుకొల్లు నీరజ, జడ్పీ, డీసీసీబీ, విత్తనాభివృద్ధి సంస్థ, సుడా, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మెన్‌లు లింగాల కమలరాజ్, కూరాకుల నాగభూషణం, కొండబాల కోటేశ్వరరావు, బచ్చు విజయ్‌కుమార్, వైరా బీఆర్‌ఎస్ అభ్యర్థి బాణోత్ మదన్‌లాల్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే వెంకటవీరయ్య ఆధ్వర్యంలో సత్తుపల్లిలో సభ నిర్వహించారు.

ఎన్టీఆర్ అభిమానుల ఆగ్రహం

ఎన్టీఆర్‌కు కేసీఆర్‌కు పోలిక పెట్టడం.. గురువును మించిన శిష్యుడు అంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఎన్టీఆర్ అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ విగ్రహాన్ని కేటీఆర్ ప్రారంభించడంతో రామారావు ఆత్మ శాంతించడం కాదు క్షోభిస్తుందని ఎద్దేవా చేశారు. ఎన్టీఆర్ అభిమాన సంఘాల ఆధ్వర్యంలో కేటీఆర్ ప్రారంభించిన విగ్రహాన్ని ఆదివారం పసుపునీళ్లతో శుద్ధి చేయనున్నట్టు ప్రకటించారు. ఎన్టీఆర్ విగ్రహం ప్రారంభ సందర్భంగా ఆయన ముఖంపై ముసుగు తొలగకపోవడంతో ఆ తర్వాత హైడ్రాలిక్ మిషన్ సహాయంతో తీశారు. తిరుగు పయనంలో కేటీఆర్ మళ్లీ ఆ విగ్రహం దగ్గరకు వచ్చి నాయకులతో కలిసి ఫొటోలకు ఫోజులిచ్చారు.

తుమ్మల, పొంగులేటిపై పరోక్ష విమర్శలు..

కొణిజర్ల మండలం అంజనాపురంలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ శంకుస్థాపన సభలో కేటీఆర్ మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై పరోక్ష విమర్శలు చేశారు. కేసీఆర్ పదవి ఇస్తే మంచోడు, ఇవ్వకుంటే చెడ్డోడని, పదవుల కోసం పార్టీలు మారే నాయకులు స్వార్థ రాజకీయాలు చేస్తున్నారన్నారు. 50 ఏండ్లుగా తెలంగాణకు అన్యాయం చేసిన కాంగ్రెస్‌కు అవకాశం ఇవ్వొద్దన్నారు.

విపక్ష నేతల అరెస్ట్

కేటీఆర్ పర్యటనను అడ్డుకుంటామని ముందుగానే కాంగ్రెస్ నేతలు ప్రకటించడంతో వారిని పోలీసులు అరెస్టు చేశారు. వీరితో పాటు సీపీఐ(ఎం) నేతలు, వామపక్ష విద్యార్థి సంఘ నాయకులను అరెస్టు చేశారు. అయితే బీజేపీ నాయకులను మాత్రం నిర్బంధించకపోవడం చర్చనీయాంశమైంది. మిక్కిలినేని నరేంద్ర, కాంగ్రెస్ కార్పొరేటర్లు మిక్కిలినేని మంజుల, సైదులు, చోటాబాబా, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భూక్యా వీరభద్రం, బి.రాంబాబు, ఎస్.నవీన్‌రెడ్డి, తాళ్లపల్లి కృష్ణ, షేక్ బషీరుద్దీన్, టీడీపీ నుంచి నల్లమల రంజిత్, శ్రీనివాసరావు, చేతుల నాగేశ్వరరావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇదిలావుండగా భారీ వర్షం కారణంగా కేటీఆర్ భద్రాచలం పర్యటన రద్దయింది.

ట్విట్టర్ వార్
వేడి పుట్టిస్తున్న పిట్టకూతలు

- కేటీఆర్ కౌంటర్‌కు రేవంత్, కోమటిరెడ్డి కౌంటర్
- స్కామ్‌గ్రెస్‌కు నో చెప్పండి : కేటీఆర్
- తండ్రికి చలి జర్వం వస్తే...కొడుక్కు మతితప్పింది : రేవంత్
- కే (కల్వకుంట్ల) ట్యాక్స్ వసూళ్లు : కోమటిరెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర రాజకీయాల్లో పిట్టకూతలు (ట్విట్టర్) ఎన్నికల వేడి పుట్టిస్తున్నాయి. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల అగ్రనేతలు ట్విట్టర్ వేదికగా విమర్శల యుద్ధం చేస్తున్నారు.సభలు, సమావేశాల్లో ఒకరిపై ఒకరు విమర్శల బాణాలు ఎక్కుపెడుతూనే...ట్విట్టర్లో పదునైన విమర్శలకు దిగుతున్నారు. కాంగ్రెస్ పార్టీ అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారి స్కామ్‌గ్రెస్‌గా రూపాంతరం చెందిందంటూ మంత్రి కేటీఆర్ చేసిన ట్వీట్‌కు టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి, ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ధీటుగా స్పందించారు. రాష్ట్రంలో కల్వకుంట్ల (కే) ట్యాక్స్ విధించిదంటూ ఎదురుదాడి చేశారు. కాంగ్రెస్ హామీలతో సీఎంకు చలిజ్వరం వచ్చింది, కొడుకుకు మతి భ్రమించింది అంటూ ఎద్దేవా చేశారు. వెరసి బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య ట్విట్టర్ వార్ ఆసక్తిగా మారింది.

స్కామ్‌గ్రెస్‌కు నో చెప్పండి : మంత్రి కేటీఆర్

రాష్ట్రంలో స్కామ్‌గ్రెస్‌కు తెలంగాణ ప్రజలు నో చెప్పాలంటూ మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. కర్నాటక లో కొత్తగా ఎన్నికైన కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ కాంగ్రెస్‌కు నిధులు ఇచ్చేందుకు అక్కడికి బిల్డర్లకు రూ 500కే చదరపు అడుగు ఇచ్చిందని పేర్కొన్నారు. 'రాజకీయ ఎన్నికల పన్ను' విధించడం ప్రారంభించిందని తెలి పారు. పాత అలవాట్లు చనిపోతాయి కానీ గ్రాండ్ ఓల్డ్ పార్టీ కాంగ్రెస్‌కు దాని రిచ్ స్కామ్ ల వారసత్వం కొనసాగుతుందని పేర్కొన్నారు. స్కామ్‌గ్రెస్' అని పేరు మార్చినట్టు వివరిం చారు. ఎంత డబ్బు ముట్టజెప్పినా తెలంగాణ ప్రజలను మోసం చేయలేరని హెచ్చరించారు.

నిద్రలోనూ కమీషన్ల కలవరింతే...: రేవంత్

కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలను చూసి తండ్రికి చలి జ్వరం పట్టుకుంటే, కొడుకేమో పూర్తిగా మతి తప్పినట్టుగా మాట్లా డుతున్నారని టీపీసీసీ అధ్యక్షులు ఎనుముల రేవంత్‌రెడ్డి కౌంటరిచ్చారు. నిండా అవినీతిలో మునిగి, నిద్రలో కూడా కమీషన్ల గురించే కలవరించే మీరా కాంగ్రెస్ గురించి మాటా డేది? అని ప్రశ్నించారు. పక్క రాష్ట్రంపై నీ గాలి మాటలను కాసేపు పక్కనబెట్టి, తెలం గాణలో మీ కల్వకుంట్ల స్కామ్‌ల గురించి చెప్పాలని డిమాండ్ చేశారు. దళితబంధులో 30 శాతం కమీషన్లు దండుకుంటున్నామని స్వయంగా మీ అయ్యనే ఒప్పుకున్న సంగతి మరచిపోయావా? అని ఎద్దేవా చేశారు. లిక్కర్ స్కామ్‌లో మీ చెల్లి రూ.300 కోట్లు వెనకేసిం దని దేశమంతా కోడైకూస్తోందన్నారు. భూము లు, లిక్కర్ అమ్మితే తప్ప తెలంగాణలో పాలన నడుస్తలేదని కాగ్ కడిగేసిన విషయం తెలియదా? అని ప్రశ్నించారు. 'తెలంగాణలో ఎన్ని ప్రభుత్వ భూములను అమ్ముకున్నరో, ఎన్ని ఎకరాలను మీ రియల్ ఎస్టేట్ మాఫియాకు కట్టబెట్టింర్రో, ఎంత మంది మీ బినామీ బిల్డర్లతో హైదరాబాద్ మాఫియా సామ్రాజ్యాన్ని నడిపిస్తున్నరో, ఎన్ని లక్షల చదరపు అడుగుల స్థలాలు మీ మాఫియా కబంధ హస్తాల్లో చిక్కుకున్నయో, అన్నీ లెక్కలతో సహా తేలుస్తాం.కాంగ్రెస్‌ను అడ్డుకోవడం నీ వల్ల కాదు. నీ అయ్య వల్ల కూడా కాదు' అని హెచ్చరించారు.

బీఆర్‌ఎస్ లూట్...సూట్ సర్కారు : కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

బీఆర్ఎంది లూట్, సూట్ సర్కార్ అంటూ ఎంపి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ 'కే' టాక్స్ (కల్వకుంట్ల టాక్స్) వసూలు చేయడానికి అలవాటు పడిందని విమర్శించారు. కే టాక్స్ రూపంలో రూ.1000 కోట్లు వసూలు చేశారని ఆరోపించారు.

కేటీఆర్ ఎజెండా ఫ్యామిలీ ఫస్ట్, ప్రజలు లాస్ట్ అని ఎద్దేవా చేశారు. ఇదే తొమ్మిదేండ్లుగా బీఆర్‌ఎస్ చేస్తున్నదని తెలిపారు. మోసగాడు అయిన కేసీఆర్ ప్రజలను వంచనకు గురిచేస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ అకౌంట్‌లో రూ.900 కోట్లు, వారి బినామీల అకౌంట్‌లో రూ.90 వేల కోట్లు జమ చేసుకున్నారని అన్నారు. 2024లో ఏర్పడనున్న కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి పరులను జైలుకు పంపడం ఖాయమని స్పష్టం చేశారు.

హామీల అమలుపై అలసత్వం..!

కార్మికులకు నెరవేరని సొంతింటి కల

- మారుపేర్ల సవరణలోనూ తీవ్రజాప్యం
- అపరిష్కృతంగా సింగరేణి కార్మికుల సమస్యలు
- నేడు మంచిర్యాల జిల్లాలో మంత్రి కేటీఆర్ పర్యటన
- త్వరలో సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు

సింగరేణి కార్మిక క్షేత్రంలో సమస్యలు యథాతథంగా ఉన్నాయి. కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై సందిగ్ధం నెలకొంది. 2018లో సింగరేణి ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలు కార్యరూపం దాల్చకపోవడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. కార్మికుల సొంతింటి కల నెరవేరకపోవడం.. మారుపేర్ల సవరణలోనూ తీవ్ర జాప్యం కావడం వంటి సమస్యలు అలాగే ఉన్నాయి. మరోపక్క ఈనెల 28వ తేదీన సింగరేణి ఎన్నికలు నిర్వహించేందుకు యాజమాన్యం సన్నాహాలు చేస్తుండటంతో గుర్తింపు సంఘమైన టీబీజీకేఎస్‌కు ఇబ్బందికర పరిస్థితి ఎదురు కానుందనే సంకేతాలు వినిపిస్తున్నాయి. అప్పట్లో ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో కొత్త గనుల ప్రారంభం తప్పితే ఏదీ పరిష్కారం కాలేదు. ఆదివారం మంత్రి కేటీఆర్ మంచిర్యాల జిల్లాలోని మందమర్రి, రామకృష్ణాపూర్ ప్రాంతాల్లో పర్యటించనున్నారు.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

నల్లబంగారు నేలగా పిలువబడే సింగరేణిలో కార్మికులు అనేక సమస్యలతో సతమతమవుతున్నాయి. ఎన్నో ఏండ్లుగా పరిష్కారానికి నోచుకోకపోవడంతో తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. మరోపక్క 2018 ఏడాదిలో సింగరేణి ఎన్నికల సందర్భంగా ప్రభుత్వం కార్మికుల సంక్షేమం కోసం పలు హామీలు గుప్పించింది. ఎన్నికల్లో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం(టీబీజీకేఎస్)ను గెలిపిస్తే వివిధ సమస్యలు పరిష్కరిస్తామని భరోసా కల్పించింది. ఆరు కొత్త గనులను ప్రారంభిస్తామని, బ్లాక్‌లను సింగరేణికే అప్పగిస్తామని, కార్మికుల మారుపేర్లు సవరిస్తామని, వారసత్వ ఉద్యోగాలకు అర్హత వయసును 35ఏండ్ల నుంచి 40ఏండ్లకు పెంచుతామని, ఒక్కో కార్మికుడికి రూ.10లక్షలు వడ్డీలేని రుణం అందిస్తామని హామీనిచ్చింది. పది వేల కొత్త క్వార్టర్ల నిర్మాణంతోపాటు కార్మికుల సొంతింటి కలను నెరవేరుస్తామని ఆ సంఘం కార్మిక నేతలు భరోసా ఇచ్చారు. ప్రభుత్వం హామీలతో మెజార్టీ డివిజన్లల్లో టీబీజీకేఎస్‌కే కార్మికులు మద్దతు పలికి గెలిపించారు. కానీ, ఇచ్చిన హామీల్లో కొన్ని కొత్త గనులను తెరిపించిన ప్రభుత్వం మిగతా వాటిని విస్మరించిందనే ఆరోపణలున్నాయి. మరోపక్క వడ్డీలేని రుణం స్థానంలో కార్మికులే రుణం తీసుకుంటే కంపెనీనే ఆ రుణానికి వడ్డీ చెల్లిస్తుందని చెబుతుండటం కార్మికుల్లో అసంతృప్తికి కారణమవుతోంది. మరోపక్క మారుపేర్ల సవరణ లేకపోవడంతో కార్మికులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది.

మంత్రి పర్యటనపై ఆశలు..!

మంచిర్యాల జిల్లా మందమర్రి, రామకృష్ణాపూర్‌లో మంత్రి కేటీఆర్ ఆదివారం పర్యటించనున్నారు. పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు ఇదే నెల చివరి వారంలో జరగనున్నాయి. ఈ క్రమంలో మంత్రి కేటీఆర్ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. గతంలో ఇచ్చిన హామీలను ప్రస్తావిస్తారని.. వాటి పరిష్కారానికి భరోసా లభిస్తుందని కార్మికులు ఆశలు పెట్టుకున్నారు. వారసత్వం కోల్పోయిన వారు సుమారు వంద మంది ఉంటారు. వీరికి ఇప్పటి వరకు ఉద్యోగాలు కల్పించలేదు. ఏండ్ల నుంచి ఉద్యోగాల కోసం నిరీక్షిస్తున్నా ఇప్పటికీ నెరవేరడం లేదు. తాజాగా వీరి ఉద్యోగాల కల్పన అంశంపైనా ప్రభుత్వం ఏం నిర్ణయం తీసుకుంటుందనేది ఆసక్తిగా మారింది. మరోపక్క ఎన్నికలకు సమయం దగ్గర పడటంతో మరోసారి టీబీజీకేఎస్ ఎన్నికల్లో విజయం సాధించాలని భావిస్తోంది. ఈ తరుణంలో గతంలో ఇచ్చిన హామీల్లో అనేకం అపరిష్కృతంగా ఉన్నాయి. ఫలితంగా టీబీజీకేఎస్ తరపున పోటీ చేసే ఆశావహులకు ఈ సమస్య ఇబ్బందికరంగా మారనుందనే ప్రచారం జరుగుతోంది. తాజాగా మంత్రి కేటీఆర్ జిల్లాలో పర్యటిస్తున్న దృష్ట్యా గతంలో ఇచ్చిన హామీలపై అమలుపై నిర్ణయం వెలువరిస్తారని కార్మికులు భావిస్తున్నారు. కొత్తగా ఇంకా ఏమైనా హామీలు ఇస్తారా అని కార్మికులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మంత్రి నుంచి సానుకూల ప్రకటన వచ్చే అవకాశం ఉందని కార్మికవర్గంలో చర్చ జరుగుతోంది.

రేషన్ డీలర్ల కమీషన్ టన్నుకు రూ.1,400కు పెంపు

- ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రేషన్ డీలర్లకు టన్నుకు ఇస్తున్న కమిషన్‌ను రూ.700 నుంచి రూ.1,400కు రాష్ట్ర ప్రభుత్వం పెంచింది. దానికి సంబంధించిన ఉత్తర్వులను విడుదల చేసింది. శనివారం హైదరాబాద్‌లో పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ తనను కలిసిన రేషన్ డీలర్ల జేఏసీ ప్రతినిధులకు జీవో కాపీని అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రేషన్ డీలర్లకు ఇచ్చిన హామీని కేసీఆర్ ప్రభుత్వం నిలబెట్టుకుందని తెలిపారు. తాజా నిర్ణయంతో రాష్ట్రంలో 17 వేలకుపైగా రేషన్ డీలర్ల కుటుంబాలకు లబ్ధి కలుగుతుందని చెప్పారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది రాకుండా సేవలందించాలని డీలర్లను మంత్రి కోరారు. ఈ సందర్భంగా జేఏసీ ప్రతినిధులు, సీఎం కేసీఆర్‌కు, మంత్రి గంగులకు ధన్యవాదాలు తెలిపారు.

స్వామినాథన్ కు భారతరత్న అవార్డు ఇవ్వాలి : మంత్రి నిరంజన్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఎంఎస్ స్వామినాథన్‌కు భారతరత్న ఇవ్వడం ద్వారా శాస్త్రవేత్తలను, రైతాంగాన్ని, వ్యవసాయరంగాన్ని గౌరవించినట్టు అవుతుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన లాంటి వారు యుగానికొక్కరు పుడతారని గుర్తు చేశారు. శనివారం చెన్నైలోని తారామణిలో భారత హరితవిప్లవ పితామహుడు, సుప్రసిద్ధ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ స్వామినాథన్ భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియలలో మంత్రితోపాటు వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, సీడ్స్ ఎండీ కేశవులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో ఆకలితో అలమటించి లక్షలాది మంది చనిపోయిన పరిస్థితిని చూసి చలించి వైద్యవిద్యను వదిలేసి వ్యవసాయ విద్యను ఎంచుకుని పరిశోధకుడిగా మారిపోయారని గుర్తు చేశారు.

3 సార్లు మాట ఇచ్చి తప్పిన మోడీ

- ప్రజలకు క్షమాపణ చెప్పిన తర్వాతే ఈ గడ్డపై అడుగు పెట్టాలి : మంత్రి శ్రీనివాస్ గౌడ్



నవ తెలంగాణ- మహబూబ్ నగర్

వెనుకబడిన ప్రాంతానికి సాగు, తాగునీరు అందించే పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా ఇస్తామని మూడుసార్లు హామీ ఇచ్చి ప్రధాని నరేంద్ర మోడీ మాట తప్పారని మంత్రి డాక్టర్ వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శనివారం మంత్రి క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేసిన ప్రధాని మోడీ ఏ మొఖం పెట్టుకొని అక్టోబర్ 1న మహబూబ్‌నగర్ జిల్లా పర్యటనకు వస్తున్నారని ప్రశ్నించారు. ఈ ప్రాంత ప్రజలకు క్షమాపణ చెప్పిన తర్వాతే ఈ గడ్డపై అడుగు పెట్టాలని డిమాండ్ చేశారు.

ఏ చిన్న అవకాశం దొరికినా తెలంగాణపై విషం చిమ్మే ప్రధానికి పాలమూరుపై పాదం మోపే అర్హత లేదన్నారు. ఇప్పుడు ప్రధాని పాల్గొంటున్న బహిరంగ సభ వేదికపైనే గతంలో పాలమూరు- ప్రాజెక్టుకు జాతీయ హెూదా ఇస్తామని చెప్పారని గుర్తు చేశారు. కులం, మతం పేరిట ప్రజలను రెచ్చగొట్టడం ద్వారా ప్రశాంతంగా ఉన్న పాలమూరును అల్లకల్లోలం చేసేందుకు వస్తున్నారా అని ప్రశ్నించారు. పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా అడిగిన సందర్భంలో ఇకపై ఏ ప్రాజెక్టుకూ ఇవ్వబోమని పార్లమెంటు సాక్షిగా చెప్పిన బీజేపీ సర్కారు.. వెంటనే తెలంగాణకు ఎగువన ఉన్న కర్నాటకలోని అప్పర్ భద్ర ప్రాజెక్టుకు మాత్రం జాతీయ హోదా ఇచ్చిందని చెప్పారు. దివంగత సుష్మా స్వరాజ్ సహా అమిత్ షా కూడా ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి పెండింగ్‌లో ఉన్న కృష్ణా జలాల పంపిణీ విషయం త్వరగా తేల్చాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో మున్సిపల్ చైర్మెన్ కేసి నర్సింహులు, జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మెన్ రాజేశ్వర్ గౌడ్, జెడ్పీ వైస్ చైర్మెన్ యాదయ్య, మున్సిపల్ వైస్ చైర్మెన్ గణేష్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల పొర్లు దండాలు

- ఇకనైనా ప్రభుత్వం కనికరించాలని వినతి



నవతెలంగాణ- విలేకరులు

సమస్యలను పరిష్కరించాలని, వేతనాలు పెంచాలని సమ్మెలో ఉన్న అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు శనివారం పొర్లు దండాలు పెట్టి ప్రభుత్వానికి తమ నిరసన తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ మొర ఆలకించాలని విన్నవించారు.

రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో సీఐటీయూ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు భిక్షాటన చేశారు. ఇబ్రహీంపట్నంలో పొర్లుదండాలతో ముఖ్యమంత్రికి నిరసన వ్యక్తం తెలిపారు. వికారాబాద్ జిల్లా యాలాలలో చేపట్టిన సమ్మెకు వ్యకాస జిల్లా అధ్యక్షులు బుగ్గప్ప మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగులగొట్టిన ఐసీడీఎస్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని కొండగట్టు అంజన్న ఆలయంలో అంగన్‌వాడీ ఉద్యోగులు అంజన్నకు ముడుపు కట్టి పొర్లు దండాలు పెట్టారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్ కలెక్టరేట్ల ఎదుట అంగన్‌వాడీలు పొర్లు దండాలు పెడుతూ నిరసన తెలిపారు. ఆసిఫాబాద్‌లో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్, ఆదిలాబాద్‌లో జిల్లా అధ్యక్షుడు ఆశన్న పాల్గొన్నారు.

ఖమ్మం జిల్లా బోనకల్ మండల కేంద్రంలో అంగన్‌వాడీలకు దీక్షాశిబిరాన్ని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క సందర్శించి సంఘీభావం తెలిపారు. ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యకర్తల డిమాండ్లు న్యాయమైనవి అన్నారు. మధిరలో అంబేద్కర్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండల కేంద్రంలోని రామాలయంలో పొర్లు దండాలు పెట్టారు. చర్లలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు.

నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్‌వాడీల సమ్మె కొనసాగింది. మర్రిగూడ మండలంలో వంటావార్పు నిర్వహించారు. యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలో అంగన్‌వాడీలు చెవిలో పూలు పెట్టుకొని నిరసన తెలిపారు. ఆలేరులోని సాయిబాబా గుడి వద్ద అంగన్‌వాడీలు పొర్లుదండాలు పెట్టి నిరసన తెలిపారు.

మహిళారక్షిత సమాజం నిర్మిద్దాం

- రాష్ట్రంలో తగ్గిన మాతా శిశుమరణాలు
- స్త్రీ, శిశుసంక్షేమానికి ప్రభుత్వం కృషి : రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి

నవతెలంగాణ- రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

మహిళారక్షిత సమాజం నిర్మిద్దామని, మహిళలకు అండగా నిలుద్దామని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. పోషకాహార లోపాన్ని నివారించి, ఆరోగ్య సమాజాన్ని నిర్మిద్దామని పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా చిలుకూరులోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా ప్రాంగణంలో రాష్ట్ర మహిళా కమిషన్ ఆధ్వర్యంలో శనివారం 'పోషణ మహా' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సునీతాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, పిల్లలు పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యవంతులుగా ఉండాలని చెప్పారు. అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలతో పోషణ పంచాయతీ కమిటీల సమావేశం ఏర్పాటు చేసి పోషణ లోపం, ఆరోగ్యంపై అవగాహనా సదస్సులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో న్యూట్రీగార్డెన్స్ ఏర్పాటు చేశారని తెలిపారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తిగా నిలిచాయన్నారు. ఆదివాసీ, గిరిజన మహిళలు, చిన్నారుల్లో పౌష్టికాహార లోపాన్ని శాశ్వతంగా దూరం చేసేందుకు తెలంగాణ సర్కారు 'గిరి పోషణ' కార్యక్రమాన్ని అమలు చేసిందన్నారు. మహిళలకు సమస్యలు ఎదురైనప్పుడు వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు కానీ మహిళా హెల్ప్‌లైన్ నంబర్ 181 లేదా తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ వాట్సప్ హెల్ప్‌లైన్ నంబర్ 9490555533కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా కమిషన్ సభ్యులు షాహీన్ అఫ్రోజ్, కుమ్ర ఈశ్వరి భాయ్, కటారి రేవతిరావు, గద్దల పద్మ, సుధాం లక్ష్మి, కటారి రేవతిరావు, డైరెక్టర్ శారద, సెక్రెటరీ కృష్ణకుమారి, డీఆర్డీవో ప్రభాకర్, సీడీపీవో సృజన తదితరులు పాల్గొన్నారు.

మహిళా హక్కులకు రక్షణ, భద్రత కల్పించాలి

అక్టోబర్ 5 న చలో ఢిల్లీ కార్యక్రమం : ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు అరుణ జ్యోతి



నవతెలంగాణ-భువనగిరి

మహిళల హక్కుల రక్షణ, ప్రజాస్వామ్య పరిరక్షణ భద్రత కల్పించాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు అరుణ జ్యోతి అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఐద్వా చేపట్టిన జీపుజాతాను శనివారం యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి పట్టణ కేంద్రంలో జెండా ఊపి ప్రారంభించారు. జీపు జాతా భువనగిరి, ఆలేరు, వలిగొండ, రామన్నపేట, పోచంపల్లి, చౌటుప్పల్, నారాయణపురం మండలం, చిన్నకొండురు గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన సభలో అరుణజ్యోతి మాట్లాడుతూ.. 2014లో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నిత్యావసర సరుకుల ధరలు 200 శాతం పెరిగాయన్నారు. గ్యాస్ ధర రూ.410 నుంచి రూ.1270 చేరుకుందన్నారు. ఎన్నికల నేపథ్యంలో కంటి తుడుపు చర్యగా కొద్దిపాటి ధర తగ్గించి ఎంతో చేశామని గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. ప్రజలకు సబ్సిడీలతో సేవలు అందిస్తున్న బ్యాంకులు బీఎస్ఎన్ఎల్, ఓఎన్‌జిసి, రైల్వేలు, పోర్టులు, సింగరేణి, విశాఖ ఉక్కు మొదలగు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మనువాద భావజాలాన్ని అమలు చేయాలని ఆర్ఎస్ఎస్ అడుగుజాడల్లో బీజేపీ ప్రభుత్వాన్ని నడిపిస్తోందని విమర్శించారు. మహిళలకు రక్షణ లేని పరిస్థితులు దాపురిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దాడులకు గురైన వారిని పట్టించుకోకుండా దోషులను రక్షిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై దాడులకు మహిళలే కారణమన్నట్టుగా బీజేపీ మంత్రులు, నాయకులు మాట్లాడుతున్నారన్నారు.

హనుమకొండలో తొమ్మిది నెలల పసిపాప, హైదరాబాదులో ఆరు సంవత్సరాల బాలిక చైత్రను, 60 సంవత్సరాల వృద్ధురాలు, బొమ్మలరామారం మండలం హాజీపూర్ గ్రామంలో విద్యార్థినులు ఏ రకమైన వస్త్రధారణ ధరించి పురుషులను రెచ్చగొట్టారో చెప్పాలని డిమాండ్ చేశారు. దేశ భద్రత, మహిళల భద్రత కోసం మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యం దేశవ్యాప్తంగా ప్రజలను చైతన్యం చేసేందుకు ఐద్వా ఆధ్వర్యంలో జీపు జాతాలు, పాదయాత్రలు చేపట్టినట్టు చెప్పారు. అందులో భాగంగానే రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో జీపుజాతా సాగుతోందన్నారు. అక్టోబర్ 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. చట్ట సభల్లో వేంటనే 33 శాతం మహిళా రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఐద్వా భువనగిరి జిల్లా కార్యదర్శి బట్టుపల్లి అనురాధ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ కూడా అధికారంలోకి రాకముందు పేదలందరికీ ఇల్లు కట్టిస్తామని హామీనిచ్చి విస్మరించాయన్నారు. అర్హులైన పేదలందరికీ 125 గజాల ప్రభుత్వ స్థలం ఇచ్చి.. ఇంటి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.10 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రేషన్ షాపుల ద్వారా తమిళనాడు, కేరళ రాష్ట్రాలు ఇస్తున్నట్టుగా 14 రకాల నిత్యావసర సరుకులు సబ్సిడీ ధరకి ఇవ్వాలని కోరారు. ఈ జీపు జాతాలో ఐద్వా జిల్లా అధ్యక్షులు అవ్వారు రామేశ్వరి, జిల్లా సహాయ కార్యదర్శి దోనూరు నిర్మల, జిల్లా కోశాధికారి కల్లూరి నాగమణి, నాయకులు మల్లెపల్లి లలిత, ఎండి రేష్మ, కొత్త లలిత పాల్గొన్నారు.

పెరిగిన మెస్ చార్జీలను అమలు చేయాలి



- సంక్షేమ హాస్టళ్లపై చిత్తశుద్ధి లేని సర్కార్ : ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్.మూర్తి

నవతెలంగాణ-జఫర్‌గడ్

సంక్షేమ హాస్టళ్లలో పెంచిన మెస్ చార్జీలను వెంటనే అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్.మూర్తి అన్నారు. జనగామ జిల్లా జఫర్‌గడ్ మండల కేంద్రంలో శనివారం 'విద్యా రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు' అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎల్.మూర్తి మాట్లాడుతూ.. దేశంలో అందరికీ విద్య అందించాలని రాజ్యాంగం చెప్తుంది కానీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చదువుకున్న వారికి ఉద్యోగాలు కల్పించకుండా నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయన్నారు. అంబేద్కర్ లాంటి మహానుభావులను ఆదర్శం చేసుకొని చదవాలని విద్యార్థులకు సూచించారు. సంక్షేమ హాస్టల్లో పేద మధ్యతరగతి విద్యార్థుల చదువుతున్నారన్నారు. కనీసం వాళ్లకు పౌష్టిక ఆహారం పెట్టాలన్న సోయి ప్రభుత్వానికి లేదని విమర్శించారు. సంక్షేమ వసతి గృహాలకు సొంత భవనాలు లేక.. అద్దె భవనాల్లో అరకొర వసతుల మధ్య విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఎన్నికలపై ఉన్న శ్రద్ధ విద్యార్థుల భవిష్యత్‌పై ఎందుకు లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా మంత్రులు, విద్యా శాఖ అధికారులు స్పందించి సంక్షేమ హాస్టళ్లను సందర్శించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే భవిష్యత్‌లో పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. విద్యాశాఖ మంత్రి ఇంటిని ముట్టడిస్తామన్నారు. పెంచిన మెస్ చార్జీలకు సంబంధించి వెంటనే జీవోలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.5,177 కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సందీప్, ధర్మభిక్షం, జిల్లా సహాయ కార్యదర్శి యకన్న రాథోడ్, మండల కార్యదర్శి అర్జున్, ఉస్మానియా యూనివర్సిటీ రీసెర్చ్ విద్యార్థి ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రయినేజీలో పడి మహిళా హెడ్ కానిస్టేబుల్ మృతి

- మంత్రి కేటీఆర్ బందోబస్తులో ఘటన

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

విధుల్లో ఉన్న మహిళా హెడ్‌కానిస్టేబుల్ ప్రమాదవశాత్తు డ్రయినేజీ కాలువలో పడి మృతిచెందారు. ఈ ఘటన శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. భద్రాచలంలో మంత్రి కేటీఆర్ పర్యటన నేపథ్యంలో బందోబస్తు నిమిత్తం కొత్తగూడెం వన్ టౌన్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ శ్రీదేవి భద్రాచలం వచ్చారు. అయితే, భారీ వర్షం వల్ల రోడ్లంతా నీటితో నిండి డ్రయినేజీ కూడా కనిపించకుండా పారుతోంది. ఆ సమయంలో రామాలయం వద్ద నుంచి శ్రీదేవి నడుచుకుంటూ వెళుతుండగా ప్రమాదవశాత్తు మురుగు కాలువలో పడిపోయారు. గమనించిన స్థానికులు ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందికి సమాచారం అందించారు. ఎన్డీఆర్ఎఫ్, పోలీస్, రెవెన్యూ,సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టగా శ్రీదేవి మృతదేహం కరకట్ట వద్ద లభ్యమయింది. దీంతో పోలీస్ శాఖలో తీవ్ర విషాదం నెలకొంది. శ్రీదేవి మృతదేహాన్ని చూసి తోటి మహిళా ఉద్యోగులు కన్నీటి పర్యంతమయ్యారు.

'గృహలక్ష్మి'లో అవకతవకలపై రాస్తారోకో

- బీఆర్ఎస్ నేతలనే ఎంపిక చేస్తున్నారని తండావాసుల ఆగ్రహం



నవతెలంగాణ-ఆత్మకూరుఎస్

సూర్యాపేట జిల్లా ఆత్మకూర్ఎస్ మండలంలోని కొత్తతండాలో గృహ లక్ష్మి పథకం అమలులో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ గ్రామస్తులు సూర్యాపేట - దంతాలపల్లి రహదారి పై శనివారం రాస్తారోకో చేశారు. రోడ్డుపై అడ్డంగా కట్టెలు వేశారు. ఈ సందర్భంగా కొత్తతండా మహి ళలు మాట్లాడుతూ.. అర్హులకు గృహలక్ష్మీ పథకం వర్తింపజేయకుండా అనర్హులైన అధికార పార్టీ నాయకులను ఎంపిక చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇండ్లు, వ్యవసాయ భూములు ఉండి బీఆర్ఎస్‌లో పనిచేస్తున్న వారినే ఎంపిక చేయడం ఏంటని ప్రశ్నించారు. అద్దె ఇంట్లో ఉంటూ కూలీ పనులు చేస్తున్న పేదలను ఎంపిక చేయకపోవడం దారుణమన్నారు. పోలీసులు తండావాసులకు సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు. అదేవిధంగా పాతర్లపహాడ్ ఎక్స్‌రోడ్డు వద్ద బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

వందల వేల సంవత్సరాలుగా మన దేశంలో అనేక మతాలు,విశ్వాసాలు గల ప్రజలు సహనంగానే జీవనాన్ని కొనసాగిస్తున్నారు.మతపరంగా వచ్చిన తగాదాలన్నీ రాజకీయ ఆధిపత్యవర్గాల వల్లనే అనేది తెలుసుకోవాల్సిన విషయం. ముఖ్యంగా దేవున్ని, ఆలయాలను, భక్తిని స్వార్థ రాజకీయానికి వాడుకునే చర్యలు పెరిగిన తరుణంలో ఇలాంటి సంఘటనలు ఎంతో స్ఫూర్తిని, సామరస్యాలను పెంపొందిస్తాయి.

ఇది కదా! భారత జీవనం

సంపాదకీయం

'హిందువులం, బంధువులం' ఎంత ఇరుకైన నినాదం! 'వసుధైక కుటుంబకమ్' కదా మన సంప్రదాయం. భారతీయులందరు నా సహోదరులు...అని కదూ మనం చిన్ననాటి నుండీ ప్రతిజ్ఞ చేస్తున్నాము. భారతీయులందరమూ బంధువులమే. అసలు మానవులందరూ ఒక జాతి కిందకే వస్తారు.మతాల ప్రాతిపదికన గిరి గీసుకుని పోతుంటే, అక్కడితో ఆగుతామా? కులం రాదూ! ప్రాంతం రాదూ! రంగు తేడాలు ఉత్తర దక్షిణాలు, జెండర్ బేధాలూ...భాషలూ.. ఇలా సమూహాలను విడగొట్టుకుంటూ పోతే గడ్డిపోచల్లా మిగిలిపోమూ! ఆ విభజన మొదలెయ్యటమే అమానవీయం. విభజించుకుంటూ వెలిపోవడటం మరింత దారుణం. అప్పుడు మనుషులుగా మిగలకుండా పోతాము చివరికి. ఆధునిక మానవుడు, అంతకు ముందున్న సమాజం కంటే ఉన్నత విలువను సమకూర్చుకున్నాడు. అభివృద్ధి చెందాడు. భౌతికంగానే కాదు ఆలోచనలో, ప్రవర్తనలో, విలువలలో ముందున్నాడు. తిరిగి వెనక్కి నడవడం కుదరదు. కాలం వెనక్కి తిరగదు. అయినా కొందరు ఆలోచనల్లో, ప్రవర్తనల్లో వెనక్కి నడిచే ప్రయత్నాలు చేస్తుంటారు. అందుకంత నష్టాన్ని ఆ సమూహం, సమాజం అనుభవిస్తుంది. అభివృద్ధి ఆగిపోతుంది. వెనక్కి మళ్లడం కొందరు బలవంతంగా చేసే పని మాత్రమే. సమాజ గమనం మాత్రం ముందుకే వుంటుంది. మన దేశ సమూహాల్లోనూ మానవీయ విలువలైన సౌహార్థత, సౌశీల్యం, సహనం, సోదరత్వం, సహజాతంగా కొనసాగుతూనే వున్నాయి. చరిత్రలోనైనా, వర్తమానంలోనూ జీవన గమనాలను పరిశీలిస్తే మనకు అవగాహన అవుతుంది.



దేశంలో మతం ఆధారంగా మనుషుల మధ్య విభేదాలను, విద్వేషాలను రెచ్చ గొడుతూ విధ్వంస రచన కొనసాగుతున్న తరుణంలో కూడా సామరస్య జీవనం ఎలా వుంటుందో ప్రజలు ఎరుక పరుస్తూనే వున్నారు. నిజంగా ప్రజలు దేవుడి మూలంగా ద్వేషాన్ని కలిగి వున్నారా? లేదు.నిజమైన భక్తులకు అల్లాహ్, రాముడు, యెహోవా ఎవరైనా ఒకటే. 'ఈశ్వర్ అల్లా తేరేనామ్ సబ్‌కో సమ్మతి దే భగవాన్' అని పాడుకొన్నవాళ్లం కదా! భక్తి విధానంలో భేదం వుండొచ్చు కానీ భక్తిలో విద్వేషం మాత్రం ఉండదు. విద్వేషాలు రెచ్చగొట్టేవారికి వున్న ప్రయోజనాలు వేరు. అవి కేవలం ఆధిపత్య రాజకీయ ప్రయోజనాలు మాత్రమే. అందుకే వారు వైషమ్యాలను ఎగదోస్తుంటారు. నిజమైన భక్తులు, సాధారణ ప్రజలు సామరస్యాన్ని కోరుకుంటారు. అందుకు చక్కని ఉదాహరణ మొన్న జరిగిన గణపతి ఉత్సవాలు. గణపతి నిమజ్జన ఊరేగింపుల సందర్భంగానే, అదే రోజు ముస్లింలు ముఖ్యంగా జరుపుకునే మిలాదున్నబీ కూడా వచ్చింది. ఈ సందర్భంగా వారు కూడా ప్రదర్శనలు తీయటం ఆనవాయితీగా వస్తున్నది. అయితే వైరుధ్యాలను సృష్టించాలనుకునేవారు వీటిని ఆసరా చేసుకుని గొడవలు రేపుతారు. అందుకని సహనంతో ఆలోచించిన మతపెద్దలు, మిలాదున్‌నబీని నిమజ్జనం రోజుకాక అక్టోబరు ఒకటిన జరుపుకోవాలని నిర్ణయించడం, అందరికీ విజ్ఞప్తి చేయడం సామరస్యతకు దారులు వేసింది. ఇది అందరి అభినందనలను పొందుతున్నది. అంతేకాదు గణపతి నిమజ్జన ఊరేగింపు జరుగుతున్న దారులలో ముఖ్యంగా హైదరాబాద్ పాత నగరంలోని ముస్లిం సోదరులు విఘ్నేశ్వరుని విగ్రహాలతో వున్న భక్తులకు స్వాగతం పలకడం, వారికి మంచినీళ్లు, ఆహారపు పొట్లాలు పంపిణీ చేయడం చూస్తుంటే హైదరాబాద్ గంగా జమునా తహజీబ్ సంస్కృతి కాపాడుతున్నట్లుగా, మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుంది.

ఇంతేకాదు కొన్ని విషయాలను గమనిస్తే ప్రజల్లో ఇప్పటికీ ఎంతో గొప్ప సహనశీలత, సౌభ్రాతృత్వం కనిపిస్తుంది. దానికీ ఈ గణపతి ఉత్సవాలనే తీసుకుంటే, ఆదిలాబాద్‌లో గణపతి మండపం వద్ద వేలం వేసే లడ్డూను ఒక ముస్లిం యువకుడు షేక్ ఆసీఫ్ లక్షా రెండు వేలకు పాడి దక్కించుకోవటం సాధారణంగా జరిగిపోయింది. అదే విధంగా వరంగల్ జిల్లా రంగశాయిపేటలోని యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణపతి లడ్డూ వేలంలో కూడా ఎండీ నయిముద్దీన్ అనే యువకుడు లడ్డూను పొందటం, ప్రజలు మతాతీతంగా అభిమానాలను చాటుకుంటారనడానికి ఉదాహరణగా నిలుస్తుంది. ఇక హైదరాబాద్ బండ్లగూడ రిచ్మండ్ విల్లాలోని వినాయకుని లడ్డూను, అక్కడి కమ్యూనిటీ అంతా కలిసి రూ.ఒక కోటీ 26లక్షలకు కొనుగోలు చేశారు. ఆ లడ్డూ కొనుక్కున్న ప్రజల్లో అన్ని మతాలవారు హిందువులు, సిక్కులు, ముస్లింలు, క్రైస్తవులు వున్నారు. ఆ వచ్చిన డబ్బులతో వారు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిసింది. ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఇట్లాంటి ప్రజల మధ్య లేనిపోని ద్వేషాలను పెంచాలని చేస్తున్న ప్రయత్నాలు కొంతకాలనికైనా వమ్ముకాక తప్పదు.

వందల వేల సంవత్సరాలుగా మన దేశంలో అనేక మతాలు,విశ్వాసాలు గల ప్రజలు సహనంగానే జీవనాన్ని కొనసాగిస్తున్నారు.మతపరంగా వచ్చిన తగాదాలన్నీ రాజకీయ ఆధిపత్యవర్గాల వల్లనే అనేది తెలుసుకోవాల్సిన విషయం. ముఖ్యంగా దేవున్ని, ఆలయాలను, భక్తిని స్వార్థ రాజకీయానికి వాడుకునే చర్యలు పెరిగిన తరుణంలో ఇలాంటి సంఘటనలు ఎంతో స్ఫూర్తిని, సామరస్యాలను పెంపొందిస్తాయి. ■

కెనడా, భారత్ వివాదం... వైరుధ్యాల సంక్లిష్టత



తెలకపల్లి రవి

ప్రధాని నరేంద్ర మోడీ హయాంలో దేశంలో పెరిగిన విద్వేషాల సెగ ఇప్పుడు విదేశాలకూ తాకుతున్నదా? విశ్వగురు బిరుదుతో వూరేగుతామనుకుంటే వివాదాలు కూడా విశ్వవ్యాపిత మవుతున్నాయా? అధీకృత దేశభక్తి జపం, దేశంలోనే గాక దేశం బయట కూడా మోడీ మోత మోగించి ఆ గొప్పలతో ఓట్లు కొల్లగొట్టాలనే ఎత్తుగడ బెడిసి కొడుతుందా? గత కొద్ది కాలంగా భారత కెనడాల మధ్య సాగుతున్న రాజకీయ దౌత్య వివాదం మరింత ప్రజ్వరిల్లడం ఆ కోణంలో చాలా ఆందోళన కరమవుతున్నది. పాకిస్తాన్‌ను మినహాయిస్తే మరే దేశంతోనూ ఈ తరహా సమస్యలో మన దేశం చిక్కుకున్న దాఖలాలు లేవు. అలా అని మనకు విదేశాంగ విధానంలో సమస్యలు సవాళ్లు లేనేలేవని కాదు..నిజానికి అమెరికా వత్తాసుగల పాకిస్తాన్ సాగించిన చొరబాట్లు ఎప్పుడూ వున్నాయి. అయితే వాటి తీరు వేరు. తమదేశంలో ఖలీస్తానీ వాది ఖలిస్తాన్ టైగర్‌ఫోర్స్ నాయకుడు హరదీప్‌సింగ్ నిజ్జర్‌ను భారతీయ నిఘా అధికారులే చొరబడి హత్య చేశారనేందుకు బలమైన సాక్ష్యాలున్నాయని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో తీవ్రస్థాయిలో ముందుకు తెచ్చిన ప్రస్తుత ఆరోపణ వాటన్నిటికీ మించింది. మొన్న జరిగిన జీ20 సమావేశాల సందర్భంలోనూ ఐక్యరాజ్యసమితి వేదిక మీదకూడా కెనడా ఈ ఆరోపణ రికార్డు వినిపిస్తూనే వుంది. కెనడాకు అమెరికా బాహాటంగానే మద్దతు పలికింది. పంచనేత్రాలు (ఫైవ్‌ఐ)గా చెప్పబడే కెనడా అమెరికా బ్రిటన్ న్యూజిలాండ్ ఆస్ట్రేలియాల నిఘా సంస్థలు ఇందుకు గొంతు కలుపుతున్నాయి.అంటే ఇది నెమ్మదిగా ఒక మన దేశంపై ఒక ఉమ్మడి ఫిర్యాదుగా మారుతున్న మాట. వీటిని సకాలంలో సజావుగా పరిష్కరించుకోవలసిన బాధ్యత మనదేశంపై వుంది. లేకపోతే కెనడా భారత సంబంధాలకే గాక ఇతర దేశాలతో మన సంబంధాలకూ విఘాతం కలగొచ్చు. శాంతి కాముక దేశంగా మనకున్న ప్రతిష్ట దెబ్బతినవచ్చు.

విచ్చిన్న ఉద్యమ విషాద ఫలితాలు

1980లలో భారతేదశంలో ఖలీస్తానీ వుగ్రవాదం ప్రమాదకరంగా పెరిగిన సంగతి మర్చిపోలేము. ఈ దేశంలో కన్నా ముందు దాని ఛాయలు కెనడాలోనే ప్రత్యక్షమైనాయి. ఇండియా తర్వాత సిక్కులు అధిక సంఖ్యలో వుండేది కెనడాలోనే.ఆ దేశ జనాభాలో దాదాపు 1.8 శాతం సిక్కులున్నారు. ప్రస్తుత ట్రూడో మంత్రివర్గంలోనే నలుగురు సిక్కులున్నారు. జగ్‌జిత్‌సింగ్ చౌహాన్ అనే ఆయన అక్కడ నుంచి విచ్ఛిన్నకర సందేశాలు పంపుతుండేవాడు. నిజానికి ఆ సమయంలో ఈశాన్య భారతంలోనే విచ్ఛిన్న శక్తులకు అమెరికా కూటమి ప్రోద్బలముండేది, నెమ్మదిగా ఆ పన్నాగాలు ఫలించి పంజాబ్ అగ్నిగుండమైంది. దేశమే అల్లాడిపోయింది. వేల మంది ఉగ్రవాదానికి బలి కావడం, భింద్రన్‌వాలే స్వర్ణ దేవాలయంలో తిష్టవేయడంతో ఆపరేషన్ బ్లూస్టార్, దాని పర్యవసానంగా నాటి ప్రధాని ఇందిరాగాంధీ హత్య వంటి తీవ్ర పరిణామాలు చూశాము. పంజాబ్ ముఖ్యమంత్రి దర్బారాసింగ్ కూడా ఉగ్రవాదులకు బలైపోయారు. తల్వీందర్ సింగ్‌పర్మార్ అనే ఉగ్రవాదిని అప్పగించాలని ఇండియా ఎంతకోరినా కెనడా పెడచెవిని పెట్టింది. 1985లో కనిష్క విమానం పేల్చివేసి 329 మంది మృతికి కారణమైన కుట్రదారుడుగా అతని పేరు బయటకు వచ్చింది. ఉత్తరోత్తరా పంజాబ్‌లో పరిస్థితి కొంత అదుపులోకి వచ్చినా విదేశీ నేలపైన మాత్రం అవి ఏదో రూపంలో కొనసాగుతూనే వున్నాయి.ఈ నలభై ఏళ్లలో ప్రపంచం చాలా ఒడుదుడుకులు చూసింది. మితవాద శక్తులు అభివృద్ధి నిరోధక దోరణులు ప్రాబల్యం పెంచుకున్నాయి. నరేంద్ర మోడీ ప్రభుత్వ హయాంలో దేశంలోనూ హిందూత్వ పేరిట మతతత్వ ధోరణులు ప్రబలుతున్న పరిస్థితి. ఈదేశంలోనే హిందూ రాష్ట్రమంటుంటే మేం ఎందుకు ఖలిస్తాన్ అడగొద్దని కెనడాలో ఈ శక్తులు మళ్లీ తలెత్తడం వాస్తవమే. నిజానికి ఆ దేశంలోనే గాక పైన చెప్పిన అయిదు దేశాల్లో కూడా రకరకాలైన భారత వ్యతిరేక శక్తులు గతంలో వలెనే ఇప్పుడు కూడా ప్రచారాలు కార్యకాలాపాలు సాగిస్తుంటే ఆ దేశాల పాలకులు యథేచ్ఛగా సాగనిస్తున్నారు. మరోవైపున దేశంలో మత రాజకీయాలకు తోడు మోడీ భజన పెంచుకోవడానికి హిందూత్వ ముద్రతో విదేశాల్లోనూ ప్రచారాలు చేసిన నేపథ్యం బీజేపీది. టెర్రరిజంపై పోరాటం పేరిట అమెరికాకు ఉపగ్రహంగా మారింది. వైట్‌హౌస్‌లో దీపావళి చేశారని యోగా దినోత్సవం ఐరాస నిర్వహించిందనీ అన్నిటినీ ఆ దిశలోనే చూపించే ప్రయత్నం పెద్ద ఎత్తున జరిగింది. అమెరికా అధ్యక్షుడుగా ట్రంప్ వున్నప్పుడు ఇది పరాకాష్టకు చేరడం చూశాం. ఇలా మోడీ సర్కారును తమతో తిప్పుకుంటూనే పాశ్చాత్య దేశాలు అక్కడున్న వివిధ రకాల విచ్ఛిన్న శక్తులను స్వప్రయోజనాలకు ఉపయోగించాయి. ఎందుకంటే వర్ధమాన దేశాలు సుస్థిరంగా వుండటం వాటి ప్రయోజనాలకే విరుద్ధం.

ఈ దేశంలోనే హిందూ రాష్ట్రమంటుంటే మేం ఎందుకు ఖలిస్తాన్ అడగొద్దని కెనడాలో ఈ శక్తులు మళ్లీ తలెత్తడం వాస్తవమే. నిజానికి ఆ దేశంలోనే గాక పైన చెప్పిన అయిదు దేశాల్లో కూడా రకరకాలైన భారత వ్యతిరేక శక్తులు గతంలో వలెనే ఇప్పుడు కూడా ప్రచారాలు కార్యకలాపాలు సాగిస్తుంటే ఆ దేశాల పాలకులు యథేచ్ఛగా సాగనిస్తున్నారు. మరో వైపున దేశంలో మత రాజకీయాలకు తోడు మోడీ భజన పెంచుకోవడానికి హిందూత్వ ముద్రతో విదేశాల్లోనూ ప్రచారాలు చేసిన నేపథ్యం బీజేపీది. టెర్రరిజంపై పోరాటం పేరిట అమెరికాకు ఉపగ్రహంగా మారింది.

ఖలీస్తానీ పీఠంగా కెనడా

జీ7 ఆర్థిక కూటమిలో కెనడా ఒక కీలక భాగస్వామ్య దేశం. అమెరికాలా ప్రత్యక్షంగా ప్రపంచ రాజకీయాలలో ముఖ్యపాత్రలో కనిపించకపోయినా పెట్టుబడిదారీ కూటమిలో దానికి బలమైన స్థానమే వుంది. ఇండియాతో వ్యాపార సంబంధాలు పాటించే దేశాలలో కెనడాది పదోస్థానం. దేశంలో పెట్టుబడులు పెట్టిన విదేశాలలో 4500 కోట్ల డాలర్లతో దానికి నాలుగో స్థానం. భారతీయులు కెనడాలో పెద్ద సంఖ్యలోనే వున్నారు. సిక్కులు ప్రధానంగా వున్నా మళయాలీలు తెలుగువారు కూడా తక్కువ కాదు. ఆ దేశ రాజకీయ ఫలితాలను కూడా వీరు ప్రభావితం చేయగలరు. బీజేపీ గద్దెక్కిన తర్వాతనే వారు మళ్లీ సిక్కులకు స్వంతదేశంగా ఖలిస్తాన్ కావాలనే పాట ఎత్తుకున్నారు.అంతటితో ఆగక అక్కడున్న హిందువులు కెనడా వదలిపోవాలని బెదిరించడం ప్రారంభించారు. అమెరికాలోని ఖలిస్తానీ ఉగ్రవాది గురుప్రీత్ పన్నుం ఇందుకు నాయకత్వం వహించాడు. అమెరికా, కెనడా ఇరుదేశాల పౌరసత్వం గల పన్నుం వాస్తవానికి సిఐఎ ఏజెంటనే సందేహాలున్నాయి. పంజాబ్‌లోని అతని ఆస్తులను ప్రభుత్వం స్వాధీన పర్చుకుంది. ఖలిస్తానీల చర్యల వల్ల పెరుగుతున్న ఉద్రిక్తతలను అదుపు చేయాలనీ, ఆ శక్తులకు అవకాశమివ్వద్దనీ ఎంత కోరినా కెనడా అలసత్వమే ప్రదర్శించింది. ముఖ్యంగా నిజ్జర్ నాయకత్వంలోని ఖలిస్తాన్ టైగర్ ఫోర్స్ అనే సంస్థ అనేక ఉగ్రవాద చర్యలకు పాల్పడింది. తనను అప్పగించాలని ఇండియా ఎప్పటినుంచో కోరుతూ వచ్చింది. కెనడా ప్రభుత్వానికి ఆధారాలు సమర్పించింది. అయినా ప్రయోజనం లేకపోగా వారికి వత్తాసు లభించింది. ఈ నేపథ్యంలోనే మొన్న జులైలో వాంకోవర్ సమీపంలో సర్రే అనే చోట గల గురుద్వారా దగ్గర నిజర్ హత్యకు గురైనాడు. దీనిపై దర్యాప్తు జరిపి దోషులను శిక్షించడం మానేసి కెనడా ఇందులో భారత దేశ హస్తం వుందని ఆరోపణలు చేస్తున్నది. రహస్య గూఢచారి సంస్థ రా ఏజెంట్లు పాల్గొన్నారని అంటోంది. ఇందుకు సంబంధించిన ఆధారాలు జీ20 సందర్భంలో ప్రధాని మోడీకి అప్పగించినా ఫలితం లేదని ఆరోపిస్తున్నది. మరోవైపున భారత్ విదేశాలలో చొరబడి హత్యలు చేయించే పద్ధతి తమకు లేదని ఖండించింది. కెనడా ప్రధాని ట్రూడే చెబుతున్నది తమ దేశ విధానంతో పొసగదని విదేశాంగ మంత్రి జైశంకర్ తాజాగా అమెరికాలో వివరించారు. సరైన సాక్ష్యాధారాలు అందిస్తే పరిశీలిస్తామన్నారు. కాని కెనడా చెప్పే విషయం సీరియస్‌గా తీసుకోవాలని అమెరికా విదేశాంగ మంత్రి బ్లింకెన్ కూడా గట్టిగా కోరారు. ఇంత బాధ్యతాయుతంగా ఫిర్యాదు చేస్తుంటే ఆ స్థాయిలో స్పందన వుండాలని అమెరికా అంటుంది. 28వ తేదీన జైశంకర్ బ్లింకెన్‌తో చర్చలు జరిపారు కూడా. 1980ల నుంచి కెనడా ఖలీస్తానీ వాదుల కార్యకలాపాలకు స్థానం కల్పిస్తున్నదని ఆయన



మరోసారి ఆరోపించారు. నేరపూరిత శక్తులు,మానవ రవాణా, విచ్ఛిన్నమూకల కలయికగా కెనడా మారిపోయిందని విమర్శించారు. ఆఖరుకు భారత రాయబార వర్గాలకు కూడా కెనడాలో రక్షణ లేకుండా పోయిందన్నారు. మొత్తంపైన కెనడా ఫిర్యాదును భారత దేశం పూర్తిగా తోసిపుచ్చడమేగాక ప్రత్యారోపణలు చేస్తున్నదన్నమాట. ఆ విధంగా ఇరుదేశాల సంబంధాలు వేగంగా దిగజారాయి.

అంతర్గత రాజకీయ కోణాలు

జీ20 సమావేశాల సందర్భంలోనూ మోడీ ట్రూడే పది నిముషాలు మాత్రమే అది కూడా ఏదో వేరే సందర్భంలో మాట్లాడుకున్నారు. మరోవంక 14 దేశాలతో ద్వైపాక్షిక చర్చలు జరిపిన మోడీ ఆయన కలవలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.ఆ వెంటనే కెనడా భారత రాయబార కార్యాలయంలో ఒకరిని బహిష్కరించడం, ఢిల్లీలో కెనడా రాయబార సిబ్బందిని వెనక్కుపంపడం వెంటవెంటనే జరిగిపోయాయి. వాణిజ్య చర్చలను కూడా కెనడానిలిపేసింది. ఇక ఇండియా కెనడా వారికి వీసాలను ఆపేసింది.ఐరాస వేదికపై కెనడా ధోరణిని ఖండిస్తూ మంత్రి జైశంకర్ ఉగ్రవాదంపై పోరాటం తమ ఇష్టాలను బట్టి మారిపోకూడదని అంటే ఇతర దేశాల్లో తలదూర్చే ధోరణి ప్రజాస్వామ్యం కాదని ఆ ఆదేశం ఎదురు ఆరోపించింది. ఈ వూపులోనే చైనాతో కెనడాకు నిగూఢ సంబంధాలున్నాయనే ఆరోపణ కూడా భారత వైఖరికి కారణమంటున్నారు. ఈ విధంగా కెనడాకు గట్టిపాఠం నేర్పాలనే మోడీ వైఖరి సరైందని కొందరు కీర్తిస్తున్నారు. వచ్చే ఎన్నికల నాటికి మరో పుల్వామాలా మరో సర్జికల్ స్ట్రయిక్‌గా దీన్ని ఉపయోగిస్తున్నారా అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఇదే సమయంలో పాకిస్తాన్ కెనడాకు మద్దతుగా మాట్లాడటం కూడా ఈ శక్తులకు వూతమిస్తున్నది.

అనేక కోణాల్లో చూసినపుడు ఈ దౌత్య సంఘర్షణ వెనక బలమైన అంతర్జాతీయ కారణాలు కనిపిస్తాయి. వచ్చే ఎన్నికల రాజకీయాలలో మోడీ తలమునకలవుతున్నట్టే ట్రూడే మరింత తీవ్ర సవాళ్లు ఎదుర్కొంటున్నారు. లిబరల్ పార్టీ నాయకుడైన ట్రూడే అసంతృప్తికి ఎదురీదుతున్నారు. తను అధికారంలో కొనసాగాలంటే ఖలీస్తానీ అనుకూలమైన న్యూ డెమొక్రటిక్ పార్టీ మద్దతు తప్పనిసరి. ఖలిస్తానీ మద్దతుదారులను బుజ్జగించడానికి ఒక దారి మళ్లింపు ఎత్తుగడ అవసరమైందంటున్నారు. ఏదో విధంగా పట్టు చూపించుకోకపోతే తనను తప్పించి మరొకరిని ప్రధాని అభ్యర్థిని చేస్తారనేది ఆయన భయం.అందుకే భారత్‌తో సంబంధాలు దెబ్బతింటాయని తెలిసీ ఈ రాజకీయ నాటకం నడిపిస్తున్నారని విమర్శకుల మాట.

మొత్తంపైన అనేక కోణాల్లో చూసినపుడు ఈ దౌత్య సంఘర్షణ వెనక బలమైన అంతర్జాతీయ కారణాలు కనిపిస్తాయి. వచ్చే ఎన్నికల రాజకీయాలలో మోడీ తలమునకల వుతున్నట్టే ట్రూడే మరింత తీవ్ర సవాళ్లు ఎదుర్కొంటున్నారు. లిబరల్ పార్టీ నాయకుడైన ట్రూడే అసంతృప్తికి ఎదురీదుతున్నారు. తను అధికారంలో కొనసాగాలంటే ఖలీస్తానీ అనుకూలమైన న్యూ డెమొక్రటిక్ పార్టీ మద్దతు తప్పనిసరి. ఖలిస్తానీ మద్దతు దారులను బుజ్జగించడానికి ఒక దారి మళ్లింపు ఎత్తుగడ అవసరమైందంటున్నారు. ఏదో విధంగా పట్టు చూపించుకోకపోతే తనను తప్పించి మరొకరిని ప్రధాని అభ్యర్థిని చేస్తారనేది ఆయన భయం.అందుకే భారత్‌తో సంబంధాలు దెబ్బతింటాయని తెలిసీ ఈ రాజకీయ నాటకం నడిపిస్తున్నారని విమర్శకుల మాట. తనతో పాటు మిగిలిన నాలుగు దేశాలను కూడా ఆయన ఒత్తిడి చేస్తున్నారట. ఫలితమే అమెరికా కూడా వంత పాడటం. అమెరికాలోనూ ఎన్నికలు రానున్నాయి. ఇండియా ఎన్నికల ముంగిట్లో వుంది. కెనడా ఇచ్చింది దర్యాప్తుకు ఉపయోగపడే అంశం తప్ప ఖచ్చితమైన సాక్ష్యం కాదని ఇప్పటికీ దర్యాప్తు పూర్తి చేసింది లేదని బలమైంది కాకుంటే ఇండియా వాదన. బలంలేకుంటే ఆ దేశం ఇంత దూరం తెస్తుందా అనేది వారిని బలపర్చే దేశాల వాదన, ఏ విధంగా చూసినా ఇప్పుడు సమగ్రమైన దర్యాప్తు చేయడం ఒక్కటే పరిష్కారం. భారతదేశం కూడా అందుకు సహకరించి దౌత్య సంబంధాలు దెబ్బ తినకుండా చూడాలనేది నిపుణుల ఏకోన్ముఖ అభిప్రాయం. ట్రూడే లేదా మోడీ ఎవరి ప్రయోజనాలకోసమైనా ప్రతిష్ట కోసమైనా దీన్ని సాగదీయడం శ్రేయస్కరం కాదు.అలాగే మన విదేశీ మోత, విశ్వగురు భజన కూడా తగ్గించుకుని దేశ ప్రయోజనాలను శాంతిని కాపాడుకోవడం అవసరం. గతంలో మైన్మార్, శ్రీలంక, నేపాల్, బర్మా వంటి దేశాలతో సంబంధాలలో దూకుడు ఎలాంటి పరిణామాలకు దారణమైందో మర్చిపోతే కష్టం. ■

మిథ్యా కిరీటం

కొండను తొవ్వి ఎలక పట్టినట్టు
విద్వేషాన్ని
పరిపూర్ణ వ్యతిరేకతనీ
కలగలిపి
నూరి
శోధించి సాధించి
కాయో పండో
పండో కాయో తెలియని
పండుకాయ
కాయపండు
పార్లమెంటుకు తెచ్చారు
మిథ్యాకిరీటం పెట్టి
ఆమెకు
ఓట్లమాయవల
వేద్దామనే-
యాభయారించుల గాలి
ఎగబీల్చి
చూపుదట్టించి
కరిమింగి
విసరించిన
వెలగపండు నవిష్కరించారు
మూటల కొద్ది మాటలమండె కట్టి
కడవల కొద్ది
ఆనంద కన్నీళ్ళు చల్లారు
కర్రసాములు కత్తిసాములు
నృత్యాలు పురస్కారనటనలు
భారీగా
మోహరించారు
ఎప్పుడో తెలియని
పెండ్లికి
ఇప్పటినుంచే
బాజా భజంత్రీలు మొదలు
పెట్టారు
కూర్చోబెట్టి
ముందు
కోట శ్రీనివాస్రావులా
కోన్ని వేలాడదీశారు
కడుపునిండా తినండని !
ఖాళీ
విస్తర్లు వేశారు

- వడ్డెబోయిన శ్రీనివాస్



మహాత్ముని బలి తీసుకున్న మతోన్మాదులు



ఎస్. వినయకుమార్


భారత స్వాతంత్ర్యోద్యమంలోకి జన బాహుళ్యాన్ని సమీకరించిన నాయకుడు మహాత్మా గాంధీ. దక్షిణాఫ్రికాలో వర్ణ వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన గాంధీజీ అనుభవంతో, స్వదేశానికి చేరి స్వాతంత్ర్య పోరాటంలో భాగమయ్యారు. క్రమంగా కాంగ్రెస్‌లో తిరుగులేని నాయకుడై వివిధ తరగతుల ప్రజలను పోరాటంలోకి సమీకరించారు. తిలక్ మరణం తర్వాత ఆ స్థానం స్వీకరించిన గాంధీజీ పోరాటంలో నూతన ఒరవడులు సృష్టించారు. గాంధీజీ 1869లో అక్టోబర్ 2న గుజరాత్‌లోని పోరు బందర్‌లో పుట్టారు. తండ్రి దివాన్ కరంచంద్. 1891లో గాంధీజీ లండన్‌లో బారిష్టర్ పట్టా తీసుకొన్నాడు. తాను సనాతనుడిని అని చెప్పకొంటూనే కులం కట్టుబాట్లను కాదని దళితులను సమీకరించడం వారి చేత దేవాలయాల ప్రవేశం చేయించడం, ముస్లింలు కూడా భారతీయులేనని, హిందువు లతో సమానమని చెప్పడం, దేశ విభజన తర్వాత చెలరేగిన మత కల్లోలాలను అరికట్టడానికి 75 ఏండ్ల వయస్సులో కూడా నిరాహార దీక్షలు చేసి పరిస్థితిని అదుపులోకి తేవడం నచ్చని మతోన్మాదులు మహాత్ముడిపై అతి దగ్గరి నుండి పిస్టల్‌తో కాల్చి హత్య చేశారు. ఆ పని చేసింది నాథురాం గాడ్సె అయినా ఆ కుట్రలో ఒక బృందమే ఉంది. ఆ కుట్రలో ప్రధాన పాత్రదారులైన గాడ్సె, ఆప్టేలకు ఉరిశిక్ష పడగా మిగతా వారికి జైలు శిక్షలు పడ్డాయి. కాని తెరవెనుక ఉండి వారికి సహకరించిన, ప్రోత్సహించిన వారు మాత్రం గాడ్సె, ఆప్టేల మౌనం వల్ల, సమగ్ర దర్యాప్తు జరగనందున శిక్షల నుండి తప్పించుకొన్నారు.

గాంధీజీ హత్య కేసులో ఒక ముద్దాయిగా బోనెక్కిన సావర్కర్ తిలక్ ద్వారా సంపాదించిన స్కాలర్‌షిప్‌తో ఉన్నత చదువు కోసం ఇంగ్లండ్ వెళ్లాడు. సావర్కర్ ఆదేశంతో మదన్ లాల్ ధింగ్రా అనే యువకుడు లండన్‌లోని ఉన్న ఇంగ్లీష్ తాధికారి కర్జన్ విల్లీని కాల్చిచంపాడు. బ్రిటిష్ పోలీసులు డింగ్రాను ఉరి తీశారు. సరైన సాక్ష్యం లేనందున సావర్కర్ ఆ కేసు నుండి బయటపడ్డాడు. సావర్కర్ ఎప్పుడూ తెరవెనుక సూత్రధారిగా ఉంటూ, ఆదేశాలు జారీ చేసేవాడు అని ప్రతీతి. ఆ తర్వాత లండన్ నుండి రెండు పిస్టళ్లను భారతదేశానికి పంపాడు. వాటిలో ఒక పిస్టల్‌తో ఇండియాలో జాక్సన్ అనే అధికారిని చంపారు. ఆ కేసులో అరెస్టు అవుతాననే ముందు జాగ్రత్తగా లండన్ నుండి పారిస్ వెళ్లాడు. అంతా సద్దుమణిగిందని భ్రమించి లండన్‌కు తిరిగి రాగా రైలు స్టేషన్‌లోనే బ్రిటిష్ పోలీసులు అరెస్టు చేసి ఇండియాకు తెచ్చి విచారణ జరిపారు.ఆయనకు రెండు యావజ్జీవ శిక్షలు, అంటే 50 ఏండ్ల శిక్షవేసి అండమాన్ జెయిల్‌కు పంపారు. కాని కొన్నేళ్లలోనే సావర్కర్ బ్రిటిష్ పాలకుల క్షమాభిక్ష పొందారు. తన దయాభిక్ష లేఖలో పేర్కొన్నట్లుగాం విడుదల తర్వాత సావర్కర్ ఏ బ్రిటిష్ వ్యతిరేక పోరాటంలోనూ పాల్గొనలేదు.

మహాత్మాగాంధీ రత్నగిరి వెళ్లి సావర్కర్‌ను కలిసినా ఫలితం లేకపోయింది. ఘర్‌వాపసీ, అంటరానితనంపై గాంధీజీ ఆయన అభిప్రాయాలు అడిగారు. ఇద్దరి అభిప్రాయాల మధ్య పొందిక కుదర్లేదు. రత్నగిరి జిల్లాను దాటి వెళ్లరాదన్న ఆంక్షలు తొలిగాక బాంబొయి ప్రావియెన్స్, సెంట్రల్ ప్రావియెన్స్‌ల్లో ఆర్ఎస్ఎస్ సావర్కర్‌కు స్వాగత సభలు ఏర్పాటు చేసింది. ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకుడు హెడ్గేవార్ స్వయంగా వాటిలో పాల్గొన్నారు. అయితే హిందూ మహాసభకు తాను అధ్యక్షుడయ్యాక. హిందూ మహాసభ, ఆర్ఎస్ఎస్‌లను విలీనం చేయాలని సావర్కర్ ప్రతిపాదించినా హెడ్గేవార్ ఒప్పుకోలేదు.

దేశ విభజనకు గాంధీ నెహ్రూలు కారణమని ఆర్ఎస్ఎస్ ఆరోపించినా వాస్తవం ఏమిటంటే సావర్కర్ 1923లోనే "హిందూత్వం - ఎవరు హిందువులు" అన్న పుస్తకం రాశారు. అందులో ఇండియా హిందువులది మాత్రమేనని వాదించారు. దేశవిభజనకు ఆ పుస్తకంతో బీజం వేసినట్లయింది. ముస్లిం లీగ్ అధ్యక్షుడు మహ్మదలీలో జిన్నా 1940లో మాత్రమే భారత దేశాన్ని మత ప్రాతిపదికపై విభజించాలని కోరాడు. విభజించు -పాలించు వ్యూహాన్ని అనుసరించిన బ్రిటిష్ పాలకులకు కూడా కావాల్సింది అదే కాదా! వెళ్లే ముందు వారు దేశాన్ని విభజించి పెద్ద చిచ్చుపెట్టారు. భారతదేశం హిందువులదని, వారు మాత్రమే పూర్తి పౌరసత్వంలో దేశంలో ఉండాలని మిగతా మతాల వారు భారతదేశంలో ఉండదల్చితే రెండవ తరగతి పౌరులుగా మాత్రమే ఉండాలన్న వాదనను ఆర్ఎస్ఎస్ నాడు నేడు చేస్తోంది. సావర్కర్ ముందు హిందూ మహాసభ అధ్యక్షుడిగా ఉండిన మూంజే ఆర్ఎస్ఎస్ అభివృద్ధికి సహకరించాడు. మూంజె తాను ఇంగ్లండ్ వెళ్లి తిరిగొస్తూ ఇటలీలో ఆగాడు. ఫాసిస్ట్ పార్టీ అధ్యక్షుడు, నియంత అయిన ముస్సోలినీని, ఆ పార్టీ ఇతర నాయకులను కలిసి వచ్చాడు. వారి సూచనలను హిందూ మహాసభలోనూ, ఆర్ఎస్ఎస్‌లోనూ ఆయన అమలు చేశాడు.

ఆర్ఎస్ఎస్‌లో ఉంటూనే 1938లో గాడ్సె అధికారికంగా హిందూ మహాసభలో చేరాడు గాడ్సె. ఒకే వ్యక్తి రెండు సంస్థలోనూ సభ్యులుగా ఉండేవారు. తిలక్ మరణం తర్వాత చిత్పవన్ బ్రాహ్మణ అనుచరులు కాంగ్రెసును వదిలి ఆర్ఎస్ఎస్ లో



చేరారు. స్వాతంత్ర్యం తర్వాత బ్రాహ్మణాధిక్యతను పునరుద్ధరించాలని కోరుకొనేవారికి, వైశ్యుడైన గాంధీజీ కాంగ్రెస్‌కు నాయకుడు కావడం నచ్చలేదు. తిలక్ ప్రారంభించిన కేసరి పత్రిక మతవాదుల పత్రిక అయింది. అందులో నియంతృత్వాన్ని సమర్థిస్తూ వరుసబెట్టి వ్యాసాలు రాసేవారు. పూనాలోని తిలక్ స్మారక మందిరం కూడా హిందూ మతవాదుల అడ్డా అయింది. అక్కడ జరిగే సభల్లో గాడ్సె తాను ఆ ముసలాడిని (గాంధీజీని) చంపుతానని ఆవేశంతో ఊగిపోతూ ప్రసంగించేవాడట. సావర్కర్ రత్నగిరిలో ఉన్నప్పుడు కుర్రవాడైన గాడ్సె కూడా అక్కడ ఉండేవాడు. గాడ్సె కూడా చిత్పవన్ బ్రాహ్మణుడే కనుక ఇద్దరి మధ్య గురుశిష్య బంధం త్వరలోనే బలపడింది. కాని ఆ క్రమంలోనే తన కొడుకు మహాత్మాగాంధీనీ హత్య చేసి ఉరితీయబడతానని గాడ్సె తండ్రి ఆరోజు ఊహించలేదు కదా?

1946లో జరిగిన హిందూ మహాసభ సమావేశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వంలో హిందూ మహాసభ చేరరాదన్న గాడ్సె వాదన వీగి పోయింది. ఇకనేం గాడ్సె సభకు అధ్యక్షత వహించిన ఎల్.బి.బోపాల్కర్‌పై కత్తి దూసి దాడి చేయబోయాడు. ఇతరులు అడ్డుకొని అధ్యక్షుడిని కాపాడారు. ఆ తీర్మానం ప్రకారమే శ్యామప్రసాద్ ముఖర్జీ నెహ్రూ మంత్రివర్గంలో సభ్యుడయ్యారు. తన తండ్రికి చేదోడుగా ఉండటానికి గాడ్సె టైలరింగ్ నేర్చికొని పూనాలో టైలర్ షాపు పెట్టాడు. అక్కడ ఆర్ఎస్ఎస్ కార్యకలాపాల్లో పాల్గొనేవాడు. ఆ దర్జీ దుకాణం ఆర్ఎస్ఎస్‌కు ఒక అడ్డాగా మారింది. సావర్కర్ సాయంతో గాడ్సె, ఆప్టేలు హిందూ రాష్ట్రీయ దళ్ (హెచ్ఆర్‌డి) అనే సంస్థను నెలకొల్పి, అందులో సైద్ధాంతిక, శారీరక శిక్షణను ఇచ్చేవాడు. రైఫిల్ ఉపయోగించడం, గుర్రపు స్వారీ చేయడం వగైరా నేర్పేవారు. మతతత్వ మేధావులు హెచ్ఆర్‌డి క్యాంపులో ముస్లింలకు క్రైస్తవులకు వ్యతిరేకంగా ద్వేషం నూరి పోసేవారు. 1940లో బ్రిటిష్ ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ శాఖల నిర్వహణను నిషేధించింది. కనుక ఆ సంస్థ సభ్యులు హెచ్ఆర్‌డి క్యాంపుల్లో పెద్ద సంఖ్యలో పాల్గొనేవారు. ఆ తర్వాత సావర్కర్ సాయంతో గాడ్సె ఎడిటర్‌గా మొదట "అగ్రణి" పత్రికను కొని నడిపాడు. దానికి జనరల్ మేనేజర్ ఆప్టే. దాని ద్వేషపూరిత రాతలపై బొంబాయి ప్రభుత్వం జుల్మా నాలు వేసేది. జుల్మానాలను మాఫీ చేయించుకోవడానికి గాడ్సె అప్పటి బొంబాయి ఆర్థిక మంత్రి మొరార్జీ దేశాయిని కలిశాడు కూడా. ఆ జుల్మానాలను సావర్కర్ చెల్లించేవాడని దర్యాప్తులో బయట పడింది, జుల్మానాలను తప్పించుకోవడానికి "అగ్రణి"ని మూసేసి మరో పత్రికను గాడ్సె, ఆప్టేలు ప్రారంభించారు.

గాంధీజీని చంపడానికి 1948 జనవరి 20న చేసిన మొదటి ప్రయత్నంలో గాడ్సె బృందం విఫలమైంది. హత్య చేయడానికి వెళ్తూ గాడ్సె బృందం బొంబాయిలో ఆగి సావర్కర్‌ను కలిశారు. గాడ్సె, ఆప్టేలకు వీడ్కోలు చెప్పడానికి మొదటి అంతస్తు నుండి దిగివస్తూ సావర్కర్ వారిని 'విజయీభవ' అని దీవించినట్లు దర్యాప్తులో తెలిసింది. జనవరి 30వ తేది సాయంత్రం రెండవ ప్రయత్నంలో గాడ్సె నేరుగా గాంధీజీ ముందుకు వెళ్లి అతి దగ్గర నుండి కాల్పులు జరిపాడు. చని పోవడానికి ముందు గాంధీజీ బెంగాల్‌లోని నౌఖాలిలో మత ఘర్షణలను ఆపడానికి ఆమరణ నిరాహరదీక్ష చేశారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చాడు. ఢిల్లీలో కూడా అలాంటి పరిస్థితే తలెత్తిందని తెలిసి ఢిల్లీ వచ్చి అక్కడ నిరాహార దీక్ష మొదలెట్టారు. ఢిల్లీ పరిస్థితి అదుపులోకి వచ్చింది. రెండు పక్షాలవారు గాంధీజీ ముందు హింసాకాండను ఆపేస్తామని ప్రమాణాలు చేశారు.

గాంధీ హత్య వెనుక పెద్ద కుట్రే ఉందని గాడ్సె జేబులో దొరికిన ఒక నోట్‌బుక్ ధ్రువపర్చింది. తాము పూణేలో హత్యా సన్నాహాలు ప్రారంభించినప్పటి నుండి దేనికి ఎంత ఖర్చు బెట్టింది ఎవరికి ఎంత ఇచ్చింది గాడ్సె రాసుకొన్నాడు. దాంతో కుట్రదారులందరినీ పోలీసులు కొద్ది గంటల్లోనే అరెస్టు చేయగలిగారు. ఆ సందర్భంగా తాము సావర్కర్‌ను కూడా అరెస్టు చేయడానికి అనుమతి కోరినా ప్రభుత్వం అమోదం తెల్పలేదని ఒక దర్యాప్తు అధికారి ఆ తర్వాత తెలిపారు. సాయంత్రం 5.17 నిమిషాలకు హత్య జరిగింది. రాత్రి 10.30 వార్తల్లో గాంధీని చంపింది పూణే వాసి నాథురాం గాడ్సె అని రేడియోలో వెల్లడించారు. కోపోద్రిక్తులైన ప్రజలు దేశంలో అనేక చోట్ల ఆర్ఎస్ఎస్, హిందూ మహాసభల కార్యాలయాలపై పడ్డారు. పూణేలోని గాడ్సె తమ్ముడి పరిశ్రమను తగలబెట్టారు. పూణే జిల్లా కలెక్టర్ ముందు జాగ్రత వల్ల గాడ్సె తల్లితండ్రులకు ప్రమాదం తప్పింది. బొంబాయిలో దాదాపు వేయిమంది కాగడాలతో సావర్కర్ సదన్‌ను చుట్టుముట్టి తగలబెట్టడానికి ప్రయత్నించారు. పోలీసులు సకాలంలో అక్కడికి చేరుకొని సావర్కర్‌ను అతని సదన్‌నూ కాపాడారు. ఈ విషయం తెలుసు కొన్నప్పుడు గోద్రాలో జరిగిన ఘోరకృత్యం అనంతరం అహ్మదాబాద్‌లో ముస్లింలపై జరిగిన మారణకాండ ఎవరికైనా గుర్తుకు వస్తుంది. మహాత్మాగాంధీ అంతటి నాయకుడి హత్య తర్వాత చెలరేగిన కోపాగ్నిని అప్పటి ప్రభుత్వాలు కొద్దిపాటి నష్టంలో చల్లార్చాయి. కాని అహ్మదాబాదులో జరిగిందేమిటి? వేలాది మంది చనిపోయాకే అహ్మదాబాదు వీధుల్లోకి చేరిన సైన్యం వెళ్లింది. ఇందిరాగాంధీ హత్య అనంతరం ఢిల్లీలో సిక్కులపై సాగిన హింసాకాండ కూడా అలాంటిదే. మానవ హక్కుల పట్ల చిత్తశుద్ధి లేని ఇలాంటి ప్రభుత్వాలే గాంధీజీ హత్య జరిగినప్పుడు ఉంటే ఎంత జననష్టం, ఎంత ఆస్తి నష్టం జరిగి ఉండేదో! హత్య చేయడానికి చాలా కాలం ముందే గాడ్సె తను సంస్థలో లేడని ఆర్ఎస్ఎస్ ప్రకటించినా నాగ్‌పూర్ లోని ఆ సంస్థ కార్యాలయంలో సోదా సందర్భంగా లభించిన మినిట్స్ పుస్తకంలో ఆర్ఎస్ఎస్ ప్రముఖుల సమావేశంలో గాడ్సె పాల్గొన్నట్లు నమోదై వుంది.

(అక్టోబరు 02 గాంధీ జయంతి)



ఎంఎస్ స్వామినాథన్‌కు భారతరత్న ప్రకటించాలి

తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్

నవతెలంగాణ-ఖమ్మం

హరిత విప్లవ పితామహుడు డాక్టర్ ఎం.ఎస్.స్వామినాథన్‌కు భారతరత్న అవార్డు కేంద్ర ప్రభుత్వం ప్రకటించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. శనివారం ఖమ్మం సుందరయ్య భవన్లో మాదినేని రమేష్ అధ్యక్షతన డాక్టర్ ఎం.ఎస్.స్వామినాథన్ సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా తొలుత స్వామినాథన్ చిత్రపటానికి సుదర్శన్ పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం జరిగిన సభలో సుదర్శన్, రాంబాబు మాట్లాడుతూ స్వాతంత్ర్యం ముందు, తర్వాత దశాబ్దాలలో సరైన ఆహారం ఉత్పత్తులు లేక దేశ ప్రజలు ఆకలితో లక్షల మంది ప్రాణాలు కోల్పోయారని ఆహార భద్రత కోసం హరిత విప్లవం విజయవంతం చేసిన భారత వ్యవసాయ యుగ కర్త డాక్టర్ ఎం.ఎస్. స్వామినాథన్ అని, దిగుమతులు నుంచి ఎగుమతులు దిశగా భారత వ్యవసాయ అభివృద్ధికి బాటలు వేసిన మహోన్నత వ్యక్తి స్వామినాథన్ అన్నారు. స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయడం కోసం ఉద్యమాలు చేయడమే ఆయనకు మనమిచ్చే గౌరవ నివాళి అవుతుంది అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు నున్నా నాగేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు, తాతా భాస్కరరావు, తుళ్ళూరి రమేష్, ఎస్కె మీరా, నిర్వాసితుల సంఘం కన్వీనర్ తకెళ్ళపాటి భద్రయ్య, వేములపల్లి సుధీర్, ప్రతాపనేని వెంకటేశ్వరరావు, మురళి తదితరులు పాల్గొన్నారు.



పేదల సంక్షేమానికి పెద్దపీట : ఎంఎల్ఏ

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

పేదల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి అన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 82 మందికి కల్యాణలక్ష్మి, 43 మందికి షాదీముబారక్ చెక్కులను జలగంనగర్‌లోని ఎంపీడీఓ కార్యాలయంలో లబ్ధిదారులకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. పేద ప్రజల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను రూపొందించి అమలు చేస్తుందని వివరించారు. అంతకు ముందు తీర్థాల సంగమేశ్వర ఆలయంలో ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారానికి హాజరయ్యారు. ఆలయ ఛైర్మన్‌గా భూక్య రామ, మిగతా ఆరుగురు పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. దారేడు గ్రామానికి చెందిన వివిధ పార్టీల వారు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి సాయిగణేశ్ నగర్ లోని తన క్యాంపు కార్యాలయంలో పార్టీ కండువాలను కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ బెల్లం ఉమ, జడ్పీటీసీ యండపల్లి వరప్రసాద్, ఏదులాపురం పీఏసీఎస్ ఛైర్మన్ లక్ష్మణ్ నాయక్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బెల్లం వేణు, స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

నేడు పాలేరులో పొంగులేటి పర్యటన

నవతెలంగాణ- ఖమ్మం



తెలంగాణ కాంగ్రెస్ ప్రచార కమిటీ కో ఛైర్మెన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాలేరు నియోజక వర్గంలో ఆదివారం పర్యటించనున్నారు. ఈ మేరకు పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌ఛార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పర్యటనలో భాగంగా కూసుమంచి మండలంలోని నాయకన్‌గూడెం, మందడి నర్సయ్యగూడెం, జక్కేపల్లి, గోరిలాపాడుతండా, జుజ్జులరావుపేట, పాలేరు, ఎర్రగడ్డతండా, క్రిష్టాపురం, చేగొమ్మ గ్రామాలను, ఖమ్మంరూరల్ మండలంలోని కామంచికల్, జానాబాద్ తండా, మద్దివారి గూడెం తదితర గ్రామాలను సందర్శిస్తారన్నారు. ఆయా గ్రామాలను సందర్శించి పలు బాధిత కుటుంబాలను పరామర్శించి ఓదారుస్తారని తెలిపారు. నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై పొంగులేటి పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.



అన్నదాన కార్యక్రమానికి రూ.30 లక్షల వితరణ

నవతెలంగాణ - ఎర్రుపాలెం

తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన మహా దివ్య క్షేత్రమైన స్వయంభు జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయానికి శనివారం కావడంతో భక్తులు వేలాదిగా తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఎర్రుపాలెం మండల పరిధిలోని భీమవరం గ్రామానికి చెందిన ప్రవాస భారతీయుడు దాత వేమిరెడ్డి వెంకటరెడ్డి రాధిక దంపతులు స్వామి వారిని దర్శించుకున్నారు.స్వామి వారిని దర్శించుకున్న భక్తులకు ఉచితంగా అందించే అన్న ప్రసాదానికి 30 లక్షల రూపాయల చెక్కు ను ఆలయ కార్యనిర్వహణాధికారి జగన్మోహన్‌రావు ఆలయ వ్యవస్థాపక ఫౌండ్రీ ట్రస్ట్ ఉప్పల శ్రీ రామ చంద్రమూర్తికి అందించారు. తెల్లవారు జామునే స్వామి వారికి పంచామృతాలతో సర్వాంగాభిషేకం ఘనంగా నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ వారికి పట్టు వస్త్రములు ధరింప జేసి, పూల మాలలు అలంకరించి ప్రత్యేక అలంకరణ గావించి అంగరంగ వైభవంగా స్వామి వారిని భక్తులకు దర్శనం కల్పించారు.ఆలయానికి భక్తులు వేలాదిగా తరలి వచ్చి స్వామి వారిని అమ్మ వార్లను దర్శించుకున్నారు. కార్యక్రమంలో సూపర్డెంట్ విజయ కుమారి, ఆలయ ఉప ప్రధాన అర్చకులు ఉప్పల విజయ్ దేవశర్మ శ్రీకాంత్‌రెడ్డి, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

మెడిసిన్ విద్యార్థినులు మౌనిక, సాయి ప్రియలకు సన్మానం

నవతెలంగాణ-వైరా

మండలంలోని తాటిపూడి గ్రామానికి చెందిన అక్కా చెల్లెళ్ళు ఒకేసారి మెడిసిన్ సీట్లు సాధించిన ముచ్చపోతుల మౌనిక, సాయి ప్రియలను రెబ్బవరం ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం శనివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రెబ్బవరం రిటైర్డ్ ప్రధానోపాధ్యాయురాలు అచ్చమాంబ మాట్లాడుతూ మౌనిక, సాయిప్రియలు పేదరికం అనుభవిస్తూ ఇప్పటివరకు ప్రభుత్వ విద్యా సంస్థలలోనే చదివి అద్భుతంగా ఒకే సారి మెడిసిన్ సీట్లు సాధించటం రెబ్బవరం పాఠశాలకు స్వగ్రామం తాటిపూడితో పాటు తల్లి దండ్రులకు గర్వకారణం అన్నారు. ప్రముఖ వ్యాపార వేత్త మధిర పట్టణ వాస్తవ్యులు రంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కష్ట పడి చదివి మెడిసిన్ సీట్లు సాధించిన ఒకే కుటుంబానికి చెందిన అక్కా చెల్లెళ్ళు సమాజంలో మంచి గుర్తింపుతో పాటు ఆర్థిక సహకారం కూడా పొందుతారని, ఉన్నత విద్య అన్ని ఆస్తులను కలిగిన వారికంటే ఉన్నత స్థానంలో నిలుపుతుందని అన్నారు. రిటైర్డ్ ఎస్ఈ కొల్లి రామారావు మాట్లాడుతూ మౌనిక, సాయి ప్రియలు మెడిసిన్ సీట్లు సాధించిన విషయం తెలిసిన వెంటనే తాము స్పందించి కొంత ఆర్థిక సహకారం అందించినట్లు తెలిపారు. ఇక పై కూడా తాను తన సతీమణి లక్ష్మి వారికి ఆర్థిక సహాయం అందించేందుకు సిద్ధమని, అంతేగాక తన సోదరి ద్వారా కూడా ఆర్థిక సహాయం అందించనున్నట్లు తెలిపారు. రెబ్బవరం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్, విశ్రాంత బిఎస్ఎన్ఎల్ ఉద్యోగి రాజబాబు, మందా పుల్లయ్య తదితరులు మెడిసిన్ విద్యార్థినులను అభినందించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎల్ఐసి ఏజెంట్ బోట్ల సైదులు, విద్యార్థుల, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బోనకల్ మండలంలో ప్రతి దళిత కుటుంబానికి దళిత బంధు : మంత్రి కేటీఆర్

నవతెలంగాణ-బోనకల్

మధిర నియోజకవర్గంలోని బోనకల్ మండలాన్ని దళిత బంధు పథకం కింద ప్రకటిస్తున్నట్లు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ సత్తుపల్లి బహిరంగ సభలో శనివారం ప్రకటించారు. ఇదే విషయాన్ని నవతెలంగాణ 9 ఆగస్టు 2023న 'దళిత బంధు కింద బోనకల్ ఎంపిక' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. జడ్పీ ఛైర్మన్, బీఆర్ఎస్ మధిర అసెంబ్లీ అభ్యర్థి లింగాల కమల్ రాజు అభ్యర్ధన మేరకు ముఖ్యమంత్రి కేసీఆర్ మధిర నియోజకవర్గంలో చింతకాని మండలం తరహాలో బోనకల్ మండలం మొత్తం ప్రతి దళిత కుటుంబానికి దళిత బంధు అందించాలని నిర్ణయం తీసుకున్నట్లు సత్తుపల్లి సభలో కేటీఆర్ ప్రకటించారు. ఆ మేరకు ఇప్పటికే అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందని ఆయన తెలిపారు. కేటీఆర్ ప్రకటనతో బోనకల్లు మండలంలోని దళితులలో ఒక్కసారిగా ఆశలు పెరిగాయి. బోనకల్ మండలంలో సుమారు 4,150 దళిత కుటుంబాలు ఉన్నాయి. దళిత బంధు ద్వారా ఈ 4,150 కుటుంబాలకు లబ్ది చేకూరనున్నది. ఇదిలా ఉండగా మధిర నియోజకవర్గానికి సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈసారి ఎన్నికలలో ఎలాగైనా మల్లు బట్టి విక్రమార్కను ఓడించాలని లక్ష్యంతో కేసీఆర్ పట్టుదలతో ఉన్నట్లు పలు సందర్భాలలో జడ్పీ ఛైర్మన్ లింగాల కమల్ రాజుతో పాటు పలువురు ప్రకటించారు. అందులో భాగంగానే బోనకల్లు మండలాన్ని దళిత బంధు కింద ఎంపిక చేసినట్లు ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. అయితే ఇదే విషయాన్ని నవ తెలంగాణ రెండు నెలల క్రితమే బోనకల్లు మండలాన్ని దళిత బంధు కింద ఎంపిక చేయనున్నట్లు వార్తా కథనాలను ప్రచురించింది.

'సీతారామ'తో సస్యశ్యామలం

- 2లక్షల ఎకరాలకు సాగునీరు
- సత్తుపల్లి నియోజకవర్గమంతా దళితబంధు అమలు
- మళ్లీ వచ్చేది, ఇచ్చేది బీఆరెస్సే
- కాంగ్రెస్ 6 గ్యారంటీ పథకాలు ఆరిపోయే దీపాలు
- ఓడిపోయి ఇంట్లో కూర్చుంటే పదవులిస్తే కేసీఆర్ దుర్మార్గుడయ్యారు
- ఐటీ, పురపాలకశాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు
- సత్తుపల్లిలో రూ.125 కోట్ల అభివృద్ధి పనులకు కేటీఆర్ శంకుస్థాపనలు





నవతెలంగాణ-సత్తుపల్లి

సీతారామ ప్రాజెక్టు ఏర్పాటుతో సత్తుపల్లి ప్రాంతం సస్యశ్యామలం కానుందని, సుమారు 2లక్షల ఎకరాలకు పైగా సాగునీరు అందనుందని రాష్ట్ర ఐటీ, పురపాలకశాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) అన్నారు. శనివారం సత్తుపల్లి వచ్చిన కేటీఆర్ రూ.125కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం కాకర్లపల్లి రోడ్డులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కేటీఆర్ ప్రసంగించారు. ఇప్పటికే సీతారామ పనులు 90 శాతం పూర్తయ్యాయన్నారు. సత్తుపల్లి నియోజకవర్గంలోని ప్రతి దళిత కుటుంబానికి దళితబంధు పథకాన్ని అందించేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని కేటీఆర్ సభలో ప్రకటించారు. మళ్లీ వచ్చేది, ఇచ్చేది బీఆరెస్సేనని కేటీఆర్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ గొప్పగా చెప్పుకుంటున్న 6 గ్యారంటీ పథకాలు ఆరిపోయే దీపాలని, వారి మాయమాటలు విని మోసపోవద్దని కేటీఆర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. 50 యేండ్లకు పైగా కాంగ్రెస్ పాలన సాగిందని, ప్రజలు కాంగ్రెస్‌కు 11సార్లు అవకాశం ఇచ్చినా ఏమీ చేయలేదన్నారు. అంతా కుంభకోణాల మయంతోనే వారి పాలనంతా సాగిందన్నారు. ఆకాశం నుంచి మొదలుకొని పాతాళం వరకు దేనిని వదలకుండా కాంగ్రెస్ పార్టీ దోచుకుందని విమర్శించారు. 11 సార్లు అవకాశం ఇస్తే ప్రజలకు ఏమీ చేయని కాంగ్రెస్ ఇప్పుడేమో ఒకసారి అవకాశం ఇవ్వండని ప్రజలను ప్రాధేయపడటం వారి దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. 125 యేండ్ల కిందట పుట్టిన కాంగ్రెస్ పార్టీకి వారెంటీ అయిపోయిందని, ప్రస్తుతం ఆ పార్టీ చచ్చిన పీనుగు లాంటిదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీతో ఒరిగేదేమీ ఉండదన్నారు. 40యేండ్లుగా రూ. 200పింఛన్ ఇచ్చుకుంటూ వచ్చిన కాంగ్రెస్ ఇప్పుడేమో రూ. 4వేలు ఇస్తానంటే ప్రజలే మన్నా పిచ్చివాళ్లలా కాంగ్రెస్‌కు కనపడు తున్నారా అని ప్రశ్నించారు. 5యేండ్ల కాలంలో కాంగ్రెస్ చేయలేని అభివృద్ధి బీఆర్ఎస్ తొమ్మిదిన్నర యేండ్ల కాలంలో చేసి చూపించిందన్నారు. కాంగ్రెస్ హయాంలో 29లక్షల మందికి పింఛన్లు వస్తే బీఆర్ఎస్ తెలంగాణ వచ్చాక కేసీఆర్ ప్రభుత్వం 46లక్షల మందికి పింఛన్లు ఇస్తోందన్నారు.

ఓడిపోయి ఇంట్లో కూర్చుంటే పదవులిచ్చిన కేసీఆర్ దుర్మార్గుడయ్యారు...

ఓడిపోయి ఇంట్లో కూర్చుంటే పిలిచి మరీ పదవులిస్తే ఇప్పుడేమో కేసీఆర్ దుర్మార్గుడయ్యారని తుమ్మలను ఉద్దేశించి కేటీఆర్ అన్నారు. ఒకాయనకు పదవులివ్వలేదని ఇష్టం వచ్చిన రీతిలో మాట్లాడుతున్నారని అన్నారు. ఆ ఇద్దరు వ్యక్తులు స్వీయబాధతో ఉన్నారన్నారు. స్వలాభం కోసం పార్టీలు మారారే తప్ప మరొకటి లేదన్నారు. కేటీఆర్ ప్రసంగానికి ముందు ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఎంపీలు బండి పార్థసారధిరెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, నామ నాగేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ తాతా మధు, జెడ్పీ ఛైర్మెన్ లింగాల కమల్‌రాజ్, అశ్వారావుపేట ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, డీసీఎంఎస్ ఛైర్మెన్ రాయల శేషగిరిరావు, మున్సిపల్ ఛైర్మెన్ కూసంపూడి మహేశ్, వివిధ మండలాల నుంచి బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు, తరలివచ్చారు.

రూ.1370 కోట్ల పనులకు శ్రీకారం

పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి కేటీఆర్ శంకుస్థాపన

నవతెలంగాణ- ఖమ్మం



ఖమ్మం నగరంలో రూ.1370 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు రాష్ట్ర పురపాలక, ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌తో కలిసి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. శనివారం ఉదయం 10.20 గంటలకు హెలీకాప్టర్ ద్వారా ఖమ్మం నగరానికి చేరుకున్న పురపాలక, రవాణ శాఖల మంత్రులు తొలుత లకారం ట్యాంక్‌బండ్‌పై రూ.1.37 కోట్లతో నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్‌టిఆర్ పార్కును ప్రారంభించారు. అనంతరం రూ.10 కోట్లతో నగరంలో చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రెయినేజ్, మరో రూ.2.49 కోట్లతో అమృత్ 2.0 అండర్ గ్రౌండ్ డ్రెయినేజ్ నిర్మాణం పనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం 20వ డివిజన్ ఎస్‌బిఐటి ఇంజనీరింగ్ కళాశాల రోడ్డు వద్ద రూ.71 లక్షలతో స్పోర్ట్స్ పార్క్ (టర్ఫ్‌కోర్టు), ప్రకాష్‌నగర్‌లో ప్రొఫెసర్ జయశంకర్ పార్క్‌లో 108.71 కోట్లతో నిర్మించిన అండర్‌గ్రౌండ్ డ్రెయినేజ్ పైప్‌లైన్, వర్షపు నీరు తరలించే పనులను, విడిఓస్ కాలనీ వద్ద రూ.8.54 కోట్లతో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్‌ను, మంత్రులు ప్రారంభించారు. అనంతరం కాల్వఒడ్డు వద్ద రూ.690.52 కోట్లతో నిర్మించనున్న మున్నేరు ఆర్‌సిసి రక్షణ గోడల నిర్మాణ పనులకు, మున్నేరు వద్ద రూ.180 కోట్లతో నిర్మించనున్న కేబుల్ బ్రిడ్జ్ నిర్మాణ పనులకు, గట్టయ్య సెంటర్ నగరపాలక సంస్థ నందు ఎల్ఆర్ఎస్ నిధులు రూ.20 కోట్లతో నిర్మించనున్న రోడ్ల పనులకు, ఇటీవలే రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి మంజూరు చేసిన టియుఎఫ్ఐడిసి నిధులు రూ.100 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రులు శంకుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారధిరెడ్డి, శాసనమండలి సభ్యులు తాతా మధుసూదన్, జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్, పోలీసు కమిషనర్ విష్ణు.యస్.వారియర్, జిల్లా పరిషత్ ఛైర్మన్ లింగాల కమలరాజు, నగర మేయర్ పునుకొల్లు నీరజ, సుడా ఛైర్మెన్ బచ్చు విజయ్‌కుమార్, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మెన్ దోరేపల్లి శ్వేత, డీసీసీబీ ఛైర్మెన్ కూరాకుల నాగభూషణం, డిసిఎంఎస్ రాయల శేషగిరిరావు, నగరపాలక సంస్థ కమీషనర్ ఆదర్శ్ సురభి, శిక్షణ అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్‌సింగ్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ పార్టీనే

సిఎల్పీ నేత మధిర ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క

నవతెలంగాణ-ముదిగొండ

రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తామని సీఎల్పీ నేత మధిర ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మండలంలోని పమ్మిలో మధిర నియోజకవర్గ ముఖ్యకార్యకర్తల సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక తప్పుడు వాగ్దానాలు చేసి అబద్ధాలతో అధికారంలోకి వచ్చి ప్రజల మోసం చేసి పాలన చేస్తున్నారని విమర్శించారు. బారాస ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించి ప్రజావ్యతిరేక చర్యలకు పాల్పడుతుందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కెసిఆర్ రాష్ట్ర సంపదను లూటీ చేస్తూ రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చారన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా పథకాలపై కార్యకర్తలు గ్రామాల్లో విస్తృత ప్రచారం చేసి ప్రజలకు తెలియజేయాలని మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో కేసీఆర్‌ను గద్దెదింపితేనే రాష్ట్రానికి శాంతి జరుగుతుందన్నారు. సమావేశంలో టిపిసిసి సభ్యులు రాయల నాగేశ్వరరావు, మధిర నియోజకవర్గం బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కందిమల్ల వీరబాబు, నాయకులు వల్లూరి భద్రారెడ్డి, వడ్డే మాధవరావు, వడ్డె శ్రీనివాసరావు, దేవరపల్లి అనంతరెడ్డి, రాయబారపు శంకర్, దేవరపల్లి ఆదినారాయణరెడ్డి, చిన్నపంగు రజనీకాంత్, రాయబారపు వీరబాబు, పిల్లుట్ల రాఘవ, ఇలవల పుల్లారెడ్డి, సామినేని సాంబయ్య, ఏలూరి హనుమంతరావు, పంజాల రాజేష్, తాళ్లూరి మల్లయ్య, అంబటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మనది ప్రజాస్వామ్యమా, రాచరికమా?



సీపీఐ(ఎం) జిల్లా కార్యాలయం వద్ద పోలీసుల పహారా..

- కేటీఆర్ జిల్లాకు వస్తే అక్రమ అరెస్టులెందుకు?
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

నవతెలంగాణ-ఖమ్మం



ముఖ్యమంత్రి కొడుకు కేటీఆర్ జిల్లాకు వస్తే ప్రతిపక్షాలు, ప్రజా సంఘాల కార్యకర్తలు బయట తిరగకూడదా? మనది ప్రజాస్వామ్యమా, లేక రాచరికమా? అని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కెటిఆర్ జిల్లా పర్యటన సందర్భంగా సిపిఎం వైరా నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ భూక్యా వీరభద్రం, వైరా మండల కార్యదర్శి తోట నాగేశ్వరరావులను వైరాలో తమ ఇండ్లలో ఉండగా అక్రమంగా అరెస్టుచేసి పోలీస్ స్టేషన్‌కు తరలించార న్నారు. వైరా ఎంఎల్ఎ రాములు నాయక్ పర్మిషన్ తీసుకొని పామాయిల్ రైతుల సమస్యలపై మెమోరాండం యివ్వటానికి వెళ్ళిన రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, సొసైటీ డైరెక్టర్ సంక్రాంతి నర్సయ్య, రైతు సంఘం నాయకులు చింతనిప్పు చలపతిరావు, సంక్రాంతి పురుషోత్తంలను అంజనాపురం (కొణిజర్ల) సభ వద్ద అరెస్టు చేశారని, రఘునాథపాలెం మండల కార్యదర్శి నవీన్‌రెడ్డిని ఖమ్మం జిల్లా పార్టీ కార్యాలయం వద్ద, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె.బషీర్‌తో పాటు జిల్లావ్యాప్తంగా డివైఎఫ్ఐ నాయకులను, ఖమ్మంలో తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీ నాయకులను అరెస్ట్ చేయటాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రజలంటే ప్రభుత్వానికి భయం పట్టుకుందన్నారు. ప్రజల్లో బీఆర్ఎస్‌కు నిజంగా అభిమానం వుంటే అభివృద్ధి కార్యక్రమాలకు కూలియిచ్చి ఎందుకు పట్టుకొస్తున్నారని ప్రశ్నించారు. అభివృద్ధి కార్యక్రమాల పేరుతో కెటిఆర్ చేసిన పర్యటన ఎన్నికల పర్యటన లాగానే వుంది అన్నారు. పైగా ఎప్పుడో ఏడాది క్రితం ప్రారంభమైన మున్సిపల్ కార్యాలయాన్ని, 6 నెలల క్రితమే ప్రారంభమైన ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను, గోళ్ళపాడు ఛానల్, పార్కులను మళ్ళీ ప్రారంభించడం అనేది ఎన్నికల స్టంట్ మాత్రమే అని ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు. ఈ ప్రభుత్వానికి ప్రజాస్వామ్యం పట్ల కనీస గౌరవం లేదని, తాము ప్రజా ప్రతినిధులమని, ప్రజలకు జవాబుదారీగా ఉండాలనేది మర్చిపోయి, అహంకారపూరితంగా, పెత్తందారులుగా, నియంతలుగా ప్రజలను అణచివేసే వైఖరిని కొనసాగిస్తే ప్రజాస్వామ్యమే ప్రాణంగా భావించే ఖమ్మం జిల్లా ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరిక చేశారు.

రైతు నాయకుల అక్రమ అరెస్టును ఖండించండి

తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు

నవతెలంగాణ-ఖమ్మం



అరెస్టును

రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కెటిఆర్ ఖమ్మం జిల్లా పర్యటన సందర్భంగా శనివారం జిల్లాలో రైతు సంఘం నాయకులు, ఇతర ప్రజా సంఘాల నాయకులను అరెస్టు చేయడం అప్రజాస్వామిక చర్య అని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. కొణిజర్ల మండలం అంజనాపురం వద్ద గోద్రేజ్ కంపెనీ పామాయిల్ పరిశ్రమ శంకుస్థాపన సభ వద్దకు తనతో పాటు తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు మరియు పామాయిల్ సాగు రైతులు చింతనిప్పు చలపతిరావు, కొణిజర్ల సోసైటి డైరెక్టర్ సంక్రాంతి నర్సయ్య, సంక్రాంతి పురుషోత్తం, ఎస్ డి పాషా, సంక్రాంతి వెంకటేశ్వరరావుతో పాటు పలువురు రైతులను శంకుస్థాపన సభ వద్ద బలవంతంగా అరెస్టు చేయడం జరిగిందని, జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు పామాయిల్ టన్ను ధర గత సంవత్సరం 23 వేల రూపాయలు ఉండగా ప్రస్తుతం 13 వేల రూపాయలకు పైగా తగ్గి రైతులు ఇబ్బందులు పడుతున్నారని, పామాయిల్‌కు కనీస మద్దతు ధర రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలని, అక్టోబర్ రెండవ వారం నుంచి సాగర్ జలాలు వారబంధి పద్ధతిలో విడుదల చేయాలని, రుణమాఫీ అమలులో రైతులు ఎదుర్కొంటున్న గందరగోళం తొలగించి సంపూర్ణంగా అమలు చేయాలని, అదే విధంగా నాగపూర్-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి భూ నిర్వాసితులకు పరిహారం ధర నిర్ణయం 2013 చట్టం ప్రకారం నిర్ణయం చేయాలని వినతి పత్రం అందజేయడం కోసం వైరా శాసనసభ్యులు లావూడ్యా రాములు నాయక్ ద్వారా ముందస్తు అనుమతి తీసుకోవడం జరిగింది అన్నారు. అయినా సభ ప్రాంగణం నుంచి అరెస్టు చేసి కొణిజర్ల పోలీసు స్టేషన్‌కు తరలించడం అప్రజాస్వామిక చర్య అన్నారు. గ్రీన్ ఫీల్డ్ నిర్వాసితుల సంఘం నాయకుడు ఎస్ నవీన్ రెడ్డిని ఖమ్మం సుందరయ్య భవన్ నుంచి బలవంతంగా ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు రైతు సంఘం నాయకులతోపాటు ఇతర ప్రజా సంఘాల రాజకీయ పార్టీల నాయకుల అరెస్టును ప్రజాస్వామికవాదులు తీవ్రంగా ఖండించాలన్నారు. జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంత్రుల పర్యటన ఉంటే ప్రతిపక్షాలు, ప్రజా సంఘాల నాయకులు పోలీసు స్టేషన్‌లలో ఉండాలా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో నిర్వాసితుల సంఘం కన్వీనర్ తకెళ్ళపాటి భద్రయ్య, తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు తుళ్ళూరి రమేష్, వేములపల్లి సుధీర్, ప్రతాపనేని వెంకటేశ్వరరావు, బోజెడ్ల వెంకటయ్య, మందడపు రవీంద్ర పాల్గొన్నారు.



ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్నారు

ఖమ్మం నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహమ్మద్ జావిద్

నవతెలంగాణ- ఖమ్మం

హౌస్ అరెస్టుల పేరుతో ప్రభుత్వం ప్రతిపక్షాలను గొంతు ఎత్తకుండా చేయడం అప్రజాస్వామికమని ఖమ్మం నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహమ్మద్ జావిద్ అన్నారు. శనివారం మంత్రి కెటిఆర్ పర్యటన నేపథ్యంలో ఖమ్మం నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహమ్మద్ జావిద్‌ను పోలీస్‌లు హౌస్ అరెస్ట్ చేసి నిర్బంధించారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కేటీఆర్ జిల్లా పర్యటనకు ఎలా వస్తావని ప్రశ్నించినందుకు అరెస్టులు చేస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ హంగు ఆర్భాటాలతో ప్రజలను మళ్ళీ మోసం చేసేందుకు దేశ దిమ్మరిలు తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేదని, ముందు వాటిని అమలు చేసి కొత్త హామీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.



రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మతో శవయాత్ర

నవతెలంగాణ-మధిర

అంగన్వాడీ, ఆశా మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా గత కొంతకాలం నుండి నిరవధిక సమ్మె నిర్వహిస్తున్నారు. ఆయన ఈ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల కార్మికుల పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తుందని, సీఐటీయూ మండల కన్వీనర్ వడకంట మురళి, నాయకులు వడ్రనపు మధు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ శవయాత్ర కార్యక్రమాన్ని మధిర ఎమ్మార్వో ఆఫీస్ కార్యాలయం నుండి అంబేద్కర్ సెంటర్ మీదుగా భగత్ సింగ్ విగ్రహం వద్ద ప్రభుత్వదిష్టి బొమ్మ దహనం చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మందా సైదులు, పాపినేని రామ నరసయ్య, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మద్దాల ప్రభాకర్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు విల్సన్, నాయుడు శ్రీరాములు అంగన్వాడి ఆశ మధ్యాహ్నం భోజన కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



స్త్రీలకు అన్ని రంగాల్లో సమానవకాశం కల్పించాలి

అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్నం భోజన కార్మికులకు ఐద్వా సంఘీభావం

నవతెలంగాణ-మధిర

స్త్రీలకు అన్ని రంగాల్లో సమానవకాశం కల్పించినప్పుడు మాత్రమే దేశం అభివృద్ధి చెందుతుందని ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యులు బగ్గవేటి సరళ, అప్రోచ్ అమ్మిన బేగం తెలిపారు. మధిరలో సీఐటీయూ రాష్ట్ర కమిటీ లో పిలుపులో భాగంగా అంగన్వాడీ ఆశా మధ్యాహ్నం భోజన కార్మికుల నిరవధిక సమ్మె జరుగుతుంది. ఈ ఈ సమ్మెకు ఐద్వా సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షులు బండి పద్మ నాయకులు మండవ ఫణీంద్ర కుమారి, ఫాతిమా బేగం అంగన్వాడి ప్రాజెక్టు అధ్యక్షురాలు చావా పద్మ, అన్నం వరలక్ష్మి, విజయలక్ష్మి, ఆశవర్కర్ సజన, లక్ష్మి, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

చెవిలో పువ్వుతో నిరసన

నవతెలంగాణ-తిరుమలాయపాలెం

మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మెలో బాగంగా చెవిలో పువ్వులు పెట్టుకొని నిరసనను తెలియజేశారు. ఈ సందర్భంగా సిటియు జిల్లా నాయకులు వశపంగు వీరన్న మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల మండల అధ్యక్ష కార్యదర్శులు ఎన్.పద్మ, గొడుగు ముత్తమ్మ పాల్గొన్నారు.

ఎంఈఓ ప్రభాకర్ సేవలు అభినందనీయం

నవతెలంగాణ-మధిర

మండల విద్యాశాఖ అధికారిగా వై ప్రభాకర్ 10 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని మండల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, మండల సీఆర్పీలు బృందం శనివారం మండలవనరుల కేంద్రం నందు ఘనసన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాలుగు కాంప్లెక్సు ప్రధాన ఉపాధ్యాయులు ఎన్. విజయశ్రీ, మురళి మనోహర్, చెరుపల్లి శ్రీహరితో పాటు ఉపాధ్యాయులు సాయికృష్ణ, మేడపల్లి శ్రీనివాసరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

మిరప తోటలను పరిశీలించిన ఏవో

నవతెలంగాణ -కూసుమంచి

మండలంలోని చేగొమ్మ గ్రామంలోని మిరప తోటలను శనివారం మండల వ్యవసాయ అధికారి రాముడుగు వాణి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మిరప తోటలో వివిధ రకాల వైరస్ వ్యాధులను గమనించడం జరిగిందని తెలిపారు. మిరపలో తెల్ల దోమ ద్వారా వ్యాపించేటటువంటి ఆకు ముడత తెగులు లేదా జెమినీ వైరస్ సోకిన మొక్కల ఆకులు బొబ్బలు బొబ్బలుగా మారి కాండంపై గనుపుల మధ్య దూరం తగ్గి కనిపిస్తాయని, వీటి నివారణకు లీటరు నీటికి 300 గ్రాముల ఎసిఫేట్ లేదా 40 గ్రాముల తయోమితాక్సం ను ఒక లీటర్ వేప నూనెలో కలిపి పిచికారి చేయడం వల్ల నివారించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ కిరణ్మయి పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని రైతు మృతి

నవతెలంగాణ -కూసుమంచి

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని పాలేరు గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం శనివారం మండలంలోని పాలేరు గ్రామంలో పొలం పనులు చూసుకొని తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో రోడ్డుపై నడుచుకుంటూ వస్తున్న వ్యక్తిని సూర్యాపేట నుండి ఖమ్మం వస్తున్న మధిర డిపోకి చెందిన ఆర్టీసీ బస్సు రోడ్డుపై నడుస్తున్న వ్యక్తిని బలంగా ఢీకొట్టడంతో వల్లావుల వెంకన్న(65) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

పేద విద్యార్థికి ల్యాప్ టాప్ వితరణ

నవతెలంగాణ - ఎర్రుపాలెం

వారణాసి ఐఐటిలో చదువుతున్న పేద విద్యార్థి మాలోవత్ అరవింద్ నాయక్‌కు దాత ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దండెం సత్యనారాయణ రెడ్డి 40 వేల రూపాయల విలువైన ల్యాప్ ట్యాప్‌ను శనివారం వితరణ చేశారు.మండల కేంద్రమైన ఎర్రుపాలెం సర్దార్ జమలాపురం కేశవ రావు జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో మండల పరిధిలోని రేమిడిచర్ల గ్రామానికి చెందిన అరవింద్ నాయక్ తండ్రి వినయ సాగర్‌కు అందించారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జమలాపురపు గోపాలకిషన్‌రావు, మాజీ గ్రామ పంచాయతీ సర్పంచ్ సామినేని రామారావు, రామిశెట్టి ఏసుబాబు, వై.నాగేశ్వరరావు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో మృతుని కుటుంబానికి పరిహారం

నవతెలంగాణ-కారేపల్లి

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాధితుడి కుటుంబానికి పరిహారం కేసు లోక్ అదాలత్‌లో పరిష్కారమైనట్లు కారేపల్లి పుష్పాల రామారావు శనివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బయ్యారం మండలం సింగారం గ్రామానికి చెందిన సపావట్ శివ 2023 జూలై 25వ తేదిన గాంధీనగర్‌కు మోటర్ సైకిల్‌పై వస్తున్నాడు. అదే క్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లికి చెందిన గంటసాల సాయి ప్రవన్ బాజాజ్ ఆటోట్రాలీ నడుపుతూ ఎదురు మోటర్ సైకిల్ వస్తున్న శివను ఢీ కొట్టాడు. ఈప్రమాదంలో శివ అక్కడికక్కడే మృతి చెందగా కారేపల్లి పోలీసులు కేసులు డ్రైవర్ సాయిపవన్, ఓనర్ రావుల కృష్ణలపై మృతుని భార్య సపావట్ ఝాన్సీ పిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. దీనిని కారేపల్లి పోలీసులు మోటర్ వెహికిల్ ట్రిబునల్‌కు పంపించారు. ఈ కేసుకు సంబంధించి ఇరుపక్షాలు లోక్ అదాలత్‌లో రావటంతో విచారించిన జిల్లా 3వ అడిషనల్ జడ్జి డీ.రాంప్రసాదరావు శనివారం రూ.5లక్షలు పరిహారం చెల్లించాలని రెస్పాడెంట్‌లను ఆదేశించారు. దానిని శిరసావహించిన రెస్పాడెంట్‌లు బాధితకుటుంబానికి రూ.5 లక్షల పరిహార చెక్‌ను లోక్ అదాలత్ జడ్జికి అందజేయగా ఆయన దానిని బాధితులకు అందజేశారు.

పశువైద్య శిబిరం

నవతెలంగాణ-చింతకాని

మామునూరు, వరంగల్ పశువైద్య కళాశాల వారిచే పశుధన్ జాగృతి అభియాన్ పథకంలో భాగంగా, పశు గర్భ కోశ వ్యాధి చికిత్స శిబిరం ఆదివారం ఏర్పాటు చేసినట్లు మండల పశు వైద్యాధికారి డాక్టర్ రామ్ జీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు రైతు వేదిక, లచ్చగూడెం నందు విశ్వవిద్యా లయ నిపుణులుచే పాడి పరిశ్రమ రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు ఈ అవకాశాన్ని మండలంలోని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎస్సీల సమస్యలను పురస్కరిస్తాం

ఎమ్మెల్యే కందాళ హామీ..

నవతెలంగాణ -కూసుమంచి



మండల కేంద్రంలోని ఎస్సీ (మాల) సామాజిక వర్గానికి స్మశాన వాటిక, కమ్యూనిటీ హాల్, సీసీ రోడ్లు, స్మశానం చుట్టు ప్రహరి గోడ నిర్మాణం, కావాలని శనివారం పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందాళ మాట్లాడుతూ... మీకున్న సమస్యలు తప్పక పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వెంటనే సర్పంచ్ చెన్నా మోహన్ రావు కు ఫోన్ చేసి స్మశాన వాటిక సిసి రోడ్లు వేయాలని ఆదేశించారు. అలాగే మీరు ఎవరిని నమ్మద్దని, మీ సమస్యలను తీర్చి నాయకుడిని నమ్మి ఓటేయాలని మీకోసం నిరంతరం పనిచేస్తానని, మీరు నా దగ్గరికి ఎప్పుడైనా రావచ్చని భరోసా కల్పించారు.

కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే కందాళ

మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం మండలానికి సంబంధించిన కళ్యాణాలక్ష్మి, షాదీముబారక్ 32 చెక్కులను, లబ్ధిదారులకు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అరెస్టులతో ప్రజా ఉద్యమాలను అణచివేయలేరు



సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భూక్యా వీరభద్రం

నవతెలంగాణ-వైరాటౌన్

కేటీఆర్ పర్యటన సందర్భంగా నిరంతరం అన్ని వర్గాల పేద ప్రజల కోసం పోరాడుతున్న సీపీఐ(ఎం), వామపక్ష పార్టీలు, కాంగ్రెస్, టిడిపి నాయకులను అక్రమంగా అరెస్టు చేసి నిర్బంధించడాన్ని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, వైరా నియోజకవర్గం ఇన్చార్జి భూక్య వీరభద్రం తీవ్రంగా ఖండించారు. తెల్లారుజాము నుంచి గృహనిర్బంధం చేసి అరెస్టు చేయటం ప్రభుత్వం చేతగానితనంగా ఆయన అభివర్ణించారు. వైరాలో భుక్యా వీరభద్రంతోపాటు సిపిఐ(ఎం) వైరా మండల కార్యదర్శి తోట నాగేశ్వరరావు, సాగర్ జలాలు విడుదల, రుణమాఫీ, పామాయిల్ కు మద్దతు ధర కోసం మంత్రికి వినతి పత్రం ఇవ్వడానికి వెళ్లిన తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు తోపాటు రైతు సంఘం నాయకులు చింతనిప్పు చలపతిరావు, సంక్రాంతి నర్సయ్య, ఎస్.డి పాషా, సంక్రాంతి పురుషోత్తం, సంక్రాంతి వెంకటేశ్వరరావు, కొణిజర్లలో సిపిఐ(ఎ) జిల్లా కమిటీ సభ్యులు తాళ్లపల్లి కృష్ణ, ఏన్కూరులో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు బానోత్ బాలాజీ తదితర ప్రాంతాలలో సిపిఐ(ఎం) శ్రేణులను అక్రమంగా అరెస్ట్ చేయడానికి ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. పోడు భూముల సమస్య, సాగర్ జలాలు విడుదల చేయాలని, గృహలక్ష్మి పథకాన్ని అమలు చేయాలని, ఆశా, అంగన్వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులు సమస్యలను పరిష్కరించాలని పోరాడుతున్న వామపక్ష నాయకులను అరెస్టు చేయటం సబబు కాదని, భవిష్యత్తులో బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని కోరారు.

టీడీపీ నేతల ఏన్కూరుకు పోలీస్ స్టేషన్ తరలింపు

కల్లూరు : ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ సత్తుపల్లి పర్యటన సందర్భంగా కల్లూరు, పెనుబల్లి, తల్లాడ మండలాల చెందిన కాంగ్రెస్, టిడిపి నాయకుల్ని, కార్యకర్తలని అక్రమంగా అరెస్టు చేసి శనివారం ఏన్కూర్ పోలీస్ స్టేషన్ కి తరలించారు. వివిధ సంస్థలపై మంత్రి నిలదీస్తారని భయంతోనే తమను అర్ధరాత్రి ఇళ్ల దగ్గర నుండి అరెస్ట్ చేశారని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సత్తుపల్లి నియోజకవర్గం నాయకులు కొండూరు సుధాకర్, కల్లూరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పెద్ద బోయిన దుర్గాప్రసాద్, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు చిట్టిబాబు మాట్లాడుతూ గత పది సంవత్సరాల నుండి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో అధికార పార్టీ తీరుపై టిడిపి, కాంగ్రెస్ పార్టీలు ఆగ్రహం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో మంత్రి పర్యటన అడ్డుకుంటారని భావించిన పోలీస్ శాఖ అరెస్టు చేసింది ఆరోపించారు. అరెస్ట్ అయిన వారిలో కాటేపల్లి కిరణ్, యాస వెంకటేశ్వరరావు, ఎంగల సురేష్ ధారారంగా లక్ష్మణరావు తదితరులు అరెస్ట్ చేశారు.

కేటీఆర్ పర్యటనకు ముందస్తు అరెస్టు

కామేపల్లి : మంత్రి కేటీఆర్ పర్యటనకు ముందస్తుగా కాంగ్రెస్, సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా నాయకులను పోలీసులు అరెస్టు చేసి తాళ్ళగూడెం పోలీస్‌స్టేషన్ కు తరలించారు. అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు అని అరెస్టులు చేయడం పిరికిపందే చర్య అని నాయకులు తీవ్రంగా ఖండించారు.

ఉద్యోగుల సమస్యలపై కేటీఆర్‌కు వినతి



నవతెలంగాణ-ఖమ్మం

టీఎన్జీఓ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్.అఫ్జల్ హసన్, ఆర్.వి.ఎస్.సాగర్‌ల ఆధ్వర్యంలో పలు ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల సమస్యలపై సదరు ఉద్యోగులతో కలిసి మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సహకారంతో రాష్ట్ర ఐటి, పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి వినతిపత్రం అందజేశారు. ఖమ్మం పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించేందుకు వచ్చిన మంత్రి కేటీఆర్, రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఎంపీ నామ నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ,బండి .పార్థ సారధి రెడ్డిలను టీఎన్జీవో యూనియన్ జిల్లా అధ్యక్షులు ,జే ఏ సి ఛైర్మెన్ షేక్.అఫ్జల్ హసన్ ఉద్యోగులతో కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రంను టీఎన్జీఓస్ జిల్లా యూనియన్,ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా అఫ్జల్ హసన్ మాట్లాడుతూ ఉద్యోగుల సీపీఎస్, రద్దు పీఆర్సీ, డీఏ బకాయిలు, ఈహెచ్ఎస్, ప్రతినెలా 1వ తేదీన జీతాల చెల్లింపు పెండింగ్ బిల్లులు, పూర్వ విఆర్వోలు 010 కింద నియకమం, పెండింగ్ లో ఉన్న విఆర్ఓ కుటుంబాలకు కారుణ్య నియామకాలు, వీఆర్ఏలకు ఐడీలు ఇచ్చి జీతాలు చెల్లింపు తదితర సమస్యలపై పరిష్కారం చూపాలని మంత్రి కేటీఆర్ కు వినతి పత్రంలో వివరించినట్లు అఫ్జల్ హసన్ చెప్పారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీఓ రాష్ట్ర కార్యదర్శి జి.ఎస్.ప్రసాద్ రావు, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు సుంచు వీర నారాయణ, టౌన్ అధ్యక్షులు నాగుల్ మీరా,మహిళావిభాగం జిల్లా అధ్యక్షురాలు శాబాసు జ్యోతి, ఖమ్మంరూరల్,వైరా యూనిట్ అధ్యక్షులు వెంకట్ రెడ్డి, స్వప్న, కల్లూరు యూనిట్ కార్యదర్శి సువర్జన్ పాల్ పాల్గొన్నారు.

కేటీఆర్‌కు అంగన్వాడీలు వినతి

అంగన్వాడీ ఉద్యోగుల డిమాండ్లు తక్షణమే పరిష్కరించాలని ఖమ్మం పర్యటనకు వచ్చిన కేటిఆర్‌కు అంగన్వాడీలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు అంగన్వాడీ యూనియన్ నాయకురాలు బి.కోటేశ్వరి, రాష్ట్ర సహాయ కార్యదర్శి, యు.కె. సుధారాధ, తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి సి.హెచ్. సీతామాలక్ష్మి, ఏఐటీయూసీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు గాదె లక్ష్మినారాయణ, ఏఐటీయూసీ మున్సిపల్ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మందా వెంకటేశ్వర్లు, ఉల్లంఘి పద్మ జిల్లా ఉపాధ్యక్షురాలు, కె.లక్ష్మిమణి మాట్లాడుతూ సమ్మె డిమాండ్లు న్యాయమైనవి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మన పక్కనే ఉన్న తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాల్లో అక్కడ రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించారని, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో అంగన్వాడీ ఉద్యోగులకు హెల్త్ కార్డులు ఇచ్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు అంగన్వాడీ యూనియన్ కె. సుదారాధ, జిల్లా కార్యదర్శి, జిల్లా నాయకులు జి.రమ, జిల్లా సహాయ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఏపిజివిబి రూరల్ బ్రాంచ్ మేనేజర్ రమేష్‌బాబు

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏపీజీవీబీ రూరల్ బ్రాంచ్ మేనేజర్ రమేష్ బాబు అన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్‌బ్యాంక్ (ఏపిజివిబి) వరంగల్ క్రాస్‌రోడ్ బ్రాంచ్ ఆధ్వర్యంలో తల్లంపాడు గ్రామం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు, ఖాతాదారుల అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ సైబర్‌నేరాలపై, సామాజిక భద్రత కలిగించే పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం, ఉపాధ్యాయ బృందం, బ్యాంకుమిత్ర జిల్లపల్లి సత్యవతి, విద్యార్థులు, ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.

పులి నరసింహారావుకు ఎంపీపీ నివాళి

నవతెలంగాణ- తల్లాడ

మండల పరిధిలోని బాలపేట గ్రామంలో పులి నరసింహరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన దశదినకర్మ శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ డి శ్రీనివాసరావు పాల్గొని చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. నివాళులర్పించిన వారిలో దొడ్డ చిన్న శ్రీనివాసరావు, లక్ష్మణ్, పడాల భాగ్యరావు, లక్ష్మయ్య, నాగేశ్వరరావు ఉన్నారు.

కొనసాగుతున్న ఆందోళనలు

నవతెలంగాణ-కారేపల్లి

ఆందోళనలో భాగంగా కారేపల్లిలో సీఐటీయు ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు ర్యాలీ నిర్వహించారు. ప్రదర్శనగా అంగన్‌వాడీలు కదిలి షాపులలో బిక్షాటన చేశారు. కారేపల్లి బస్టాండ్ సెంటర్‌లో మానవహారంగా నిలబడి నినదించారు. సమ్మెకు ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు వజ్జా రామారావు, దుగ్గి కృష్ణలు సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో సీఐటీయు మండల కన్వీనర్ కే.నరేంద్ర, శాంతయ్య అంగన్‌వాడీ వర్కర్సు యూనియన్ కామేపల్లి ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు దుగ్గి పాపారాణి, సోమందుల, నాగమణి పాల్గొన్నారు.

కారేపల్లి : ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన వర్కర్ల సమ్మె శిబిరాలను సీపీఐ(ఎం) జిల్లా నాయకులు దుగ్గి కృష్ణ, న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు వై.ప్రకాశ్, సీఐటీయు మండల కన్వీనర్ కే.నరేంద్ర లు సందర్శించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి వై.జానకి, మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ నాయకురాలు మంగతాయి, నర్సమ్మ, స్వరూప విక్టోరియా, ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు కమల, కళ్యాణి, కుమారి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

ఎర్రుపాలెం : మండల వనరుల కేంద్రం వద్ద రెండో రోజు శనివారం నిరసన దీక్షను చేపట్టారు. దీక్ష శిబిరాన్ని సిఐటియు మండల కన్వీనర్ సగ్గుర్తి సంజీవరావు సందర్శించారు. కార్యక్రమంలో మధ్యాహ్నం భోజన కార్మికుల మండల అధ్యక్ష కార్యదర్శులు సరోజిని, విజయ, కార్మికులు శాంత కుమారి, రాణి, భవాని, మంగమ్మ, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చింతకాని : ఆశా కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని ఆశా కార్యకర్తలు చింతకాని మండల కేంద్రంలోని ప్రధాన సెంటర్లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ(ఎం) మండల కమిటీ సభ్యులు వత్సవాయి జానకి రాములు మాట్లాడుతూ ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించి, రూ. 18 వేలు ఫిక్స్ వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ గడ్డం రమణరావు, నాయకుల గడ్డం కోటేశ్వరరావు, ఆశా కార్యకర్తలు కమల, ఉమా తదితరులు పాల్గొన్నారు.

త్రిపురలో రైతు నాయకులపై భౌతిక దాడులు, ఇళ్ల విధ్వంసంపై నిరసన

నవతెలంగాణ-ఖమ్మం

త్రిపుర రాష్ట్రంలో ఎన్నికల అనంతరం రైతు సంఘం నాయకులపై భౌతికదాడులు, ఇండ్లు విధ్వంసంకు నిరసనగా అఖిల భారత కిసాన్ సభ జాతీయ కమిటీ పిలుపు మేరకు మంగళవారం ఖమ్మంలో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ త్రిపుర ప్రభుత్వ అండతో బిజెపి వామపక్ష పార్టీల కార్యకర్తలు, రైతు సంఘం నాయకులపై భౌతిక దాడులు, ఇండ్లు విధ్వంసంకు పాల్పడ్డారని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతిపక్ష పార్టీలకు ఓట్లు వేసిన ప్రజలపై దాడులను ఖండించాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్ ఉపాధ్యక్షులు తాతా భాస్కరరావు, వాసిరెడ్డి ప్రసాద్, తాళ్ళపల్లి కృష్ణ కుసుమూడి మధు, తోట నాగేశ్వరరావు, చెరుకూరి మురళి, తాతా తిలక్ తదితరులు పాల్గొన్నారు.

కల్లూరుకు చేరిన బతుకమ్మ చీరలు

నవతెలంగాణ-కల్లూరు

దసరా పండుగ సందర్భంగా ప్రభుత్వం పేద మహిళలకు బతకమ్మ చీరలు కానుకగా అందించడం కోసం ప్రభుత్వం 16,208 చీరలు శనివారం కల్లూరుకు చేరుకున్నాయి. మండలంలో మొత్తం 20వేలకు పైగా చీరలు పేదలకు అందించాలని లక్ష్యం కాగా మొదట విడతా 16,208 చీరలు కల్లూరు రావడంతో తాహసిల్దార్ జంగా బాబ్జి ప్రసాద్, ఎండిఓ బి.రవికుమార్, ఆర్ఐలు స్టాలిన్, అన్వర్ భాష, ఏపిఎం వెంకట రామారావు దగ్గరుండి శ్రీ శక్తి భవనలో దిగుమతి చేశారు.

రొట్టమాకురేవు కవిత్వ అవార్డుకు ఎంపిక పూర్తి

నవతెలంగాణ-కారేపల్లి

ప్రముఖ కవి యాకూబ్ ప్రతి ఏడాది ఇచ్చే రొట్టమాకురేవు కవిత్వ అవార్డులకు కవుల ఎంపిక పూర్తి అయింది. దీనికి సంబంధింటి కవి యాకూబ్ విలేకరులకు శనివారం వివరించారు. పుట్టిన ఊరు రొట్టమాకురేవు కవిత్వ అవార్డులను కన్నతండ్రి షేక్ మహ్మద్ మియా, తనకు వెన్నుదన్నుగా నిలిచిన పురిటిపాటి రామిరెడ్డి, కెఎల్.నర్సింహారావుల పేరిట స్మారక అవార్డులను కవిత్వంలో కొత్తవరవడి సృష్టిస్తున్న కవులకు 10 ఏండ్లుగా ఇస్తున్నట్లు తెలిపారు. రొట్టమాకురేవు కవిత్వ అవార్డు -2023 షేక్ మహమ్మద్ మియా స్మారక అవార్డుకు "ఎవరికి వర్తిస్తే వారికి" కవి ప్రసేన్‌కు పిరిటిపాటి రామిరెడ్డి స్మారక అవార్డు "ఇక మారాల్సిందే నువ్వే " కవి పెనుగొండ సరసిజ, కేఎల్.నర్సింహారావు స్మారక అవార్డు లను తూనీగతో సాయంకాలం రచయిత, తెలుగు వెంకటేశ్, మరో అవార్డు "మా నాయిన పాట" కవి సుంకర గోపాలయ్య ఎంపికైనట్లు తెలిపారు.

అమరుల త్యాగ ఫలితమే నేటి భారతం

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

అమరుల త్యాగ ఫలితమే నేటి భారతమని పోస్టల్ మెయిల్ ఓవర్సీస్ మల్లికార్జున్‌రావు అన్నారు. మండలంలోని కాచిరాజుగూడెం గ్రామంలో పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో శనివారం 'మా మట్టి...మాదేశం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమర యోధుడు, మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు మంచికంటి రాం కిషన్‌రావు విగ్రహం వద్ద దేశ పునర్‌నిర్మాణం కోసం ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా మల్లికార్జునరావు మాట్లాడుతూ ఎన్నో వేల మంది ప్రాణత్యాగం చేయడం వలన ఈరోజు స్వేచ్ఛతో 140 కోట్ల మంది ఊపిరి పీలుస్తున్నారని తెలిపారు. ఈ దేశ స్వాతంత్రం కోసం తృణప్రాయంగా ప్రాణాలను వదిలిన అమరవీరులను స్మరించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చావిడి నాగమణి, పోస్టుమాస్టర్ లెనిన్ శ్రీనివాసరావు, అనుములు సాయి, రాము, గ్రామ పెద్దలు పొన్నం వెంకటరమణ, సందీప్, పాఠశాల ఉపాధ్యాయులు శేషగిరిరావు, ఆశ, రంజిత, సామాజికవేత్త గరిపల్లి మురళి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో రెడ్ కలర్ డే

నవతెలంగాణ- ఖమ్మం



నగరంలోని సహకార్‌నగర్ లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో శనివారం విద్యార్థిని, విద్యార్థులు రెడ్ కలర్ డే నిర్వహించు కున్నారు. విద్యార్థిని విద్యార్థులు రెడ్ కలర్‌లో ఉన్న డ్రెస్సెస్ ధరించి, రెడ్ కలర్ బెలూన్స్ ఎగరవేసి, వివిధ రకాల కళాత్మక వస్తువులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి టాలెంట్ స్కూల్ కరెస్పాండెంట్ మహమ్మద్ జహీదా ఖాతూన్, ఇంచార్జ్ రేవతి, షాహీన్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయునికి సన్మానం

నవతెలంగాణ-వైరా

వైరా మండలం ఉప్పలమడక ఎంపీపీఎస్ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు దాసరి వెంకటేశ్వరావు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక అయిన సందర్భంగా శనివారం పాఠశాలలో సన్మానం జరిగింది. ఉప్పల మడక గ్రామపంచాయతీ సర్పంచ్ తుమ్మల జాన్ పాపయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం వెంకటేశ్వరావు, మరియు బిఎల్ఐలు సన్మానించారు. సన్మాన కార్యక్రమంలో గరికపాడు కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు దొంతిబోయిన సత్యనారాయణరావు మాట్లాడుతూ ఉత్తమ ఉపాధ్యాయుడుగా ఎంపిక కావడం గర్వకారణం అన్నారు. కార్యక్రమంలో గోవర్ధన్‌రెడ్డి, నరసింహారావు, బుర్గు సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

దళితబంధులో రాజకీయ జోక్యాన్ని నివారించాలి : సీపీఐ(ఎం)

నవతెలంగాణ- నేలకొండపల్లి



దళితులు, బీసీల సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన దళిత బంధు, బీసీ బందు పథకాలలో అధికార పార్టీ నాయకుల రాజకీయ జోక్యాన్ని నివారించి అర్హులైన ప్రతి ఒక్కరికి దళిత, బిసి యూనిట్‌లు మంజూరు చేయాలని సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాలేరు నియోజకవర్గ ఇన్చార్జ్ బండి రమేష్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సిపిఐ(ఎం) కార్యాలయం రావెళ్ల సత్యనారాయణ భవనంలో పార్టీ మండల జనరల్ బాడీ సమావేశం రచ్చ నరసింహారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితబంధు, బీసీబందు పథకాలలో అధికార పార్టీ నాయకుల జోక్యంతో పార్టీ కార్యకర్తలకు మాత్రమే యూనిట్లు మంజూరు చేస్తూ అర్హులైన లబ్ధిదారులను విస్మరిస్తున్నారని విమర్శించారు. పార్టీ నాయకులు కమీషన్లకు కక్కుర్తిపడి ప్రజా సంక్షేమ పథకాలను అర్హులకు దక్కకుండా వారి కార్యకర్తలకు పంపిణీ చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. సంక్షేమ పథకాల అమలుతీరులో పారదర్శకతకు పాతరేసిన అధికారులు సైతం అధికార పార్టీకి వంత పలుకుతూ అర్హులైన వారికి అన్యాయం చేస్తున్నారన్నారు. లక్ష రూపాయల రైతు రుణమాఫీలో కేవలం పాతికవేల రూపాయల అప్పు కలిగిన రైతులకు మాత్రమే మాఫీ చేసి మిగతా లక్ష రూపాయల వరకు అప్పు కలిగిన రైతులను విస్మరించడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు రుణాలు పూర్తిస్థాయిలో మాఫీ కాక తిరిగి రుణాలు ఇవ్వక పోవడంతో వ్యవసాయ పెట్టుబడులకు రైతులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారన్నారు. గృహలక్ష్మి పథకంలో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి 5 లక్షల రూపాయలు మంజూరు చేయాలని, ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు, పింఛన్లు అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేస్తున్న ఆశా వర్కర్లు, అంగన్వాడీలకు పార్టీ తరఫున సంపూర్ణ సంఘీభావం, మద్దతు తెలియజేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రజలు, రైతులు, కార్మికులు, కూలీలు, అన్ని వర్గాల ప్రజానీకం ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, లేనియెడల పెద్ద ఎత్తున ప్రజలను సమీకరించి ఆందోళనలకు పూనుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కె.వి.రామిరెడ్డి, బెల్లం లక్ష్మి, దుగ్గి వెంకటేశ్వర్లు, భూక్య కృష్ణ, పగిడికత్తుల నాగేశ్వరరావు, కట్టెకోల వెంకన్న, సిరికొండ ఉమామహేశ్వరి, మారుతి కొండలరావు, దేగల వెంకటేశ్వరరావు, మందడపు మురళీకృష్ణ, బండి రామమూర్తి, శీలం అప్పారావు, పెద్దిరాజు నరసయ్య, శివరాజు, దండ సూర్యనారాయణ, మున్నంగి లక్ష్మి, కె.వి చారి, మారుతి సూర్యనారాయణ, చింతలపాటి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

హామీలను వెంటనే అమలు చేయాలి

సీపీఐ(ఎం) పాలేరు డివిజన్ ఇన్‌చార్జి బండి రమేష్

నవతెలంగాణ- కూసుమంచి

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని, ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, ఇంకా అలసత్వం వహిస్తే సహించేది లేదని, పాలేరు నియోజకవర్గం వ్యాప్తంగా సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్మిస్తామని పార్టీ పాలేరు డివిజన్ ఇంచార్జీ బండి రమేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శనివారం మండలంలోని మల్లేపల్లి గ్రామంలో గల పార్టీ కార్యాలయంలో ఆ గ్రామ సర్పంచ్ పొట్ట పెంజర నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన మల్లేపల్లి జోన్ కమిటీ సమావేశంలో బండి రమేష్ మాట్లాడుతూ రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు చేయలేదని, ప్రతి గ్రామంలో ఒకటి లేదా ముగ్గురు రైతులకు మినహాయిస్తే ఎక్కడా రుణమాఫీ అమలు కాలేదన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా రైతులు రుణమాఫీ కోసం ప్రతిరోజు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారని, రుణమాఫీ ఎప్పుడు అవుతుందా అని ఎదురు చూస్తున్నారని అనానరు. నియోజకవర్గ వ్యాప్తంగా కల్లుగీత కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందని అన్నారు. గొర్రెల పంపిణీలో రాష్ట్ర ప్రభుత్వం అలసత్వం వహిస్తుందని, కురుమ, యాదవులకు ఆయా గ్రామాలలో గొర్రెల పథకానికి వడ్డీల తీసుకువచ్చి మరి యాదవులు డీడీలు కట్టారని, కానీ ఇంతవరకు గ్రామాలలో ఒకటి రెండు యూనిట్లు ఇచ్చి చేతులు దులుపుకున్నారని రాష్ట్ర ప్రభుత్వం యాదవులను తీవ్రంగా మోసం చేసిందని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం యాదవులకు వెంటనే గొర్రెలను కానీ లేదా నగదు రూపాయల నగదును కురుమ యాదవులకు ఇచ్చి వారిని ఆదుకోవాలన్నారు. సమావేశంలో మల్లెపల్లి జూన్ కన్వీనర్ తోటకూరి రాజు, ముకుందా రెడ్డి, వీరస్వామి, రాధాకృష్ణ, మాజీ సర్పంచ్ తాళ్ళూరి రవి, ప్రతాప్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రేపటి ప్రజావాణి రద్దు

నవతెలంగాణ-పాల్వంచ

అక్టోబర్ 2వ తేదీ సోమవారం గాంధీ జయంతి సందర్భంగా ప్రభుత్వ సెలవు దినము అయినందున ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ప్రియాంక ఒక ప్రకటన తెలిపారు. ప్రభుత్వ సెలవు కాబట్టి అధికారులు అందుబాటులో ఉండని కారణంగా ప్రజలు ఎవరూ ఫిర్యాదులు ఇచ్చేందుకు కలెక్టరేట్ రావద్దని కలెక్టర్ సూచించారు.

వైద్య సేవలపై పాలకవర్గ తీర్మానం ఇవ్వండి : సీపీఐ(ఎం)

నవతెలంగాణ-చర్ల



మండల కేంద్రంలో ఉన్న సిమాంగ్ సెంటర్, ప్రతిపాదనలు వచ్చి నిర్మించబోయే కమ్యూనిటీ హెల్త్ సెంటర్ త్వరితగతిన నిర్మాణం, వైద్య సేవలపై మేజర్ గ్రామపంచాయతీ పాలకవర్గ తీర్మానం ఇవ్వాలని సీపీఐ(ఎం) మండల కమిటీ పంచాయతీ కార్యదర్శి కుంచెం కృష్ణను కోరింది. సీపీఐ(ఎం) 13వ వార్డు మెంబర్ దొడ్డి హరినాగ వర్మ నేతృత్వంలో పార్టీ మండల కమిటీ బృందం పంచాయతీ కార్యదర్శి కలసి కరపత్రం ఇచ్చి శనివారం జరిగిన సాధారణ సమావేశంలో తీర్మానం చేయాలని కోరింది. ఉప సర్పంచ్ శివ లక్ష్మీనారాయణ, వార్డు సభ్యులు ముత్యాల ప్రసాద్, మద్దిబోయిన సత్యనారాయణ, బిందు, దొడ్డి హరినాగ వర్మ తదితరులు తీర్మానం చేయాలని కార్యదర్శిని కోరారు. సానుకూలంగా స్పందించిన కార్యదర్శి త్వరితగతిన పాలకవర్గ తీర్మానం జిల్లా కలెక్టర్కు, సంబంధిత అధికారులకు పంపిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి కారం నరేష్, మండల కమిటీ నాయకులు మచ్చ రామారావు, బందెల చంటి, పామారు బాలాజీ, ఇన్చార్జి సత్తనపల్లి సాంబ తదితరులు పాల్గొన్నారు.

ఆటల పోటీల్లో సత్తా చాటిన ఎక్సలెంట్ స్టార్ హై స్కూల్ విద్యార్థులు

నవతెలంగాణ-మణుగూరు



పట్టణంలోని ఎక్సలెంట్ స్టార్ హై స్కూల్ విద్యార్థులు గొందిగూడెంలో నిర్వహించిన జోనల్ జిల్లా స్థాయి ఆటల పోటీల్లో మరోసారి ఉత్తమ ప్రతిమను కనబరిచి విజయం సాధించారని శనివారం యాజమాన్యం తెలిపింది. సీనియర్ బాయ్స్ 400 మీటర్స్ రన్నింగ్ ఫస్ట్ ప్రైస్ పి.వెంకట్, జూనియర్ గర్ల్స్ రన్నింగ్ సెకండ్ బహుమతి పి.నందిని, జూనియర్ గర్ల్స్ 400 మీటర్స్ రన్నింగ్ ఫస్ట్ బహుమతి సీనియర్ గర్ల్స్ డిస్క్ త్రో సెకండ్ ప్రైజ్ టి.లిఖిత, సీనియర్స్ గర్ల్స్ సెకండ్ ప్రైజ్ హర్షిని, రామ్ జై యామిని మొదలైన వారు విజయం సాధించారు. జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులు జూనియర్ బాయ్స్ కబడ్డీ సమీర్, రోషన్ జూనియర్ బాయ్స్ వాలీబాల్ రామ్ చరణ్, సీనియర్ గర్ల్స్ కబడ్డీ తోరణ తన్మయి, సీనియర్ గర్ల్స్ ఆసియా హర్షిని, సీనియర్ గర్ల్స్ కోకో ప్రీతి చారుణ్య ఎంపికైనారని అన్నారు. ఇంతటి విజయాన్ని సాధించిన విద్యార్థినీ, విద్యార్థులను పాఠశాల యాజమాన్యం చైర్ పర్సన్ యూసఫ్ షరీఫ్ కరస్పాండెంట్ ఖాదర్, డైరెక్టర్ యాకుబ్ షరీఫ్, ఉపాధ్యాయునీ బృందం విద్యార్థులను అభినందించారు.

కోర్టును ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా జడ్జి

నవతెలంగాణ-ఇల్లందు

ఆకస్మిక తనిఖీ నిమిత్తం ఇల్లందు విచ్చేసిన జిల్లా జడ్జి వసంత్ పాటిల్కు పుష్ప గుచ్ఛంతో ఇల్లందు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి దేవరపల్లి చంద్రిక రెడ్డి స్వాగతం పలికినారు. అనంతరం ఇల్లందు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్, ఎగ్జిక్యూటివ్ బాడీ పుష్పగుచ్ఛం అందజేసినారు. అనంతరం శాలువాలతో సత్కరించినారు. జిల్లా జడ్జి పిడిఎం కోర్టు, అడిషనల్ కోర్టు భవనాలను, వారు పరిశీలించారు, పలు రికార్డులు తనిఖీ చేసినారు. ఇల్లందు ఫారెస్ట్ గ్రౌండ్ నందు కొత్తగా నిర్మించబోయే కోర్టు స్థలాన్ని పరిశీలించారు. పిడిఎం జడ్జి బి.రామారావు, ఇల్లందు పీడీ ఎం జడ్జ్ దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డి, కోర్టు ఏవో అనిత వాణి, ఇల్లందు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మామిడి సత్య ప్రకాష్, జాయింట్ సెక్రటరీ కీర్తి కార్తిక్, ట్రెజరర్ కే.ఉమామహేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జోనల్ స్థాయిలో ముద్దుకూరు విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-చండ్రుగొండ

జోనల్ స్థాయి జుల్లూరు పాడులో జరిగిన బాలుర, బాలికల ఆటల పోటీలో ముద్ద కూర్ విద్యార్థులు ప్రతిభ చాటారు. బాలల విభాగంలో కబడ్డీ, వాలీబాల్ కోకో క్రీడలులో మంచి ప్రతిభ చాటిన క్రీడాకారులు. జిల్లా స్థాయి పోటీల్లో అర్హత సాధించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు కె.భవాని మాట్లాడారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వచ్ఛత ఈ సేవ

నవతెలంగాణ-దుమ్ముగూడెం

మండల కేంద్రమైన దుమ్ముగూడెం గ్రామంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం స్వచ్ఛత ఈ సేవ కార్యక్రమం నిర్వహించారు. కాకతీయ యూనివర్సిటీ వరంగల్ యన్‌యస్‌యస్ యూనిట్ వారి ఆదేశాల ప్రకారం వన్ అవర్ శ్రమదాన్ ఫర్ స్వచ్ఛత అనే కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ యల్.వెంకటేశ్వర్లు, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి మల్లెల శ్రీనివాసరావు, విద్యార్థినీ, విద్యార్థులు స్వచ్ఛందంగా పాల్గొని కళాశాల ఆవరణంలోని హానికారక మొక్కలను తొలగించి, పర్యావరణానికి ఆటంకం కలిగించేలా ఉన్న ప్లాస్టిక్ కవర్లు తదితర చెత్తాచెదారాలను తొలగించారు. ఈ కార్యక్రమంలో కళాశాలలోని అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

వస్తున్నా మీకోసం రేగన్న ప్రగతి

- పాటల సీడీ ఆవిష్కరించిన విప్ రేగా

నవతెలంగాణ-మణుగూరు

వస్తున్నా మీకోసం రేగన్న ప్రగతి పాటల సీడీని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ పినపాక శాసనసభ్యులు రేగా కాంతారావు శనివారం ఆవిష్కరించారు. మండలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పాటల సీడీ లాంఛనంగా ఆవిష్కరించారు. త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల నిమిత్తం ప్రచారం కోసం రూపొందించిన పాటల సీడీని ఆవిష్కరించి ఆ పాటలను ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులతో కలిసి విన్నారు. ఎన్నికల ప్రచారంలో ఈ పాటలతో నియోజకవర్గంలో ముమ్మరంగా ప్రచారం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థి ఎవరైనా కాంగ్రెస్‌ని గెలిపించుకుంటాం

- సీనియర్ కాంగ్రెస్ నాయకుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-మణుగూరు



అభ్యర్థి ఎవరైనా కాంగ్రెస్ పార్టీని గెలిపించుకుంటామని మణుగూరు మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాలమూరు రాజు తెలిపారు. శనివారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుల ఆత్మీయ సమ్మేళనం కిన్నెర కల్యాణ మండపంలో పగిడేరు సర్పంచ్ తాటి సావిత్రి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాట్లాడుతూ ఏఐసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాహుల్ గాంధీ, తెలంగాణ టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీకి కృషి చేస్తామన్నారు. ప్రస్తుతం పినపాక నియోజకవర్గం శాసన సభ్యత్వానికి 17 మంది పోటీ పడుతున్నారని అన్నారు. ఎవరికి టికెట్ వచ్చినా ఒక్క తాటిపై కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో సామ శ్రీనివాస్ రెడ్డి, రవి, అధిక సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

పిడుగుపాటుతో పశువుల కాపరి మృతి

నవతెలంగాణ-దుమ్ముగూడెం

మండలంలో మధ్యాహ్నం ఉరుములతో కూడిన భారీ వర్షం రావడంతో పిడుగుపాటుకు గురై పశువుల కాపరి మృతి చెందిన ఘటన వైట్ నాగరం గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పాయం పుల్లయ్య(60) పశువులను మేత కోసం గ్రామ శివారులోకి తోలుకెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో ఉరుములతో కూడిన వర్షం రావడంతో పిడుగుపాటుకు గురై అక్కడికి అక్కడే మృతి చెందాడు. ఆర్ఐ లక్ష్మయ్య సంఘటన స్థలాన్ని పరిశీలించి పంచనామ నిర్వహించి విపత్తుల ప్రమాదం వలన మృతి చెందినట్లు ఉన్నతాధికారులకు నివేదించారు. కాగా రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు డిమాండ్ చేశారు.

కానిస్టేబుల్ మృతి పట్ల రేగా నివాళి

నవతెలంగాణ-భద్రాచలం



భద్రాచలం పట్టణంలో ప్రమాదవశాత్తు హెడ్ కానిస్టేబుల్ శ్రీదేవి మరణించడంతో ఏరియా హాస్పిటల్‌కి వెళ్లి మృతదేహాన్ని ప్రభుత్వ విప్, పినపాక శాసనసభ్యులు రేగా కాంతారావు సందర్శించి నివాళులు అర్పించారు. విధి నిర్వహణలో హెడ్ కానిస్టేబుల్ మరణించడం అత్యంత బాధాకరమన్నారు. ప్రభుత్వ పరంగా సహాయం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యురాలు మాలోత్ కవిత, భద్రాచల నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్ రావు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ పర్యటనపై వాన 'నీళ్లు'

భద్రాద్రిలో భారీ వర్షం

- రద్దయిన కేటీఆర్ ప్రోగ్రాం
- నిరాశతో వెనుదిరిగిన బీఆర్ఎస్ శ్రేణులు
- భారీ వర్షంపై భారీ కామెంట్లు

నవతెలంగాణ-భద్రాచలం



కచ్చితంగా కేటీఆర్ భద్రాచలం వచ్చే సమయం 1:30 నిమిషాలకు భద్రాచలంలో భారీ వర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా గంట పాటు కురిసిన ఈ వానకు భద్రగిరి తడిసి ముద్దయింది. ఖమ్మం పర్యటన ముగించుకొని హెలికాప్టర్లో బయలుదేరిన కేటీఆర్ కొత్తగూడెం చేరుకునే సమయంలో ఇక్కడి వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో భద్రాచలం పర్యటనను కేటీఆర్ రద్దు చేసుకున్నారు. తిరిగి సత్తుపల్లికి వెళ్ళిపోయారు. ఇదే విషయం తెలిసిన కేటీఆర్ అభిమానులు నిరాశ నిస్పృహల్లోకి వెళ్లిపోయారు. భద్రాచలంలో శనివారం కేటీఆర్ పర్యటన జరగాల్సి ఉంది. బీఆర్ఎస్ శ్రేణులు ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. పట్టణంలో భారీ ఫ్లెక్సీలు, కటౌట్లు ఏర్పాటు చేశారు. పెద్ద ఎత్తున ఈ కార్యక్రమానికి సంబంధించి డబ్బులు హెచ్చించారు. పోలీసులు కూడా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అధికారుల హడావుడి కూడా బాగా కనిపించింది.

ఖమ్మం పర్యటనను ముగించుకొని భద్రాచలం చేరుకున్న కేటీఆర్‌కు... ఇక్కడి వాతావరణం అనుకూలించటం లేదన్న సమాచారంతో హెలికాప్టర్ వెనుతిరిగిపోయింది. ఇదే విషయాన్ని ప్రభుత్వ విప్ రేగా కాంతారావు పార్టీ శ్రేణులకు తెలియజేశారు. కేకే ఫంక్షన్ హాల్‌లో కేటీఆర్ కోసం ఎదురుచూస్తున్న స్థానిక బిఆర్ఎస్ శ్రేణులకు తీరని నిరాశే ఎదురయింది. జరిగిన పరిణామానికి అవాక్కైన బిఆర్ఎస్ భద్రాచలం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావు ఒకింత ఆవేదనకు లోనయ్యారు. ఎంతో బాగా కేటీఆర్ పర్యటనకు ఏర్పాట్లు చేసిన ఆయన పర్యటన రద్దుతో కలవరానికి లోనయ్యారు. కేటీఆర్ పర్యటన సందర్భంగా భద్రాచలంలో కురిసిన వర్షం పలు ప్రశ్నలకు దారితీసింది. భారీ వర్షంతో పట్టణమంతా జలమయమైంది. ఉరుములు, పిడుగులతో ఒక్కసారిగా పుణ్యక్షేత్రం ఊగిపోవటంతో... ఏమి జరుగుతుందో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. పట్టణంలో పలుచోట్ల కేటీఆర్ పర్యటన సందర్భంగా ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలు నేలకొరిగాయి. కేటీఆర్ ప్రెస్ మీట్ ఏర్పాటు చేసిన కేకే ఫంక్షన్ హాల్‌లోకి... మోకాల్లోత్తు వర్షపు నీరు వచ్చేసింది. ఫంక్షన్ హాల్ ఎదురుగా కూడా రోడ్డు జలమయమై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కూనవరం రోడ్డులో ఏర్పాటు చేసిన కరకట్ట శిలాఫలకం కూడా నేలకొరిగింది. కేటీఆర్ పర్యటన సందర్భంగా ఇదేంటి...ఇలా జరిగిందంటూ పలువురు గుసగుసలాడుకోవడం వినిపించింది. భద్రాద్రిపై టిఆర్ఎస్ నిర్లక్ష్యమే, ప్రకృతి ప్రకోపానికి దారితీసిందని, రాములోరి ఆగ్రహానికి.. ఇది నిదర్శనం అని పలువురు చెవులు కొరుక్కోవడం కనిపించింది. ఏదేమైనా ఎంతో ఆశతో కేటీఆర్ పర్యటన కోసం ఎదురుచూసిన బిఆర్ఎస్ నాయకులకు, కార్యకర్తలు నిరాశతో వెనుదిరిగారు.



నియోజకవర్గ స్వరూపాన్ని మార్చేస్తా

- బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామేష్

నవతెలంగాణ-చుంచుపల్లి

పరాయి వలస పాలనకు వ్యతిరేకంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని, కొత్తగూడెంలో సైతం పరాయి నాయకులను పక్కకు పెట్టి ఒక్క అవకాశం ఇవ్వాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ విజ్ఞప్తి చేశారు. శనివారం చుంచుపల్లి మండలంలోని రామాంజనేయ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కామేష్ మాట్లాడుతూ ఒక్కసారి అవకాశం ఇస్తే నియోజకవర్గ నైసర్గిక స్వరూపాన్ని మార్చివేస్తానన్నారు. భవిష్యత్ తరాలకు బంగారు బాట వేయాలని దృఢ సంకల్పంతో ప్రజల ముందుకు వచ్చానన్నారు. ఇక్కడి ప్రజలపై అశేష నమ్మకంతో ముందుకు సాగుతున్నట్లు వివరించారు. అధికార పార్టీ నాయకుల ఆగడాలు రోజు రోజుకు ఎక్కువవుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారం ఉందని అహంభావంతో, ఇష్టారాజ్యంగా దోపిడీలు, కబ్జాలు, సెటిల్మెంట్లు చేసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో చుంచుపల్లి మండల అధ్యక్షుడు సోమిడి రాజేష్, ఎమ్.డి.మక్బుల్, మణి, ఉస్మాన్, జగదీష్, రజియా తదితరులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవం కావాలి... బీఆర్ఎస్ అభ్యర్థిని మార్చండి

- ఎంపీ కవిత, ఎంపీపీ నాగరత్నమ్మకైనా టికెట్ ఇవ్వండి
- మంత్రి హరీష్‌రావుకు అసమ్మతి నేతల అభ్యర్థన
- సమస్య సీఎం దృష్టికి తెచ్చి పరిష్కరిస్తాం : మంత్రి హామీ

నవతెలంగాణ-ఇల్లందు



రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు పిలుపు మేరకు బీఆర్ఎస్ పార్టీ అసమ్మతి నేతలు మున్సిపల్ చైర్మెన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, జిల్లా అధికార ప్రతినిధి, రైతు బంధు రాష్ట్ర ఉపాధ్యక్షులు సలహాదారు పులిగళ్ళ మాధవరావులు తమ మద్దతుదారులతో కలిసి శుక్రవారం రాత్రి హైదరాబాదు వెళ్ళారు. నియోజవకర్గం నుండి 15 వాహనాల్లో ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నేతలు 75 మంది తరలి వెళ్ళినట్లు తెలిసింది. తొలుత రాజ్యసభ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ ఇల్లందు నియోజవకర్గ ఇంచార్జి వద్దిరాజు రవిచంద్ర ఇంట్లోనే మహబూబాబాద్ ఎంపీ కవిత, ఎంఎల్‌సి తాత మధులతో అసమ్మతి నేతలు సమావేశమయినట్లు తెలిసింది. గత నాలుగున్నరేళ్ళుగా ఎంఎల్ఏ హరిప్రియ భర్త హరిసింగ్ నాయక్ నియంతృత్వ ధోరణి, అవమానాలు భరించ లేకపోతున్నామని నేతలను, కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేస్తున్న తీరుతెన్నులు, ఇంకా నియోజవకర్గంలో జరుగుతున్న అనేక సమస్యలు వారి దృష్టికి తీసుకెళ్ళినట్లు తెలిసింది. సుమారు రెండు గంటలసేపు చర్చలు సాగినట్లు తెలిసింది. అనంతరం మంత్రి హరీష్‌రావు ఇంటికి రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మహబూబాబాద్ ఎంపి కవిత, ఎంఎల్‌సి తాత మధులు, అసమ్మతి నేతలు వెళ్ళినట్లు తెలిసింది. అక్కడ సుమారు మరో గంటన్నర పాటు మంత్రి హరీష్‌రావుతో సమావేశం జరిగినట్లు తెలిసింది. ఈ సమావేశంలో నియోజవకర్గంలో బీఆర్ఎస్ పార్టీ పనితీరు, ప్రజాప్రతినిధులు, నేతలు, కార్యకర్తలపట్ల ఎంఎల్ఏ హరిప్రియ, ఆమె భర్త హరిసింగ్ నాయక్ అనుసరిస్తున్న వైఖరులు అసమ్మతి వర్గం ఏకరువుపెట్టినట్లు తెలిసింది. తమకు ఇక ఆత్మగౌరవం కావాలని బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని మార్చాల్సిందేనని లేకపోతే తాము పనిచేయ లేమని సమావేశంలో చెప్పినట్లు తెలిసింది. దీంతో మంత్రి హరీష్‌రావు స్పందిస్తూ ఇల్లందు నియోజక వర్గంలో నేను పోటీ చేస్తానని నాకు టికెట్ కావాలని కోరేవారు ఎవరూ లేరుకదా అన్నట్లు తెలిసింది. మరి హరిప్రియకు టికెట్ ఇవ్వవద్దంటే ఎవరికివ్వాలని అడిగినట్లు తెలిసింది. దీంతో అసమ్మతి నేతలు మాట్లాడుతూ మహబూబాబాద్ ఎంపి కవితకు టికెట్ ఇవ్వండి. సాధ్యం కాకపోతే ఇల్లందు ఎంపీపీ నాగరత్నమ్మకైనా టికెట్ ఇవ్వండి గెలిపించుకుంటామని మంత్రి దృష్టికి తీసుకెళ్ళినట్లు తెలిసింది. స్పాట్‌లో సమస్య పరిష్కారం కాదని, మరోసారి సమావేశమై మాట్లాడుకుందాం. సమస్యపై మరింత అధ్యయనం చేసి సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళతామని మంత్రి హరీష్‌రావు అసమ్మతి నేతలకు హామి ఇచ్చినట్లు తెలిసింది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసికట్టుగా ఆడుతున్న డ్రామా

- సింగరేణి ప్రధాన కార్యాలయం ముందు ఆందోళన

నవతెలంగాణ-కొత్తగూడెం



కాంట్రాక్టు కార్మికులకు అమలు చేయాల్సిన సౌకర్యాలు అమలు చేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, సింగరేణి యాజమాన్యం డ్రామాలు చేస్తున్నారని టిపిసిసి జనరల్ సెక్రెటరీ ఎడవల్లి కృష్ణ, సిఐటియూ జిల్లా సహాయ కార్యదర్శి డి.వీరన్నలు అరోపించారు. శనివారం సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సింగరేణి హెడ్డాఫీస్ ముందు నిరసన దీక్ష నిర్వహించారు. ఈ దీక్ష అనంతరం హెడ్డాఫీస్ మేయిన్ గేట్ ఎదురుగా ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సిఐటియూ బ్రాంచ్ అధ్యక్షులు గిడ్డ శ్యాంకుమార్ అధ్యతన జరిగిన సభలో టిపిసిసి జనరల్ సెక్రెటరీ ఎడవల్లి కృష్ణ, సిఐటియూ జిల్లా కార్యదర్శి డి.వీరన్నలు మాట్లాడారు. సింగరేణి అన్నీ విభాగాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. నేరుగా యాజమాన్యమే వేతనాలు చెల్లించాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు కోల్ ఇండియా వేతనం అమలు చేయాలని, జీఓ నెం-22 గెజిట్ చేసి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో మరణించిన కాంట్రాక్ట్ కార్మికులకు కోల్ ఇండియాలో ఇస్తున్న విధంగా రూ.15 లక్షల ఎక్స్ గ్రేషియ ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం సింగరేణి ఎస్ఓటూ డైరెక్టర్ (పా) వరప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమములో కొత్తగూడెం పట్టణ అధ్యక్షులు బొమ్మిడి మల్లికార్జున్, ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జలీల్, ఉపాధ్యక్షులు కాలం నాగభూషణం, ఎస్‌సీకేఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు సక్రాం, భాస్కర్, రమణ, కాంగ్రెస్ పట్టణ మైనార్టీ నాయకులు యం.డి అక్బర్, సిఐటియూ కార్పోరేట్ బ్రాంచ్ అధ్యక్షులు ఫైజుద్దిన్, చుంచుపల్లి మండల మైనార్టీ నాయకులు పక్రొద్దిన్, మొద్దు శీను, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

మణుగూరు ఏరియా బొగ్గు ఉత్పత్తి 111 శాతం

నవతెలంగాణ-మణుగూరు



సెప్టెంబర్ నెలలో మణుగూరు ఏరియా111 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించిందని ఏరియా జీఎం దుర్గం రామచందర్ తెలిపారు. శనివారం జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో మీడియాతో మాట్లాడుతూ సెప్టెంబర్ నెలలో మణుగూరు ఏరియాలో బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 8 లక్షల 88 వేల 500 టన్నులకు గాను 9 లక్షల 89 వేల 464 టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించామన్నారు. సెప్టెంబర్ నెలలో సాధించిన బొగ్గు ఉత్పత్తి 111 శాతంతో సింగరేణి వ్యాప్తంగా 4వ స్థానం నిలుచుందన్నారు. ఉత్పాదకత బొగ్గు ఉత్పత్తి 54 లక్షల 30 వేల 200 టన్నుల లక్ష్యానికి గాను 67 లక్షల 52 వేల 242 టన్నులు సాధించడం జరిగింది. అనగా 124 శాతం ఉత్పాదకత సాధించామన్నారు. సెప్టెంబర్ నెలలో మణుగూరు ఏరియా 9 లక్షల 60 వేల 777 టన్నులను రవాణా చేయటం జరిగిందన్నారు. ప్రోగ్రెస్సివ్‌గా 67 లక్షల 22 వేల 691 టన్నులు రవాణా చేసామన్నారు. గత సంవత్సరం కంటే 12 లక్షల 70 వేల 504 టన్నుల బొగ్గు అధికముగా ఉత్పత్తి చేశామన్నారు. సెప్టెంబర్ నెలలో ఓవర్ బర్డెన్ డిపార్ట్ మెంటల్‌గా 14 లక్షల క్యూబిక్ మీటర్లకు లక్ష్యానికి గాను 64శాతంతో 8 లక్షల 98 వేల క్యూబిక్ మీటర్లు తీయటం జరిగిందన్నారు. ప్రోగ్రెస్సివ్‌గా 81 లక్షల క్యూబిక్ మీటర్ల లక్ష్యానికి గాను 66 లక్షల 60 వేల క్యూబిక్ మీటర్లు అనగా 82 శాతం ఓబి వెలికి తీశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జిఎం వీసం కృష్ణయ్య, ఏజిఎం (సివిల్) వెంకటేశ్వర్లు, డిజిఎం (ఐఈడి) కే.వెంకట్ రావు ఏజెంట్ కేపియాజి వీరభద్ర రావు డిజిఎం (పర్సనల్) ఎస్.రమేశ్, డివై.ఎఫ్ఎం రమేశ్, పర్యావరణ అధికారి జే.శ్రీనివాస్, సీనియర్ పర్సనల్ అధికారి సింగు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

115 శాతం ఉత్పత్తి సాధించిన ఏరియా

- అనుకున్న సమయానికి వినియోగ దారులకు రవాణా
- విలేకర్ల సమావేశంలో జీఎం షాలేం రాజు

నవతెలంగాణ-కొత్తగూడెం



కొత్తగూడెం ఏరియా 2023-24 ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్ నెలకు కొత్తగూడెం ఏరియాకు నిర్దేశించబడిన 9.39లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి గాను, 10.83లక్షల టన్నులు ఉత్పత్తి చేసి 115 శాతం ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించడం జరిగిందని, 2023-24 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుండి సెప్టెంబర్ వరకు 59.31 లక్షల టన్నులకు గాను, 67.61 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసి 114 శాతం ఉత్పత్తి లక్ష్యం సాదించామని కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.షాలేం రాజు తెలిపారు. శనివారం జిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏరియాకు నిర్దేశించిన లక్ష్యంలో భాగంగా బొగ్గు ఉత్పత్తి చేసిన కార్మికులకు, ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. ఇదే స్పూర్తి కొనసాగించాలని కోరారు. ఉత్పతి చేసిన బొగ్గును వినియోగ దారులకు సకాలంలో సరఫరా చేసినట్లు చెప్పారు. రోడ్డు, రైల్ ద్వారా 12.45 లక్షల టన్నుల బొగ్గు రవాణా జరిగిందన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుండి సెప్టెంబర్ వరకు 77.06 లక్షల టన్నుల బొగ్గు రవాణా జరిగిందన్నారు. కొత్తగూడెం ఏరియా ఇప్పటి వరకు 526 వారసులకు కారుణ్య నియామకాల క్రింద ఉద్యోగ అవకాశాలు కల్పించటం కల్పించామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశానుసారం రూ.10 లక్షల వరకు ఇంటి రుణంపై వడ్డీని కొత్తగూడెం ఏరియా 373 దరఖాస్తులకు గాను 352 మంది మంజూరు పత్రాలు అందచేశామని, మిగిలిన 21 సరైన పత్రాలు సమర్పించినచో మంజూరు పత్రాలు అందచేస్తామని తెలిపారు. సమావేశంలో ఎస్ఓటు జిఎం జి.వి.కోటి రెడ్డి, ఏజిఎం (ఈఅండ్ఎం) దుర్గా ప్రసాద్, ఏజిఎం (సివిల్) సిహెచ్.రామకృష్ణ, ఏజిఎం (ఫైనాన్స్) కె.హాన సుమలత, ఏజెంట్ పివికే-5 ఇంక్లైన్ బి. రవీందర్, పర్సనల్ మేనేజర్ బి.శివ కేశవరావు, డిజిఎం (ఐఈడి) ఎస్.యోహన్, సీనియర్ ఎస్టేట్ ఆఫీసర్ బి.తౌర్య, సింగరేణి సేవ సమితి కో-ఆర్డినేటర్ సాగర్, పర్సనల్ డిపార్ట్మెంట్ సిబ్బంధి పాల్గొన్నారు.

ఇది రాముడి ప్రకోపమే...!

- భద్రాచలం శాసనసభ్యులు

నవతెలంగాణ-భద్రాచలం



మంత్రి కేటీఆర్ భద్రాచలం పర్యటన రద్దు శ్రీరామచంద్రుడి ప్రకోపమేనని, ఇచ్చిన హామీలు నెరవేర్చక పోవటమే అలా జరిగిందని భద్రాచలం శాసనసభ్యులు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పొదెం వీరయ్య ఒక ప్రకటనలో వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆశలు పెట్టుకున్న మంత్రి కేటీఆర్ పర్యటనపై భద్రాచల శ్రీ సీతారామచంద్రస్వామి భారీవర్షం రూపంలో నీళ్ల కుమ్మరించారని పేర్కొన్నారు. భద్రాద్రి రామునికి ఇస్తానన్న 100 కోట్ల రూపాయల నిధులు ఇప్పటికైనా కేటాయించాలని, శ్రీరామచంద్రుడికి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని సూచించారు. అలాగే గత సంవత్సరం వరదలు వచ్చినప్పుడు భద్రాచలంలో పర్యటించిన కెసిఆర్ రూ.1000 కోట్లు కేటాయించి భద్రాద్రి డివిజన్ ప్రజలను వరదల నుండి శాశ్వతంగా కాపాడతానని హామీలు ఇచ్చారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. ఇప్పుడేదో రూ.35 కోట్లతో శంకుస్థాపనలు చేసి మళ్లీ మా ప్రభుత్వం వచ్చిన తర్వాత పనులు చేస్తామని చెప్పట్టం సిగ్గుచేటని ఇకనైనా గతంలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరారు. కనీసం మీ పర్యటనలో శ్రీ సీతారామచంద్రస్వామి వారి దర్శనానికి సమయం కూడా లేకపోవడం మీకు భద్రాచలం పట్ల శ్రీ సీతారామచంద్ర స్వామి పట్ల ఉన్న గౌరవాన్ని తెలియజేస్తుందని వెల్లడించారు. మీ మోసాలు ప్రజలందరూ తెలుసుకున్నారని ముందున్న ఎన్నికల్లో మీకు సరైన బుద్ధి చెప్తారని ఏద్దేవా చేసారు. భారీ వర్షం కారణంగా ప్రమాదానికి గురై మహిళ కానిస్టేబుల్ మృతి చెందడం చాలా బాధాకరమని, భద్రాచల ప్రజల ఓట్లు దండుకునేందుకు శంకుస్థాపనల పేరుతో మీరు ఆడిన డ్రామాలో మహిళా ఉద్యోగి మృతి చెందటం మీ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం అని, ఆమె కుటుంబానికి ఉద్యోగంతో పాటు, ఎక్స్‌గ్రేషియా ప్రకటించి ఆదుకోవాలని ఎమ్మెల్యే వీరయ్య డిమాండ్ చేశారు.

ప్రజా సమస్యలపై నాయకులకు పట్టింపేది

- ప్రభుత్వ ఆసుపత్రిలో సిరంజీలు కరువు
- వ్యవసాయ కార్మిక సంఘం

నవతెలంగాణ-చర్ల



సీజనల్ వ్యాధులతో ఒకపక్క ప్రజలు అతలాకుతలమవుతూ ఉంటే నిరుపేద ప్రజల పై ప్రజాప్రతినిధులకు, పార్టీ నాయకులకు పట్టింపేదని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బందల చంటి ప్రశ్నించారు. మండల కేంద్రంలో గల ప్రభుత్వ వైద్యశాలలో ఎంబిబిఎస్ డాక్టర్లను నియమించాలని సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఐదవ రోజు జరుగుతున్న రిలే నిరేహార దీక్షలకు ఆయన సంఘీభావం తెలిపి దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంటి మాట్లాడుతూ మండల కేంద్రంలో గవర్నమెంట్ ఆసుపత్రిలో డాక్టర్లను తక్షణమే నియమించాలని అదేవిధంగా ఐదో రోజులుగా దీక్ష జరుగుతున్నప్పటికీ ప్రభుత్వ అధికారులు కాని, స్థానిక ఎమ్మెల్యే, స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. కనీసం ఇంజక్షన్ చేసే సిరంజీలు కూడా లేకపోవడం బీఆర్ఎస్ ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనం అన్నారు. దీక్షలో పాల్గొన్నటువంటి నాయకులు వచ్చా రామారావు, బాలాజీ సింగ్, సతీష్, కుమారి, మడకం సీతయ్య, ఎడమయ్య తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం | అక్టోబర్ 01, 2023 | www.navatelangana.com

ఐటీఐలో 5వ విడత స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానం



నవతెలంగాణ-మణుగూరు

మణుగూరు ప్రభుత్వ ఐటీఐలో 5వ విడత స్పాట్ అడ్మిషన్ల కోసం దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ బడుగు ప్రభాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మణుగూరు ప్రభుత్వ ఐటిఐలోని అన్ని ట్రేడ్ లలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ఆన్లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 1వ తేదీ నుంచి 8వ తేదీ వరకు ఆన్ లైన్ దరఖాస్తు చేసుకొని నేరుగా దరఖాస్తు ఫారంతో పాటు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈ నెల 9వ తేదీన ఐటీఐకి వచ్చి సీటు పొందవచ్చును అన్నారు. ఈ అవకాశాన్ని స్థానిక విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మున్సిపాలిటీ అభివృద్ధిపై అధికారులతో చర్చలు

- విప్ రేగా కాంతారావు



నవతెలంగాణ-మణుగూరు

మణుగూరు మున్సిపాలిటీ అభివృద్ధిపై అధికారులతో చర్చించినట్లు విప్, ఎమ్మెల్యే రేగా కాంతారావు తెలిపారు. శనివారం మండలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మణుగూరు మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వరరావుతో ప్రత్యేకంగా సమావేశమైనారు. మణుగూరు మున్సిపాలిటీలో చేపట్టబోయే అభివృద్ధి పనుల గురించి సుదీర్ఘంగా చర్చించారు. మున్సిపాలిటీ రూపురేఖలు మారనున్నాయని, ప్రతి వార్డులోని అంతర్గత రోడ్లు, డ్రైనేజీలు వంటి నిర్మాణంతో అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఈఈ తిరుమలేష్, ఇంట్రా డీఈ శ్రీనివాస్ రావు, ఏఈ సత్యనారాయణ, వర్క్ ఇన్స్పెక్టర్ కోటేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం), సీఐటీయూ నాయకులంటే భయమెందుకు..?

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కనకయ్య
- అరెస్టుకు నిరసనగా భారీ ర్యాలీ, ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం





నవతెలంగాణ-కొత్తగూడెం

పలు అభివృద్ధి కార్యక్రమాల పేరుతో ఎన్నికల డ్రామాలో భాగంగా తెలంగాణ రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు కేటీఆర్ భద్రాచలం వస్తున్న నేపథ్యంలో ఉదయం నుండే సీపీఐ(ఎం), సీఐటీయూ నాయకులను అక్రమంగా, అన్యాయంగా సీపీఐ(ఎం) పార్టీ ఆఫీస్‌పై దాడి చేసి, ఇండ్లలో చొరబడి నాయకులను అరెస్టు చేయడం సిగ్గుచేటని జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య అన్నారు. సీపీఐ(ఎం), సీఐటీయూ నాయకులను ఉగ్రవాదులవలే చిత్రీకరించి ఎంబి.నర్సారెడ్డి, జీలకర్ర పద్మ, గడ్డం స్వామి, దొడ్డ రవిల ఫోన్లను ట్రేస్ అవుట్ చేసి మరీ వెంటాడి వెంటాడి అక్రమంగా అరెస్టు చేసి దుమ్ముగూడెం, పాల్వంచ పోలీస్ స్టేషన్‌కి తరలించడం ప్రజాస్వామ్య వాదులందరూ ఖండించాలన్నారు. భద్రాచలం అభివృద్ధిపై నిరంతరం ప్రశ్నిస్తున్న సీపీఐ(ఎం) ప్రజా సంఘాలపై ఉక్కు పాదం మోపడం సరైనది కాదన్నారు. పార్టీ ప్రజా సంఘాలు భద్రాచల అభివృద్ధి కోసం దశల వారి ఆందోళన పోరాటాలు చేస్తున్న క్రమంలో ప్రభుత్వం ఎందుకు భయపడుతుందని ఆయన ప్రశ్నించారు. సీపీఐ(ఎం) అడుగుతున్న ప్రశ్నలపై కేటీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సమాధానం చెప్పకుండా ఎన్నికల జిమ్మిక్కులు చేసి ప్రజలు మోసం చేస్తే తగిన మూల్యం చెల్లించక తప్పదని కనకయ్య హెచ్చరించారు. అక్రమంగా అరెస్టు చేసిన నాయకులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

కొత్తగూడెం : భద్రాచలం పర్యటనకు శనివారం వస్తున్న మంత్రి కేటీఆర్ దృష్టికి ఇప్పటికే సమ్మెలో ఉన్న అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం కార్మికులు కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లను తీసుకువెళ్లేందుకు సిద్ధమైన తరుణంలో తెల్లవారు ఝాము నుండి భద్రాచలంలో సిఐటీయూ కార్యాలయంలో ఉన్న జిల్లా అంగన్వాడీ యూనియన్ ప్రధాన కార్యదర్శి జిలకర పద్మ, జిల్లా ఉపాధ్యక్షులు యం.బి.నర్సారెడ్డి, దొడ్డ రవి కుమార్ ఇళ్లకి వచ్చి అక్రమ అరెస్టలను చేశారని, ఈ అక్రమ అరెస్టులకు నిరసనగా జిల్లా వ్యాప్తంగా 23 మండలాల్లో సమ్మెలో ఉన్న కార్మికులు పెద్ద ఎత్తున మానవహారాలు, ప్రదర్శనలు, రాస్తా రోకోలు, ప్రభుత్వ దిష్టి బొమ్మలను దగ్ధం చేశారని, కార్మికులతో పెట్టుకుంటే నిప్పుకనికలై రగిలిపోతారని, అందుకు ఈ నిరసనలే నిదర్శనమని సిఐటియూ జిల్లా అధ్యక్షులు కొలగాని బ్రహ్మచారి, కార్యదర్శి ఏ.జె.రమేష్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం సమ్మెలో ఉన్న యూనియన్ నాయకులను చర్చలకు పిలిచి సమస్యలను పరిష్కరించాలని తెలిపారు.

బస్టాండ్ సెంటర్‌లో రాస్తారోకో

సిఐటియు నాయకులు అక్రమ అరెస్టులను ఖండిస్తూ శనివారం కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లో అంగన్వాడీలు సిఐటియు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. జాతీయ రహదారిపై చేరి నినాదాలు చేస్తు, రాస్తారోకో నిర్వహించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అంగన్వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని, సిఐటియూ నాయకుల అక్రమ అరెస్టులు ఖండిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పద్మ, కళావతి, శైలజా తదితరులు పాల్గొన్నారు.



భద్రాచలం

అక్రమ అరెస్టులను ఖండించండి : మచ్చా

భద్రాచలం : తెలంగాణ రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మాత్యులు, ఇతర శాఖల మంత్రులు భద్రాచల పట్టణ పర్యటనలో భాగంగా సీపీఐ(ఎం), సీఐటీయూ, సిపిఐ, కాంగ్రెస్, తెలుగుదేశం, సిపిఐ ఎంఎల్, ప్రజపంథా, ప్రజాసంఘాల నాయకులను జిల్లా పోలీస్ యంత్రాంగం అక్రమ అరెస్టులు చేసి దుమ్ముగూడెం పోలీస్ స్టేషన్‌కి తరలించడం దారుణమని సీపీఐ(ఎం) భద్రాచలం నియోజకవర్గం కన్వీనర్ మచ్చా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సీపీఐ(ఎం) తరపున నాయకుల అక్రమ అరెస్టులు ఖండిస్తున్నామని, ఇది పూర్తి అప్రజా స్వామికమని, ఇలా రాజకీయ పార్టీ నాయకులను అరెస్టులు చేయడం అనేది ఉద్యమ స్ఫూర్తా?అని కేసీఆర్‌ని ఆయన ప్రశ్నించారు. అదే విధంగా 9 సంవత్సరాలుగా భద్రాచల పట్టణానికి ఏనాడు రాని మంత్రి భద్రాచల పట్టణానికి ఎన్నికల వేళ వచ్చిన సందర్భంలో వినతిపత్రాలు ఇవ్వడానికి కూడా రాజకీయ పార్టీలకు అర్హత లేదా అని ప్రశ్నిస్తూ వెంటనే వీరిని విడుదల చేయాలని మచ్చా డిమాండ్ చేశారు.



పాల్వంచ

పాల్వంచ : కార్మిక సమస్యలు పరిష్కరించడానికి చేతకాక ప్రశ్నించే వాళ్లను అరెస్ట్ చేయడం సిగ్గుచేటని రైతు సంఘం జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ దుయ్యబట్టారు. జిల్లాలో కేటీఆర్ పర్యటన సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దొడ్డా రవికుమార్ అక్రమ అరెస్టుకు నిరసనగా పాల్వంచ పట్టణంలో అంగన్వాడీ, ఆషా కార్యకర్తలు భారీ ర్యాలీ చేసి ప్రభుత్వ దిష్టి బొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన వారికి సంఘీభావం తెలిపి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ జిల్లా అధ్యక్షులు రహీం, ఉపాధ్యక్షులు నిరంజన్, పట్టణ నాయకులు తులసిరామ్, ఐద్వా పట్టణ అధ్యక్షులు క్రాంతి సిఐటియు అంగన్వాడీ జిల్లా కోశాధికారి వెంకటరమణ, జిల్లా కమిటీ సభ్యులు అచ్చమ్మ, చుక్కమ్మ, మంజుల, ఉమ, కృష్ణ కుమారి సీఐటీయూ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



ఇల్లందు

ఇల్లందు : మంత్రి కేటీఆర్ వస్తున్నందున భద్రాచలం ఆఫీసులో ఉన్న అంగన్వాడీ సీఐటీయూ నాయకులను అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించడానికి నిరసనగా ఇల్లందులో మధ్యాహ్న భోజన కార్మికులు(సీఐటీయూ) ఎంఆర్‌ఓ, ఎంఈఓ ఆఫీసుల వద్ద గల సమ్మె శిబిరాలను ప్రదర్శనగా వచ్చి గోవింద్ సెంటర్ కూడలి వద్ద రాస్తా రోకో, మానవహారం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సభలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నబి, మధ్యాహ్న భోజన భోజన కార్మికయూనియన్ సిబటీయు జిల్లా కార్యదర్శి సుల్తానాలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు ఫాతిమా, దేవేంద్ర, నాగలక్ష్మి, వసంత, కారం పద్మ అరుణ, మధ్యాహ్న భోజన కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



దమ్మపేట

దమ్మపేట : పలు అభివృద్ధి పనుల్లో భాగాంగ జిల్లాలో మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా తెల్లవారుజామున నుండి సీఐటీయూ జిల్లా నాయకులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక మందలపల్లి క్రాస్ రోడ్లో మానవహారం నిర్వహించి, రాష్ట్ర ప్రభుత్వం దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ మాట్లాడుతూ సమస్యలు పరిష్కారించాలని అనేక రోజులుగా సమ్మె చేస్తున్న ఆశ, అంగన్వాడీ, మధ్యాహ్నం భోజనం కార్మికులు సమస్యలు పరిష్కారించకుండ కాలయపన చేస్తు జిల్లాకు కేటిఆర్ ఏమొహం పెట్టుకుని వస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సూరమ్మ, జ్యోతి, పద్మ, రాజ్యలక్ష్మి, శారదా, సునీత, శ్రీలత, ఈశ్వరమ్మ, సత్యవతి, జ్యోతి, సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు దొడ్డ లక్ష్మీనారాయణ, మండల కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



అశ్వారావుపేట

అశ్వారావుపేట : సీఐటీయూ జిల్లా నాయకులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీ, ఆశాలు, మధ్యాహ్నం భోజనం కార్మికులు స్థానిక మూడు రోడ్ల కూడలిలో మానవహారం నిర్వహించి, రాష్ట్ర ప్రభుత్వం దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో భారతి, సమత, నాగమణి, యామిని, పద్మ, నన్ని రాధ, నాగమణి, ప్రమీల, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



చర్ల

చర్ల : రాష్ట్ర ప్రభుత్వానికి వత్తాసు పలుకుతూ ప్రభుత్వం మెప్పు కోసమే జిల్లా పోలీసులు ముఖ్యంగా భద్రాచలం పట్టణ పోలీసులు సిఐటియు నాయకులు అక్రమ అరెస్టులు చేస్తున్నారని ఈ అరెస్టులను సీఐటీయూ మండల కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని మండల కన్వీనర్ పాయం రాధాకుమారి, మండల నాయకులు శ్యామల వెంకట్ తెలిపారు. అక్రమంగా అరెస్టు చేయాటాన్ని నిరశిస్తూ చర్లలో తెలంగాణ అంగన్వాడీటీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్, తెలంగాణ మధ్యాహ్న భోజనపథకం కార్మికుల యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో భారీ ర్యాలి నిర్వహించి, మానవహారం చేసి, ప్రభుత్వ దిష్టి బొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. మండల అంగన్వాడీ నాయకులు స్వరూప, సత్యవతి, కమల మనోహరి, చిలకమ్మ, భారతి, కృష్ణవేణి, భానుమతి, సుభద్ర, పుష్ప, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.



ములకలపల్లి

ములకలపల్లి : రాష్ట్ర ఐటీ, పురపాలకశాఖామంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా పోలీసులు అత్యుత్సాహంతో సీఐటీయూ జిల్లా నాయకులను అక్రమంగా జయ అరెస్టు చేయడం అన్యాయమని సీఐటీయూ మహిళా నాయకులు దుబ్బా ధనలక్ష్మి, బుగ్గా వెంకటనరసమ్మలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సీఐటీయూ నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడం. తగదని నిరసిస్తూ ములకలపల్లిలో రాస్తారోకో చేసి దిష్టిబొమ్మ దగ్ధం చేశారు.

అంగన్ వాడీ...ఆశా ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి



నవతెలంగాణ-కొత్తగూడెం

అంగన్ వాడీ, ఆశా వర్కర్స్‌ను వెంటనే ప్రభుత్వం పర్మినెంట్ చేయాలని టిపిసిసి జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సమ్మె దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తక్షణం అంగన్ వాడి ఉద్యోగులను పర్మినెంట్ చేయాలన్నారు. కనీస వేతనం రూ.26,000వేలు చెల్లించాలన్నారు. నియోజకవర్గ బి.బ్లాక్ డెలికేట్ రాయల శాంతయ్యా, కొత్తగూడెం పట్టణ అధ్యక్షులు బొమ్మిడి మల్లికార్జున్, కొత్తగూడెం పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు పల్లపు వెంకటేశ్వర్లు, లక్ష్మీదేవిపల్లి మండల బీసీ సెల్ నాయకులు పాంచాల నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్ సెంటర్‌లో రాస్తారోకో...పెద్ద ఎత్తున నినాదాలు

ఆశా వర్కర్ల ప్రధాన సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తు సిఐటియూ ఆధ్వర్యంలో ఆశాలు శనివారం కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. నిరసనలో భాగంగా పెద్ద ఎత్తున మానవ హారం చేశారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి డి.వీరన్న మాట్లాడారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఆశ వర్కర్ల ప్రధాన సమస్యలు పరిష్కరిస్తూ, వారి డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జయ,మనిలా, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందు : గత ఆరు రోజులుగా సమ్మె చేస్తున్న ఆశా వర్కర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆవునూరి మధు అన్నారు. ఇల్లందులోని మెయిన్ రోడ్ స్కూల్ దగ్గర సమ్మె చేస్తున్న ఆశా వర్కర్ల సమ్మెకు మద్దతు తెలిపారు. సమ్మెను ఉద్దేశించి వారు మాట్లాడారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి తుపాకుల నాగేశ్వరరావు, భారత కార్మిక సంఘాల సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కే.సారంగ పాణి, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కందగట్ల సురేందర్, రాష్ట్ర నాయకులు గౌని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆళ్ళపల్లి : మండల కేంద్రంలో ఆశా వర్కర్లు చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా శనివారం ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట మానవహారంగా నిల్చొని నిరసన కార్యక్రమం చేపట్టామని స్థానిక ఆశ వర్కర్ల మండల అధ్యక్షురాలు సడియం సుగుణ తెలిపారు. ఈ సమ్మెకు ప్రభుత్వ ఆసుపత్రి సూపర్వైజర్ రమేష్ సంఘం తరుపున పూర్తి మద్దతు, సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పూసం చంద్రకళ, పి.సీతాదేవి, వై.కృష్ణకుమారి, జోగ సుశీల, కె.అనసూర్య పి.సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

ములకలపల్లి : మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్ వద్ద భారీగా మానవ హారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశావర్కర్ల జిల్లా ప్రధాన కార్యదర్శి దుబ్బా ధనలక్ష్మి మాట్లాడుతూ ఆశావర్కర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కీసరి జయ, నల్లి సుజాత, ఇందిర, శైలజ, రోశమ్మ, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి : అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్ హెచ్చరించారు. శనివారం అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె శిబిరాలను ఆయన సందర్శించి, వారి సమ్మెకు సంఘీభావం, మద్దతు తెలిపారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన కార్మిక సంఘాల నాయకులు కడుదుల వీరన్న,ఈసం నర్సింహారావు, కొండపల్లి శకుంతల, కె.రాజేశ్వరి, పి.రాజేశ్వరి, ఐ.రాధ, వై.ఇందిర, వై.పద్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆళ్ళపల్లి మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం అంగన్వాడీ కార్యకర్తలు చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా 20వ రోజు ఆళ్ళపల్లిలో బిక్షాటన కార్యక్రమం చేపట్టడం జరిగిందని స్థానిక అంగన్వాడీ కార్యకర్తల మండల అధ్యక్షురాలు పూనెం సుజాత తెలిపారు. ఈ కార్యక్రమంలో కరకపల్లి మమత, కొమరం జయశ్రీ, బుచ్చమ్మ, మెస్సు రాజ్యలక్ష్మి, చందా సరిత, ఈసం లక్ష్మి కోరం మల్లుబాయి, తదితరులు పాల్గొన్నారు.ఔ

హెడ్ కానిస్టేబుల్ శ్రీదేవి మృతి పట్ల సీపీఐ(ఎం) సంతాపం



నవతెలంగాణ-భద్రాచలం

భద్రాచలం కేటీఆర్ పర్యటన సందర్భంగా జరిగినటువంటి దుర్ఘటనలో మరణించినటువంటి హెడ్ కానిస్టేబుల్ శ్రీదేవి మృతికి సీపీఐ(ఎం) సంతాపాన్ని తెలియజేసింది. భద్రాచలంలో శనివారం జరిగిన సమావేశంలో పార్టీ నేతలు మాట్లాడారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియ జేసింది. శ్రీదేవి విధి నిర్వహణలో భాగంగా కొత్తగూడెం పోలీస్ స్టేషన్ నుండి భద్రాచలం కేటీఆర్ పర్యటన సందర్భంగా బందోబస్తు కోసం రావడం జరిగిందని, గుడి ఏరియాలో వర్షం కారణంగా విపరీతమైనటువంటి వరద ప్రవాహంతో నాళాలో పడి చనిపోవడం జరిగిందని పార్టీ నేతలు పేర్కొన్నారు. చాలా బాధాకరమైన అంశం అన్నారు. ఈ ఘటన దీనికి ఉన్నటువంటి తీవ్రతను కూడా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అర్థం చేసుకోవాలని కోరుతున్నట్లు తెలిపారు. కేటీఆర్ పర్యటన సందర్భంగా ఈ ఘటన జరిగింది కాబట్టి కేటీఆర్ ఈ ఘటనకు నైతిక బాధ్యత వహించాలని కోరుతున్నామన్నారు. శ్రీదేవి కుటుంబాన్ని అన్ని విధాల ప్రభుత్వం ఆదుకోవాలని, డిపార్ట్మెంట్ పరంగా వచ్చినటువంటి రాయితీలు కాకుండా రూ.కోటి ఆ కుటుంబానికి ఇవ్వాలని కోరారు. అలాగే కొద్దిపాటి వర్షానికి ఇటువంటి దుర్ఘటనలు జరుగుతున్నాయి అని అంటే భద్రాచలం దుస్థితి ఎలాగ ఉందో తెలంగాణ ప్రభుత్వానికి ఇప్పటికైనా కనువిప్పు కావాలన్నారు. కొద్దిపాటి వర్షానికి నాళాలు ప్రవహించి స్లూయిజులు లీకులు అవుతున్నటువంటి ప్రాంతంలో వచ్చే వరద వల్ల భద్రాచలం జలమయం అవుతుందన్నారు. గత సంవత్సరం కేసీఆర్ భద్రాచలం వచ్చి వరదల దుస్థితిని గమనించి, ప్రమాదాన్ని గుర్తించి ప్రజల కోరిక మేరకు వెయ్యి కోట్లు ఈ వరద నివారణ చర్యల్లో భాగంగా ఇస్తామని ప్రకటించారని, కాని 1000 పైసలు కూడా ఇవ్వలేదని అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఈ దుస్థితికి అర్థం పడుతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉన్నదనీ, ఇటువంటి విషయాలపైన కేటీఆర్ వచ్చి నిర్దిష్టమైన ప్రకటన చేస్తారని భద్రాచలం ప్రజానీకం ఆశించారని, ఈ దుర్ఘటన జరిగినటువంటి సందర్భాన్ని పురస్కరించుకొని, ఈ దుర్ఘటన జరిగినటువంటి విషయం కూడా ఒక సమాచారంగా ఉండి, ఆ ప్రోగ్రాంని కేటీఆర్ రద్దు చేసుకున్నారని అనుమానాలు కూడా సర్వత్ర ఉన్నాయని తెలిపారు. ఇప్పుడు శ్రీదేవి మరణం కూడా టెంపుల్ ఏరియాలోనే జరిగిందని, టెంపుల్ అభివృద్ధి కోసం మొట్టమొదటిసారిగా రూ.100 కోట్లు ఇస్తానని ముఖ్యమంత్రి ప్రకటించి వాటిని కూడా ఇవ్వనీ కారణంగా చుట్టూ ఉన్నటువంటి నాళాలు గాని చుట్టూ ఉన్నటువంటి లీకేజీల్ని అరికట్టే దాంట్లో కూడా ఈ ఆ డెవలప్మెంట్ ఫండ్స్ వచ్చి ఉంటే బాగుండేది అన్నారు. ఇప్పటికైన ఈ రెండిటి విషయాలని తెలంగాణ ప్రభుత్వం గుర్తించి నైతిక బాధ్యత వహించాలని డిమాండు చేశారు.

ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డి, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు బి.వెంకటరెడ్డి, బండారు శరత్ బాబు, వై.వెంకట రామారావు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో ఎక్సలెంట్ విద్యార్థులకు స్వర్ణ పథకాలు

నవతెలంగాణ-మణుగూరు

మణుగూరు స్టార్ ఎక్సలెంట్ పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయిలో స్వర్ణ పథకాలు సాధించారని శనివారం పాఠశాల యాజమాన్యం తెలిపింది. హైదరాబాదులోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియం యూసఫ్ గూడాలో సెప్టెంబర్ 24న సుమన్ ఫోటో కం కరాటే అకాడమీ ఆఫ్ ఇండియా సంస్థ వారు నిర్వహించిన 21వ జాతీయ కరాటే, కుంపు ఛాంపియన్ షిప్ 2023 కార్యక్రమంలో భాగంగా కొన్ని పోటీలను నిర్వహించినారు. అందులో విద్యార్థులు స్వర్ణ పథకాలను దక్కించుకున్నారు. జూనియర్ విభాగంలో ఎస్‌శ్రేయస్వి ఇండివిడ్యువల్ కట్టలు పోటీలలో పాల్గొని ప్రథమ స్థానం దక్కించుకున్నది. అలాగే ఎస్ సాయి సిద్ధార్థ సబ్ జూనియర్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచాడు. వీరిద్దరికి స్వర్ణ పథకాలను అందించి అభినందించారు. జాతీయస్థాయిలో ఇంతటి విజయాన్ని సాధించిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం చైర్పర్సన్ యూసఫ్ షరీఫ్, కరస్పాండెంట్ ఖాదర్, డైరెక్టర్ యాకూబ్ షరీఫ్ అభినందించారు.

మణుగూరు ఏరియాలో పర్యటించిన డైరెక్టర్

మణుగూరు : మణుగూరు ఏరియాలో పర్యటించిన డైరెక్టర్ (ఈఎం) డి.సత్యనా రాయణ రావు శనివారం తమ అధికారిక పర్యటనలో భాగంగా ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామ చందర్, సంబంధిత అధికారులతో ఏరియా వర్క్ షాప్, ఏరియా హాస్పిటల్ పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా ముందుగా ఏరియా వర్క్ షాప్ లోనే యంత్రాల మరమ్మతు ప్రక్రియను పరిశీలించారు. అధిక ఉత్పత్తి సాధించడంలో మణుగూరు ఏరియాకు ఉన్న పేరును సుస్థిరం చేసుకోవాలంటూ పలు సూచనలు చెశారు. 2022 సంవత్సరంలో సింగరేణి వ్యాప్తంగా జరిగిన సేఫ్టీ వీక్ సందర్భంగా ఏరియా వర్క్ షాప్, మణుగూరు ఏరియాకు మొదటి బహుమతి వచ్చినందుకు అభినందనలు తెలిపారు.

సింగరేణి ఏరియా ఆసుపత్రి సందర్శన : డైరెక్టర్ (ఈఎం) డి.సత్యనారాయణ రావు ఏరియా జనరల్ మేనేజర్ శ్రీ దుర్గం రామచందర్‌తో కలిసి పివి కాలనీ సింగరేణి ఏరియా ఆసుపత్రిని సందర్శించారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ (ఈ అండ్ఎం) ఫిట్జ్ గెరాల్డ్ ఎసీ టు డైరెక్టర్ (ఈఎం) కేశవరావు, ఏరియా ఇంజనీర్ నర్సిరెడ్డి, ప్రాజెక్ట్ మేనేజర్ పీకే ఓసి రాంబాబు ప్రాజెక్టు ఇంజనీర్ రవీందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే కొమరారంను మండలంగా ఏర్పాటు చేస్తాం : సీతక్క



నవతెలంగాణ-ఇల్లందు

కొమరారం గ్రామాన్ని మండలంగా ప్రకటించాలని కోరుతూ 3 సంవత్సరాల నుండి చేస్తున్న ఉద్యమాన్ని కాంగ్రెస్ పార్టీ ములుగు ఎంఎల్ఏ ధనసరి సీతక్క సంపూర్ణ మద్దత్తు ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే నూతన మండలంగా ఇల్లందు నియోజకవర్గంలో కొమరారం, బోడ్‌ని నూతన మండలంగా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కొమరారం మండల సాధన ఉద్యమంకి మద్దతు ప్రకటించినందుకు కొమరారం మండల సాధన కమిటీ కన్వీనర్ మోతిలాల్ సీతక్కకి ప్రత్యేక ధన్యవాదములు తెలుపుతూ, కొమరారం మండల సాధన కమిటీ కన్వీనర్ మోతిలాల్ మాట్లాడుతూ ఎమ్మెల్యే హరిప్రియ గత 4 సంవత్సరాల నుండి కొమరారంని మండలంగా ఏర్పాటు చేస్తామని మభ్యపెడుతుందని, రాష్ట్రంలో అనేక నూతన మండలంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వం కొమరారం, బోడ్‌ని ఎందుకు ప్రకటించలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేసినారు.

జీఎంపీఎస్ నాయకుల అక్రమ అరెస్టులను ఖండించండి

- జీఎంపీఎస్ జిల్లా కమిటీ ఖండన

నవతెలంగాణ-కొత్తగూడెం

ఖమ్మం జిల్లాలో గొర్రెల మేకల పెంపకం దారులు రెండో విడతలో గొర్రెల కోసం డీడీలు కట్టి పది నెలలు గడుస్తున్నప్పటికీ గొర్రెలు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారని, సెప్టెంబర్ నెల 22 తేదీన రెండో విడత గొర్రెలు ఇవ్వమని, 12 నెలలు కడుతున్నా కూడా పట్టించుకోవడంలేదని, డీడీ కట్టిన వాళ్లందరికీ గొర్రెలు ఇవ్వాలని కలెక్టర్‌ను కలిసినందుకు ఖమ్మం జిల్లా జీఎంపీఎస్ అధ్యక్ష, కార్యదర్శులు చింతలచెరువు కోటేశ్వరరావు, తూలి శాల లింగయ్య ఇంకా పదిమంది గొర్రెల మేకల పెంపకం దారుల నాయకులపై అక్రమంగా కేసులు పెట్టారని, వాటిని వెంటనే ఎత్తి వేయాలని జిల్లా గొర్రెల పెంపకం దారులు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బచ్చలకూరి శ్రీను, గొర్రెల మేకల పెంపకం దారుల జిల్లా నాయకులు మల్లెబోయిన లింగయ్య, సారయ్య, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం కమిటీ తీవ్రంగా ఖండించింది. శనివారం ప్రకటన విడుదల చేశారు.

2266 మంది బదిలీ వర్కర్లకు జనరల్ మజ్దూర్లుగా క్రమబద్ధీకరణ

ఉత్తర్వులు జారీ చేసిన డైరెక్టర్ (పర్సనల్, ఫైనాన్స్) ఎన్.బలరామ్

నవతెలంగాణ-కొత్తగూడెం

సింగరేణి సంస్థలో బదిలీ వర్కర్లుగా పనిచేస్తున్న 2266 మందికి సంస్థ తీపి కబురు అందించింది. ఏడాదిలో భూ గర్భ గనుల్లో కనీసం 190 రోజులు పనిచేసిన వారికి, ఉపరితల గనులు, విభాగాల్లో కనీసం 240 రోజులు పనిచేసి బదిలీ వర్కర్లను జనరల్ మజ్దూర్లుగా గుర్తిస్తూ యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు శనివారం సంస్థ ఛైర్మన్ అండ్ ఎండీ ఎన్.శ్రీధర్ ఆదేశాల మేరకు డైరెక్టర్ (పర్సనల్,ఫైనాన్స్) ఎన్.బలరామ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఏడాది సెప్టెంబరు 1 తేదీ నుంచి వీరందరినీ జనరల్ మజ్దూర్లుగా గుర్తిస్తున్నట్లు ఆదేశాలిచ్చారు. దీనిపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. గతంలో బదిలీ వర్కర్లుగా ఉద్యోగంలో చేరిన కార్మికులు జనరల్ మజ్దూర్లుగా గుర్తింపు రావడానికి కనీస మస్టర్లు ఉన్నప్పటికీ ఏళ్ల తరబడి నిరీక్షించాల్సి వచ్చేది. కాగా, రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు 2017 నుంచి ఎప్పటికప్పుడు జనరల్ మజ్దూర్లుగా క్రమబద్ధీకరిస్తూ వస్తోంది. తొలిసారిగా 2017 అక్టోబరులో ఒకే దఫా 2718 మంది బదిలీ వర్కర్లను జనరల్ మజ్దూర్లుగా గుర్తించింది. అనంతరం ప్రతీ ఏడాది కనీస మస్టర్లు పూర్తి చేసిన వారందరినీ జనరల్ మజ్దూర్లుగా గుర్తిస్తూ రెగ్యులరైజ్ చేస్తోంది. కాగా, 31 డిసెంబరు 2022కు ముందు సంస్థలో బదిలీ వర్కర్లుగా చేరిన వారిలో కనీసం 190/240మస్టర్ల అర్హత కలిగిన వారందరికీ ఇప్పుడు జనరల్ మజ్దూర్లుగా క్రమబద్ధీకరించింది. దీంతో 2017నుంచి ఇప్పటి వరకు జనరల్ మజ్దూర్లుగా రెగ్యులరైజ్ అయిన వారి సంఖ్య 13,981కి చేరింది.

అనంతరం డైరెక్టర్(పర్సనల్, ఫైనాన్స్)ఎస్.బలరామ్ మాట్లాడుతూ సింగరేణిలో ఉద్యోగం రావడం ఒక వరంగా భావించాలని, ఆ విధంగా క్రమశిక్షణతో విధులకు హాజరవుతూ కనీస మస్టర్లు సాధించిన అందరినీ జనరల్ మజ్దూర్లుగా గుర్తించడం జరిగిందని, వారందరికీ అభినందనలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. మొత్తం 2266 మంది జనరల్ మజ్దూర్లుగా గుర్తింపబడగా.. వీరిలో శ్రీరాంపూర్ ఏరియాలో 677 మంది, ఆర్జీ-1 ఏరియా నుంచి 522 మంది, ఆర్జీ-3, అడ్రియాల ప్రాజెక్టు నుంచి 323, భూపాలపల్లి నుంచి 274 మంది, మందమర్రి నుంచి 261 మంది, మణుగూరు నుంచి 79 మంది, రామగుండం -2 నుంచి 51 మంది, బెల్లంపల్లి ఏరియా నుంచి 32 మంది, ఇల్లందు, కార్పోరేట్ నుంచి 19 మంది చొప్పున ఎంపిక కాగా.. కొత్తగూడెం నుంచి 9 మంది రెగ్యులరైజ్ అయ్యారని తెలిపారు.

విద్యుద్ఘాతంతో యువకుడు మృతి

నవతెలంగాణ-టేకులపల్లి

మండలంలోని రాంపురం గ్రామపంచాయతీ పరిధిలో గల పాత తండాలో విద్యుత్ శాఖతో యువకుడు మృతి చెందిన సంఘటన శనివారం జరిగింది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం రాంపురం పంచాయతీ పాతతండకు చెందిన గుగులోత్ హథిరాం (30) స్నానం చేసి బట్టలు ఆరవేస్తుండగా ఇంట్లో ఉన్న దండంకు విద్యుత్ సరఫరా కావడంతో, వెంటనే కొత్తగూడెం వైద్యశాలకు తరలించగా మార్గమధ్యలో మృతి చెందినట్లు రోధిస్తూ తెలిపారు. మృతుని భార్య రాంపురం పంచాయతీ వార్డు సభ్యురాలు మమత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతునికి భార్యతోపాటు ఇద్దరు పిల్లలు కలరు..

లచ్చగూడెం రేషన్ షాప్ సీజ్

టేకులపల్లి : టేకులపల్లి మండలంలోని లచ్చగూడెం గ్రామంలో నెంబర్ 3019011 రేషన్ షాప్ నుసీజ్ చేసినట్లు ఇల్లందు సివిల్ డిప్యూటీ తహసీల్దార్ శనివారం తెలిపారు. రేషన్ షాపులో తనిఖీ చేయగా ఉండవలసిన బియ్యం కంటే 31 క్వింటాల్ బియ్యం తక్కువగా ఉన్నందున షాప్ సీజ్ చేసి, డీలర్ పై 6 ఎ కేస్ నమోదు చేసినట్లు తెలిపారు.

చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా ర్యాలీ

నవతెలంగాణ-దమ్మపేట

మాజీ సీఎం చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా దమ్మపేట మండల కేంద్రంలో టిడిపి నాయకుడు నారా లోకేష్ పిలుపుమేరకు రోడ్ల మీదకు వచ్చి ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పారుపల్లి భద్రం, గడ్డిపాటి సత్యనారాయణ, అల్లాడ అప్పారావు, పెనికలపట్టి కృష్ణయ్య, హరి చౌదరి, భోగి సత్యంమరియు టిడిపి నాయకుల పాల్గొన్నారు

9

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం | అక్టోబర్ 01, 2023 | www.navatelangana.com

రేచర్ల మోక్షిత్‌ను ఆశీర్వదించిన వైస్ చైర్మన్

నవతెలంగాణ-వైరాటౌన్

మున్సిపాలిటీ పరిధిలోని వాసవి కళ్యాణ మండపం నందు రేచర్ల శ్రీకాంత్, లక్ష్మీ మౌలిక దంపతుల కుమారుడు రేచర్ల మోక్షిత్ ప్రథమ జన్మదినోత్సవం సందర్భంగా మున్సిపాలిటీ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ముళ్లపాటి రంగారావు, పిఆర్ టియు మండల అధ్యక్షులు వెలిశెట్టి నరసింహారావు, పోలా శ్రీనివాసరావు ఓర్సు శ్రీనివాసరావు, పిఆర్ టియు మండల ప్రధాన కార్యదర్శి వేమిరెడ్డి గోవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే అక్రమ అరెస్టులు

బీఆర్ఎస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి సంభాని ఆగ్రహం

నవతెలంగాణ-కల్లూరు

జిల్లాలో మంత్రి కల్వకుంట్ల తారక రామారావు పర్యటన ఉన్న నేపథ్యంలో సత్తుపల్లి నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులను, కార్యకర్తలను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించడాన్ని ఖండిస్తూ మాజీమంత్రి, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు సంభాని చంద్రశేఖర్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శనివారం మాట్లాడుతూ అధికార పార్టీ పదేళ్ల పాలనాకాలంలో గత రెండు పర్యాయాలు ప్రజలకి ఇచ్చిన హామీలను అమలుపర్చలేదని ఆరోపించారు. రైతులు, మహిళలు, ఉద్యోగులు, నిరుద్యోగులు, దళితులు, ప్రజలు ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని అదేవిధంగా నీళ్ళు, నిధులు, నియామకాలు పేరుతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం నేడు కల్వకుంట్ల కుటుంబం వల్ల అప్పులకుప్పగా మారిందన్నారు. అక్రమ హౌస్‌అరెస్ట్ లు ఎందుకు అని ప్రశ్నించారు. తక్షణమే కాంగ్రెస్ నాయకులను, కార్యకర్తలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



అక్రమ అరెస్టులను నిరసిస్తూ రాస్తారోకో

నవతెలంగాణ-తల్లాడ

రాష్ట్ర మంత్రి కేటీఆర్ జిల్లా పర్యటనను పురస్కరించుకొని ప్రతిపక్షాలను ముందస్తు అరెస్టులను నిరసిస్తూ సీపీఐ(ఎం), సీపీఐ(ఎంఎల్) ప్రజా పంథా ఆధ్వర్యంలో శనివారం తల్లాడలో రాస్తారోకో నిర్వహించారు. అక్రమంగా అరెస్టు చేయడాన్ని ప్రజాస్వామ్యవాదులందరూ ఖండించాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వరరావు, సిపిఐ ఎంఎల్ ప్రజాపందా జిల్లా కార్యవర్గ సభ్యులు షేక్ లాల్మియా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పులి వెంకట నరసయ్య చల్ల నాగేశ్వరరావు, షేక్, మస్తాన్ కృష్ణయ్య, రాఘవులు, సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా మండల కార్యదర్శి కొండే వెంకటేశ్వర్లు, డి శ్రీనివాసరావు, బాలు, తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ పర్యటనను పురస్కరించుకొని కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్ట్

తల్లాడ మండల కాంగ్రెస్ నాయకులు కాపా సుధాకర్, కటికి కిరణ్ కుమార్, దగ్గుల నాగిరెడ్డి, షేక్ జమాల్ తదితరులను తల్లాడ పోలీసులు శనివారం ఉదయం ముందస్తు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్ మాట్లాడుతూ కెసిఆర్ పాలన ఎమర్జెన్సీని తలపిస్తుందన్నారు. కేటీఆర్ పర్యటన సందర్భంగా ప్రతిపక్షాల నాయకులను అరెస్ట్ చేయడం ఎంతవరకు సబబు అన్నారు. అక్రమ అరెస్టులను ప్రజాస్వామ్య వాదులు అందరూ ఖండించాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో కెసిఆర్ కు తగిన గుణపాఠం చెప్పాలన్నారు.

కేటీఆర్ సభకు కదిలిన బీఆర్ఎస్ శ్రేణులు

నవతెలంగాణ-వేంసూరు

సత్తుపల్లిలో కేటీఆర్ సభకు మండలం నుండి బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. బిఆర్ఎస్ మండల పార్టీ ఉపాధ్యక్షులు గుత్తా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భారీగా ద్విచక్ర వాహనాలు, ఆటోలో ర్యాలీగా తరలి వెళ్లారు.

ఎల్ఐసీ జోనల్ ఆఫీస్ ముందు

ధర్నాను జయప్రదం చేయండి

ఎల్ఐసీ ఎఒఐ డివిజన్ అధ్యక్షులు తాళ్లూరి శ్రీనివాసరావు.

నవతెలంగాణ-వైరాటౌన్



ఎల్ఐసీ ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (సీఐటియు అనుబంధం) ఆధ్వర్యంలో అక్టోబర్ 9న హైదరాబాదులోని ఎల్ఐసి జోనల్ ఆఫీస్ ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఎల్ఐసి ఎఒఐ వరంగల్ డివిజన్ అధ్యక్షులు తాళ్లూరి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శనివారం ఏజెంట్ల ధర్నాకు సంబంధించిన పోస్టర్లను ఇల్లందు, కొత్తగూడెం, సత్తుపల్లి, కల్లూరు, మధిర ఎల్ఐసి కార్యాలయాల వద్ద చలో జోనల్ ఆఫీస్ పోస్టులను అతికించి విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా తాళ్లూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎల్ఐసిని కాపాడటానికి, ఏజెంట్లను రక్షించడానికి అక్టోబర్ 9న ఎల్ఐసి జోనల్ ఆఫీస్ వద్ద జరిగే ధర్నాలో ఎల్ఐసి ఏజెంట్లు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసి ఎఒఐ ఖమ్మం బ్రాంచ్ సెక్రటరీ బొడ్డు శ్రీనివాసరావు, ఖమ్మం బ్రాంచ్ ఉపాధ్యక్షులు పగిడిపత్తి లక్ష్మయ్య, మధిర బ్రాంచ్ బాధ్యులు గుడిమెట్ల మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ కుటుంబానికి

ఈటల రాజేందర్ ఆర్థిక సాయం

నవతెలంగాణ - బోనకల్

మండల పరిధిలోని జానకిపురం మాజీ సర్పంచ్ యన్నేబోయిన నరసింహారావు ఇటీవల గుండుపోటుతో మరణించారు. ముదిరాజ్ జిల్లా కమిటీ సభ్యులు శనివారం నరసింహారావు కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించారు. మాజీ ఆర్థిక శాఖ మంత్రి ఈటెల రాజేందర్ పంపిన రూ.20వేలను వారి కుటుంబ సభ్యులకు ప్రముఖ డాక్టర్ శీలం పాపారావు ముదిరాజ్ ఆధ్వర్యంలో జిల్లా కమిటీ సభ్యులు శనివారం అందజేశారు. ఎన్నబోయిన నరసింహారావు కుటుంబ సభ్యులకు అండగా నిలిచి ఆర్థిక సహాయం చేసిన ఈటెల రాజేందర్ కు కుటుంబ సభ్యులు ముదిరాజ్ మండల కమిటీ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పతానపు వెంకటేశ్వర్లు, కొప్పెర వెంకట నరసయ్య, కొప్పెర జానకి రామయ్య, ముదిరాజ్ మండల కమిటీ అధ్యక్షుడు గణపారపు వెంకటేశ్వర్లు, కార్యదర్శి రెడ్డి బోయిన ఉద్దండు, నాయకులు పిట్టల నాగేశ్వరరావు, గోగుల కృష్ణయ్య, యన్నేబోయిన నారాయణ, గోగుల తిరుపతిరావు, సైదులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు రాష్ట్రస్థాయిలో రాణించాలి

నవతెలంగాణ-జూలూరుపాడు



విద్యార్థులు రాష్ట్రస్థాయిలో రాణించాలని జూలూరుపాడు జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు లక్ష్మి నరసయ్య అన్నారు. జూలూరుపాడు జెడ్పీ హైస్కూల్ లో జోనల్ ఆట పోటీలను ప్రధానోపాధ్యాయులు లక్ష్మి నరసయ్య ప్రారంభించి విద్యార్థులతో కలిసి సరదాగా ఆటలు ఆడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ విద్యార్థులకు ఆటల వల్ల ఎంతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. శారీరకంగా ధఢంగా ఉంటారని అన్నారు. క్రీడల్లో యువత రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎస్సై

నవతెలంగాణ-జూలూరుపాడు

మండలంలోని కాకర్ల గ్రామంలో ఎస్సీ కాలనీలో శనివారం కాలనీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎస్ఐ బట్టు పురుషోత్తం ప్రారంభించారు. వినాయక మండపాలలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇడుపుల నరసింహారావు, ఇడుపుల సాంబశివరావు, ఇడుపుల సుందరయ్య పాల్గొన్నారు.

చెరువును తలపిస్తున్న పాఠశాల ఆవరణ

నవతెలంగాణ-చంద్రుగొండ



మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణం చెరువును తలపిస్తోంది. చిన్నపాటి వర్షానికి ఇలా వర్షపు నీరు నిల్వ ఉండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే సంబంధిత విద్యాశాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు ఈ సమస్యను పరిష్కరించాలని ఏజెన్సీ దళిత సేవా సంఘం చంద్రుగొండ మండల అధ్యక్షుడు కొండ్రు నాగరాజు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేసారు. నీరు నిల్వ ఉంటే సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని వాపోయారు.

భట్టికి వినతి

మధిర : వైద్య ఆరోగ్య శాఖ మానవ వనరుల హేతుబద్దీకరణ జీవో 142 రద్దు చేసేలా చర్య తీసుకోవాలని పోరాట కమిటీ సభ్యులు ఎమ్మెల్యే భట్టి విక్రమార్కకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో భాస్కరరావు, లంక కొండయ్య, ఆర్‌వి సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

కేటీఆర్ గో బ్యాక్



అరెస్టు అయిన సీపీఐ(ఎం) జిల్లా నాయకులు ఎంబి నర్సిరెడ్డి, పద్మ



దుమ్ముగూడెంలో భారీ ప్రదర్శన

ముందస్తు అక్రమ అరెస్టులతో కార్మిక ఉద్యమాలు ఆపలేరు

యలమంచి రవికుమార్, కారం పుల్లయ్య

నవతెలంగాణ-దుమ్ముగూడెం

రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ గో బ్యాక్ అంటూ అంగన్వాడీలు, ఆశా కార్యకర్తలు, మధ్యాహ్న భోజన కార్మికులు నినాదాలు చేస్తూ శనివారం భారీ ప్రదర్శన నిర్వహించారు. వందలాదిమంది కార్మికులతో లక్ష్మీ నగరం నుండి ప్రారంభమైన ప్రదర్శన పోలీస్ స్టేషన్ వరకు నిర్వహించి బైఠాయించారు. అక్రమంగా అరెస్టు చేసిన నాయకులను బేషరతుగా విడుదల చేయాలని నినదించారు. ధర్నాను ఉద్దేశించి ఏఐకేఎస్ రాష్ట్ర నాయకులు యలమంచి రవికుమార్, ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కారం పుల్లయ్య మాట్లాడుతూ... అక్రమ అరెస్టులతో కార్మిక ఉద్యమాలు ఆపలేరని అరెస్టు చేసిన ప్రజా ఉద్యమ నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మంత్రి కేటీఆర్ భద్రాచలం పర్యటన సందర్భంగా అంగన్వాడీ టీచర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జి పద్మ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎంబి నర్సారెడ్డి లను తెల్లవారుజామున భద్రాచలంలో అరెస్టు చేసి దుమ్ముగూడెం పోలీస్ స్టేషన్ కి తరలించారని అన్నారు. రాష్ట్ర మంత్రి కేటీఆర్ కార్మిక, ప్రజా సమస్యలు పరిష్కరించాకనే భద్రాచలం రావాలని అన్నారు. కార్మిక నాయకులను పోలీసులు ఇంట్లోకి వెళ్లి అక్రమంగా అరెస్టులు చేయటం దుర్మార్గమైన చర్యని అన్నారు. భద్రాచరానికి ఇచ్చిన హామీ నెరవేర్చే వరకు మంత్రులను నియోజకవర్గంలో ఎక్కడ తిరగకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు యలమంచి శ్రీను బాబు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మర్మం చంద్రయ్య, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు నిమ్మల మధు, సరియం ప్రసాద్, ఎలమంచిలి వంశీ, అంగన్వాడి యూనియన్ మండల కార్యదర్శి కమలదేవి, గజ్జలక్ష్మి, కృష్ణవేణి, విజయ, పోడుతూరి శిరోమణి, కారం కనకమ్మ, గోంది చిన్నక్క, ఎం నర్సు, పి అన్నపూర్ణ, భాగ్యవతి, తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టులు ప్రభుత్వం పిరికిపంద చర్య

మంత్రి కేటీఆర్ భద్రాచలం పర్యటన సందర్భంగా ప్రతిపక్ష పార్టీల నాయకులను, ఆదివాసి సంఘాల నాయకులను, ప్రజా సంఘాల నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేయడం ప్రభుత్వం పిరికిపంద చర్య అని మాజీ డిసిసిబి చైర్మన్ ఎలమంచి రవికుమార్ అన్నారు. శనివారం ఆయన దుమ్ముగూడెం పోలీస్ స్టేషన్ కు వెళ్లి పోలీసులు అరెస్టు చేసిన నాయకులను పరామర్శించారు. ఇటువంటి చర్య ప్రజాస్వామ్య వ్యవస్థలో ఒక మచ్చ లాంటిది అన్నారు.

భయంతోనే ముందస్తు అరెస్టులు

సమస్యలపై ప్రజలు ప్రశ్నిస్తారనే భయంతోనే బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీల నాయకులను ఆదివాసీ సంఘాల నాయకులను ముందస్తుగా అరెస్టులు చేశారని టిడిపి మండల అధ్యక్షులు కొమరం దామోదర్ రావు అన్నారు. ఇప్పటికైనా బేషరత్తుగా విడుదల చేయించి, వాళ్ళతోచర్చలు జరపాలని తెలుగుదేశం పార్టీగా తాము డిమాండ్ చేస్తున్నామని ఆయన అన్నారు.

టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి హరిలాల్ అరెస్టు దుర్మార్గమైన చర్య

కేటీఆర్ పర్యటన నేపథ్యంలో టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి హరిలాల్ నాయక్ ను అరెస్ట్ చేయడం ఆ ప్రజాస్వామికమైన చర్య అని టీపీటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి బి. రవి అన్నారు. ఉపాధ్యాయ సంఘాల రాజకీయాలతో సంబంధం లేదు అన్నారు.

అశ్వారావుపేట : కేటిఆర్ పర్యటన నేపథ్యంలో సీపీఐ(ఎంఎల్) ప్రజా పంథా జిల్లా కార్యదర్శి కామ్రేడ్ కెచ్చెల రంగారెడ్డి, పి.ఒ.డబ్ల్యు జిల్లా కార్యదర్శి కెచ్చల కల్పన తదితరుల అక్రమ అరెస్టులను ప్రజాస్వామికవాదులు ఖండించాలని ఆ పార్టీ నాయకులు గోకినపల్లి ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేసారు.

ప్రభుత్వం మెప్పు కోసమే

సీఐటీయూ నాయకుల అరెస్టులు

సీఐటియు పేరు వింటేనే భయంతో వణికిపోతున్న మంత్రులు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



రాష్ట్ర ప్రభుత్వానికి వత్తాసు పలుకుతూ ప్రభుత్వం మెప్పు కోసమే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు ముఖ్యంగా భద్రాచలం పట్టణ పోలీసులు సీఐటియు నాయకులను అక్రమ అరెస్టులు చేస్తున్నారని ఈ అరెస్టులను సిఐటియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కే.బ్రహ్మాచారి, ఏజె రమేష్ తెలిపారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కారం చేసే విధంగా పోలీస్ అధికారులు కార్మికులను మంత్రులకు కలిసి వినతి పత్రం అందించే అవకాశం కల్పించాలి గాని మంత్రుల మెప్పుకోసం కార్మికుల గొంతు నొక్కే పని చేయటం ఎంతవరకు సమంజసమో పోలీస్ అధికారులు ఆలోచించుకోవాలని సిఐటియు విజ్ఞప్తి చేసింది. రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు నిరవధిక సమ్మె చేస్తున్నారని అలాగే గిరిజన హాస్టల్ వర్కర్లు సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్ వర్కర్లు గ్రామపంచాయతీ వర్కర్లు వారి వారి సమస్యల పరిష్కారం కోసం వివిధ రూపాల్లో ఆందోళన పోరాటాలు నిర్వహిస్తున్నారని ఆ సమస్యలను పరిష్కారం చేయటం చేతగాక ప్రభుత్వం పోలీసులను ఉపయోగించి సమ్మెను విచ్ఛిన్నం చేయడం కోసం పోరాటాలను అణిచి వేయడం కోసం తీవ్రస్థాయిలో ప్రయత్నం చేస్తుందని సిఐటియు పేర్కొన్నది. సీఐటియు పేరు వినపడితేనే రాష్ట్రంలో మంత్రులకు వెన్నులో వణుకు పుడుతుందని ఆ భయంతోటే సిఐటియు నాయకులని మంత్రులు ఎక్కడికెళ్తే అక్కడ పోలీసులతో అరెస్టులు చేయిస్తున్నారని సిఐటియు పేర్కొన్నది. కార్మికుల తరపున అండగా నిలబడుతున్న సిపిఎం, సిపిఐ నాయకులను అరెస్టులు చేయడానికి సిఐటియు జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు అరెస్టులకు నిరసనగా జిల్లాలోని అన్ని కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు ఆందోళన పోరాటాలని చేయాలని పిలుపునిచ్చారు. అరెస్టులు చేయడం ద్వారా కార్మికులను మరింత రెచ్చగొట్టే చర్యలకు పోలీసులు ప్రభుత్వమే కారణమవుతుందని తద్వారా మరింత ఉధృతంగా సమ్మెలో పోరాటాలు జరుగుతాయనేది మంత్రులు పోలీస్ అధికారులు గుర్తించాలని సీఐటియు విజ్ఞప్తి చేసింది. అరెస్టు చేసిన నాయకులను విడుదల చేయాలని రాష్ట్రస్థాయిలో సమస్యలపై పోరాడుతున్న సంఘాలతోటి చర్చలు జరిపే ప్రక్రియకు ప్రభుత్వం ముందుకు రావాలని సిఐటియు విజ్ఞప్తి చేసింది.

ప్రతిపక్ష నాయకుల అరెస్టు దుర్మార్గం

కేటీఆర్ రాక సందర్భంగా కాంగ్రెస్, సీపీఐ(ఎం), సీపీఐ, తెలుగుదేశం, సీపీఐ ఎంఎల్ ప్రజపంథా, ప్రజాసంఘాల నాయకులను జిల్లా పోలీస్ యంత్రాంగం వారు అక్రమ అరెస్టులు చేసి దుమ్ముగూడెం పోలీస్ స్టేషన్ కి తరలించడం దారుణం అని మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఉపాధ్యక్షులు కొడాలి శ్రీనివాసన్ అన్నారు. తెలుగుదేశం పార్టీ తరపున నాయకుల అక్రమ అరెస్టులు ఖండిస్తున్నామని కొడాలి శ్రీనివాసన్ తెలిపారు.

మర్కోడులో వినాయక నిమజ్జనం

నవతెలంగాణ - ఆళ్ళపల్లి

మండల పరిధిలోని మర్కోడు గ్రామం బొడ్రాయి సెంటర్ వద్ద వినాయక చవితిని పురస్కరించుకొని అక్షర సమిధ వ్యవస్థాపకులు వూకె కిశోర్ బాబు - ఆళ్ళపల్లి ఎంపీపీ కొండ్రు మంజు భార్గవి దంపతుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. అనంతరం స్థానిక విగ్రహ దాత తాళ్లపల్లి నవీన్ - సునీత దంపతులకు కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు. అనంతరం లడ్డు, కలశం వేలం పాటలో గంధసిరి వెంకన్న జయమ్మ దంపతులు రూ. 20,500లకి, బూర్న రాంబాబు - విజయ దంపతులు రూ. 15016లకు సొంతం చేసుకున్నారు. తదనంతరం విఘ్నేశ్వరుడి శోభాయాత్రను ఉత్సవ కమిటీ సభ్యులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మర్కోడు ఉప సర్పంచ్ కుర్ర కమల, వివిధ పార్టీల నాయకులు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు స్వచ్ఛతాహి సేవా కార్యక్రమం

నవతెలంగాణ-ఆళ్ళపల్లి

మండలంలో 12 గ్రామ పంచాయతీల్లో ఆదివారం స్వచ్ఛతాహి సేవా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎం.రామారావు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని అన్ని జీపీలలో సైతం ఆదివారం ఒక గంట శ్రమదానం చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి పంచాయతీ కార్యదర్శులు కన్వీనర్లుగా వ్యవహరించాలని ఆదేశించారు.

వ్యక్తిగత శుభ్రత పై అవగాహన

- డాక్టర్ రాందాస్

నవతెలంగాణ - అశ్వారావుపేట

మండలంలోని సున్నం బట్టి లో గల సున్నం బట్టి,పెద్దవాగు ప్రాజెక్ట్ గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ బాలురు వసతి గృహాల్లో శనివారం అశ్వారావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్యాధికారి రాందాస్ పర్యవేక్షణలో విద్యార్థులకు వైద్యం శిబిరం నిర్వహించారు. రెండు పాఠశాలలో లోని 49 మంది విద్యార్థులను పరీక్షించి 9 మందిని జ్వర పీడుతులుగా గుర్తించారు. వీరికి రక్త నమూనాలు సేకరించి ఆర్.డి.టి పరీక్షించి సాధారణ జ్వరాలుగా గుర్తించి తరుణ వ్యాధులగా నమోదు చేసి చికిత్స అందించారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి అజ్మీరా వెంకటేశ్వరరావు, హెచ్.ఎస్ శ్రీనివాస్, ఎఎన్ఎం భూ లక్ష్మి పాల్గొన్నారు.

న్యాయవాద పరిషత్ సెమినార్

నవతెలంగాణ-ఖమ్మంలీగల్

పట్టణంలో శనివారం న్యాయవాద పరిషత్ సెమినార్ జరిగింది. ఈ సెమినార్‌కు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి కే.సి.బాను ముఖ్య అతిథిగా పాల్గొని క్రిమినల్ లా పై న్యాయవాదులకు వివరించారు. ముఖ్య అతిథులుగా హైకోర్టు న్యాయమూర్తులు నగేశ్ భీంపాక, ఈ.వి. వేణుగోపాల్, ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.ఎస్.జగ్జీవన్ కుమార్‌లు పాల్గొన్నారు. న్యాయవాద పరిషత్ ఆధ్వర్యాన జరిగిన సెమినార్ ఏర్పాట్లను న్యాయవాద పరిషత్ అధ్యక్షుడు హర్కార శ్రీరామారావు, ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరావు గుప్తా పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం

నవతెలంగాణ-కొత్తగూడెం టౌన్



కొత్తగూడెం బస్టాండ్ ఆవరణలో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం మున్సిపాలిటీ కమిషనర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచాలని చెత్త లేకుండా చూసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కమిషనర్ జి రఘు, 31వ వార్డు కౌన్సిలర్ ధర్మరాజు, మున్సిపాలిటీ మేనేజర్ సత్యనారాయణ, సానిటరీ ఇన్స్పెక్టర్ వీరభద్ర చారి, అశోక్, సానిటరీ జవాన్ శ్రీహరి, మున్సిపాలిటీ కార్మికులు వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి





సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క

నవతెలంగాణ - బోనకల్

ఆశా కార్యకర్తల దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని మధిర ఎమ్మెల్యే సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిషత్ కార్యాలయం ముందు సమ్మె చేస్తున్న ఆశాల శిబిరాన్ని శనివారం ఆయన సంఘీభావం, మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలు తమ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని మల్లు భట్టి విక్రమార్క కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన స్పందిస్తూ వైద్య రంగంలో క్షేత్రస్థాయిలో ఆశా కార్యకర్తలు అందిస్తున్న సేవలుకు విలువ కట్టలేమన్నారు. ఎంతో ప్రాధాన్యత ఉన్న వైద్య రంగాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. ఆశా కార్యకర్తలు చేస్తున్న డిమాండ్లు న్యాయమైనవే అన్నారు. ఆశా కార్యకర్తలకు హెల్త్ కార్డులు ఇవ్వాలని, ప్రమాద బీమా సౌకర్యం 5 లక్షల ఇవ్వాలని, సంక్షేమ పథకాలన్నింటినీ వర్తింప చేయాలని, 32 రకాల రిజిస్టర్ లను వెంటనే ప్రింట్ చేసి ప్రభుత్వం సప్లై చేయాలని పలు డిమాండ్లు చేస్తున్నారని ఈ డిమాండ్లన్నీ న్యాయమైన అన్నారు. కానీ ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం బాధాకరమన్నారు. ఆయన వెంట ఆయన టీపీసీసీ సభ్యులు పైడిపల్లి కిషోర్ కుమార్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు, కాంగ్రెస్ నాయకులు భూక్య భద్రు నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఆశ కార్యకర్తలు రామన సరోజినీ ఇరుగు యశోద మరీదు లీల కుమారి గద్దె తులసి కొంగల వెంకటరమణ తదితరులు ఉన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలి: మల్లు భట్టి విక్రమార్క

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం ముందు మధ్యాహ్న బోజన కార్మికుల సమ్మె శిబిరాన్ని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క శనివారం సందర్శించి సంఘీభావం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన కార్మికులు తమ సమస్యలను ఆయనకు ఏకరువు పెట్టారు. ఆరు నెలల నుంచి తమకు బిల్లులు చెల్లించడం లేదని, ప్రభుత్వం సాక్షాత్ అసెంబ్లీలోనే ఒక్కొక్కరికి మూడు వేల రూపాయలు నెలకు చెల్లిస్తామని ప్రకటించారని కాని దానిని అమలు చేయడం లేదని ఆయనకు వివరించారు. భట్టి విక్రమార్క స్పందిస్తూ మీ సమస్యల పరిష్కారం అయ్యేవరకు మీకు అండగా కాంగ్రెస్ ఉంటుందని స్పష్టం చేశారు. ఆయన వెంట పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులు ముళ్ళపాటి జయమ్మ, బానోతు నాగమణి, దుంపల సౌరమ్మ, చాపలమడుగు వసంత, లింగాల సుశీల తదితరులు ఉన్నారు.

మాజీ సర్పంచ్ నరసింహ రావు చిత్రపటానికి నివాళి:

మండల పరిధిలోనే జానకిపురం మాజీ సర్పంచ్ ఎన్నబోయిన నరసింహారావు కుటుంబ సభ్యులను సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క శనివారం జానకిపురంలో పరామర్శించారు. ఈ సందర్భంగా నరసింహారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పైడిపల్లి కిషోర్ కుమార్, గాలి దుర్గారావు, జానకిపురం సర్పంచ్ చిలక వెంకటేశ్వర్లు తదితర నాయకులు ఉన్నారు.

ఆశాలు మానవహారం

బోనకల్ : ఆశా కార్యకర్తలు సమ్మెలో భాగంగా శనివారం స్థానిక ఖమ్మం బస్టాండ్ సెంటర్లో గంటపాటు ఆశా కార్యకర్తలు ఈ మానవహారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కన్వీనర్ బోయినపల్లి వీరబాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బూర్గుల అప్పచారి, తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు ఇరుగు యశోద మండల కార్యదర్శి రామణ సరోజినీ ఆశాలు పాల్గొన్నారు.

వైరాటౌన్ : ఆశా, మధ్యాహ్నం భోజనం వర్కర్ల సమస్యల పరిష్కరించాలని సమ్మెలో బాగంగా మండల కేంద్రంలో శనివారం మానవ హారం నిర్వహించారు. ఆశా, మధ్యాహ్నం భోజనం వర్కర్ల దీక్షకు సిపిఐ(ఎం) సీనియర్ నాయకులు పారుపల్లి కృష్టారావు, సిపిఐ ఎంఎల్ నాయకులు కంకణాల అర్జునరావు, ఐఎఫ్‌టియు నాయకులు అశోక్ సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటియు జిల్లా నాయకులు తోట నాగేశ్వరరావు, పట్టణ కన్వీనర్ అనుమోలు రామారావు, రూరల్ కన్వీనర్ బాజోజు రమణ, వర్కర్లు ప్రమీల, గీత, స్వాతి, కరుణ పాల్గొన్నారు.

కామేపల్లి : అంగన్వాడీలు, ఆశాలు, మధ్యాహ్న భోజన వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి అంబటి శ్రీనివాసరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం వారి సమ్మెకు సంఘీభావం తెలిపారు.

ఆశా వర్కర్‌కు కాంగ్రెస్ పార్టీ సంఘీభావం

నవతెలంగాణ-ఎర్రుపాలెం

ఆశా వర్కర్ల సమ్మెకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు శీలం శ్రీనివాసరెడ్డి, బందారు నరసింహారావు, సొసైటీ వైస్ చైర్మన్ కడియం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జూలూరుపాడు : ఆశా కార్యకర్తలు శనివారం మండల కేంద్రంలో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల నాయకులు వల్లమళ్ల చందర్ రావు మాట్లాడారు.

చండ్రుగొండ : చంద్రుగొండ ప్రధాన సెంటర్లో ఆశా కార్యకర్తలు, సిఐటియు నాయకులు, సీపీఐ(ఎం) నాయకులు మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ఐలూరు రామ్ రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు విప్పర్ల పెద్ద వెంకటేశ్వర్లు, రామడుగు వెంకటాచారి, సిపిఎం మండల కమిటీ సభ్యులు పెద్దిన్ని వేణు పాల్గొన్నారు.

అంగన్వాడీల రాస్తారోకో

సుజాతనగర్ : అంగన్వాడీ టీచర్లు, ఆయాలు రాస్తారోకో నిర్వహించి మానవహారం చేపట్టారు.

అశ్వారావుపేట : అంగన్వాడీల సమ్మెకు జనసేన నైతిక మద్దతు ఇస్తుందని ఆ పార్టీ నియోజక వర్గం ఇంచార్జి డేగల రామచంద్రరావు అన్నారు. శనివారం శిబిరాన్ని సందర్శించి మద్దతు ప్రకటించారు.

బిజినెస్

వేడుకగా ఫ్రైడ్ ఆఫ్ నేషన్ అవార్డ్స్ ప్రదానం



హైదరాబాద్ : వివిధ రంగాలకు చెందిన అసాధారణ వ్యక్తులకు "ఫ్రైడ్ ఆఫ్ నేషన్ అవార్డ్ 2023-సదరన్ ఇండియా" అవార్డులను ప్రదానం చేశారు. ఆసియా టుడే రీసెర్చ్ అండ్ మీడియా నిర్వహించిన ఈ కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ పాల్గొని అవార్డులను బహుకరించారు. కళలు, వినోదం, విద్య, ఆరోగ్య సంరక్షణ, వ్యాపారం, సామాజిక సేవా రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారిని గుర్తించి ఈ అవార్డులను అందించినట్లు నిర్వాహకులు తెలిపారు.

రూ.2000 నోట్ల మార్పిడికి గడువు పెంపు

- అక్టోబర్ 7వరకు అవకాశం : ఆర్‌బిఐ వెల్లడి



ముంబయి : రూ.2,000 నోట్ల మార్పిడికి గడువు పెంచుతూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) నిర్ణయం తీసుకుంది. పెద్ద నోటు మార్పిడి, డిపాజిట్‌కు తొలుత సెప్టెంబర్ 30 నాటికి గడువు విధించిన విషయం తెలిసిందే. అక్టోబర్ 7వరకు ప్రజలు నోట్లను మార్చుకోవడానికి అవకాశం కల్పిస్తున్నట్లు ఆర్‌బిఐ శనివారం ఓ ప్రకటనలో తెలిపింది. రూ.2000 నోట్ల ఉపసంహరణపై సమీక్ష జరిపిన ఆర్‌బిఐ మరోసారి నోట్లను మార్చుకునేందుకు గడువును పొడిగించాలని నిర్ణయించినట్లు పేర్కొంది. అప్పటి వరకు ప్రస్తుతం చెలామణిలో ఉన్న రూ.2వేలనోట్లు చట్టబద్ధంగా చెల్లుబాటవుతాయని స్పష్టం చేసింది. 2023 మే 16న రూ.2వేల నోట్లను ఉపసంహరించుకుంటున్నట్లు ఆర్‌బిఐ వెల్లడించింది. దాదాపు 93 శాతం నోట్లు బ్యాంక్‌లకు తిరిగి వచ్చాయని సెప్టెంబర్ 2న తెలిపింది. బ్యాంక్‌లకు చేరిన మొత్తం నోట్లలో 87 శాతం డిపాజిట్ల రూపంలోకి రాగా.. 13 శాతం కరెన్సీ నోట్ల రూపంలోకి మార్చుకున్నారు. ఎవరివద్దనైనా రూ.2000 నోట్లు ఉంటే ఈ వారం రోజుల్లోనే బ్యాంకుల్లో, పోస్టాఫీస్‌లలో మార్చుకోవచ్చని సూచించింది.

ఎస్‌బిఐ 'వెల్త్ హబ్' ప్రారంభం



హైదరాబాద్ : దేశంలోనే అతిపెద్ద విత్త సంస్థ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) సికింద్రాబాద్‌లో మేనేజ్‌మెంట్ సర్వీసెస్‌కు సంబంధించిన వెల్త్ హబ్‌ను ఏర్పాటు చేసింది. శనివారం దీనిని హైదరాబాద్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్ కుమార్, ఎస్‌బిఐ కార్పోరేట్ సెంటర్ ముంబయి సిజిఎం (వెల్త్ అండ్ ప్రీమియర్ బ్యాంకింగ్) సుఖిందర్ కౌర్ లాంచనంగా ప్రారంభించారు. దేశంలో ఎస్‌బిఐ వెల్త్ ప్రస్తుతం 102 ప్రధాన నగరాల్లో 232 వెల్త్ హబ్స్‌ను కలిగి ఉంది. అధిక ఆదాయం కలిగిన 3,75,000 క్లయింట్లకు సర్వీసును అందిస్తుంది. దాదాపు రూ.3 లక్షల కోట్ల ఎయుఎంను కలిగి ఉంది.

2024 మార్చి ముగింపు నాటికి 4.50 లక్షల క్లయింట్లతో రూ.4 లక్షల ఎయుఎంకు చేరాలని లక్ష్యంగా పెట్టుకుందని రాజేష్ కుమార్ అన్నారు. హైదరాబాద్‌లో ఇది తమకు 12 హెల్త్ హబ్ అని తెలిపారు. అధిక ఆదాయాలు కలిగిన క్లయింట్లకు ప్రత్యేక సర్వీసులను అందించడమే వీటి లక్ష్యమని పేర్కొన్నారు. ప్రముఖ ఫండ్ సంస్థల నుంచి అధిక ఆదాయాలు కలిగిన వారికి అన్ని కేటగిరీల్లో ఆకర్షణీయ ప్రొడక్ట్స్‌ను అందిస్తున్నామన్నారు. ఎన్‌ఆర్‌ఐల కోసం కొచ్చిలోనూ గ్లోబల్ ఇ-వెల్త్ సెంటర్‌ను ప్రారంభించినట్లు ఎస్‌బిఐ తెలిపింది.

టిసిఎస్‌లో ఇంటి నుంచి పనికి స్వస్తి..!

న్యూఢిల్లీ : కరోనా సమయం నుంచి ఇంటి నుంచి పని చేస్తున్న ఉద్యోగులు ఇకపై ఆఫీసుకు రావాల్సిందేనని ఐటి కంపెనీలు వరుసగా ఆదేశాలు జారీ చేస్తున్నాయి. తాజాగా దేశంలోనే అతిపెద్ద ఐటి కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) ఇంటి నుంచి పని విధానం (వర్క్ ఫ్రం హోం)కు స్వస్తి పలకాలని నిర్ణయించింది. అక్టోబర్ 1 నుంచి వారంలో ఐదు రోజులు కచ్చితంగా కార్యాలయాలకు వచ్చి పని చేయాల్సిందేనని ఉద్యోగులకు మెయిల్స్ ద్వారా సమాచారం ఇచ్చినట్లు రిపోర్ట్‌లు వస్తున్నాయి.

కరోనా తగ్గుముఖం పట్టినప్పటి నుంచి హైబ్రిడ్ వర్క్ పద్ధతికి అనుమతించింది. దీంతో వారంలో సగం రోజులు కార్యాలయాలకు వచ్చి.. మిగితా రోజులు ఇంటి నుంచి పని చేస్తున్నారు. ఇకపై ఆ మిగిలిన రెండు రోజులు కూడా ఆఫీసుకు రావాల్సిందేనని టిసిఎస్ సిఇఒ, చీఫ్ హ్యుమన్ రిసోర్సెస్ ఆఫీసర్ పేరిట ఉద్యోగులకు ఆదేశాలు వెళ్లాయని తెలిసింది.

పబ్లిక్ ఇష్యూకు అజాద్ ఇంజినీరింగ్

- సెబీకి దరఖాస్తు

హైదరాబాద్ : ఆజాద్ ఇంజనీరింగ్ లిమిటెడ్ ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ)కు రానుంది. హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తోన్న ఈ సంస్థ మార్కెట్ రెగ్యూలేటర్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్చేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ)కి దరఖాస్తు చేసుకుంది. దీనికి సంబంధించిన ప్రతిపాదిత విధాన పత్రాలను సమర్పించింది. ఈ ఇష్యూలో రూ.740 కోట్ల నిధులు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో ఆఫర్ ఫర్ సేల్ ద్వారా రూ.240 కోట్లు, ప్రమోటర్ల వాటాలను విక్రయించడం ద్వారా మరో రూ.500 కోట్ల నిధులు పొందాలని నిర్దేశించుకుంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.2,517 కోట్ల రెవెన్యూ నమోదు చేసింది. ప్రతీ ఏడాది సగటున 27 శాతం వృద్ధిని సాధిస్తోంది. ఈ ఇష్యూకు యాక్సిస్ కాపిటల్, ఐసిఐసిఐ సెక్యూరిటీస్, ఎస్‌బిఐ కాపిటల్ మార్కెట్స్, ఆనంద్ రతి సంస్థలు లీడ్ మేనేజర్స్‌గా వ్యవహరించనున్నాయి.

నేటి నుంచి ఆన్‌లైన్ గేమింగ్‌పై 18 శాతం జిఎస్‌టి

న్యూఢిల్లీ : ఆన్‌లైన్ గేమింగ్‌పై నేటి నుంచి జిఎస్‌టి అధిక పన్ను శాతం అమల్లోకి రానుంది. అక్టోబర్ 1 నుంచి ఆన్‌లైన్ గేమింగ్, క్యాసినోలు, గుర్రపు పందెం క్లబ్‌లలో బెట్టింగ్‌ల తదితర వాటిపై 28 శాతం పన్ను విధించేలా వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) విధించనున్నారు. దీనికి ఆగస్టు 2వ తేదీన జరిగిన 51వ జిఎస్‌టి మండలి భేటీలో ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. ఇంతక్రితం ఆన్‌లైన్ గేమింగ్ పరిశ్రమ, కొన్ని గుర్రపు పందెం క్లబ్‌లపై18 శాతం జిఎస్‌టి వసూలు చేశారు.


మారుతి సుజుకికి నోటీసులు..

దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ కంపెనీ మారుతి సుజుకికి జిఎస్‌టి అధికారులు నోటీసులు ఇచ్చారు. వడ్డీ, పెనాల్టీలతో పాటు రివర్స్ ఛార్జ్ ప్రాతిపదికన నిర్దిష్ట సేవలకు సంబంధించి రూ. 139.3 కోట్లు చెల్లించాలని ఆదేశాలు జారీ చేసింది. జిఎస్‌టి అధికారుల నుంచి నోటీసు అందిన విషయం వాస్తవమేనని మారుతి సుజుకి తెలిపింది. దీనిపై వివరణ ఇవ్వనున్నట్లు పేర్కొంది.

అమృతకాలం ఎప్పుడొస్తుందో...!?

మహిళా సాధికారతపై చిత్తశుద్ధి ఏది?

- మాటలు ఘనం...చేతలు శూన్యం
- అఘాయిత్యాలు జరుగుతున్నా నోరు మెదపరు
- రిజర్వేషన్ల అమలుపై కుంటిసాకులు చెబుతారు



న్యూఢిల్లీ : ఈ సంవత్సరం చివరలో ఐదు రాష్ట్రాల శాసనసభలకు, వచ్చే సంవత్సరం ఏప్రిల్-మే నెలల్లో లోక్‌సభకు ఎన్నికలు జరగనున్న తరుణంలో కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేసి మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించుకుంది. చట్టసభలలో మహిళలకు మూడో వంతు రిజర్వేషన్లు కల్పించి వారికి విధానాలు, చట్టాల రూపకల్పనలో సముచిత ప్రాతినిధ్యం కల్పించడమే తన లక్ష్యమని గొప్పగా చెప్పుకుంది. అయితే మాటలు కోటలు దాటి చేతలు గడప దాటని సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఇప్పుడు మహిళా సాధికారత విషయంలోనూ మోడీ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో పరిశీలిస్తే బండారం బయటపడుతుంది.

మహిళా బిల్లు సెప్టెంబర్ 21న రాజ్యసభ ఆమోదం పొందగానే పార్లమెంట్ వెలుపల కన్పించిన దృశ్యాన్ని ఒక్కసారి గుర్తుకు తెచ్చుకోండి. రిజర్వేషన్ బిల్లును తీసుకొచ్చి, దానిని పార్లమెంటులో ఆమోదింపజేసినందుకు కృతజ్ఞతగా మహిళా సభ్యులంతా మోడీకి జేజేలు పలికిన ఆ దృశ్యాన్ని వీక్షించి కమలనాథులు ఉబ్బి తబ్బిబయ్యారు. మే 28న పార్లమెంట్ నూతన భవన ప్రారంభోత్సవం జరిగిన రోజు మహిళా మల్లయోధులను వీధుల్లో ఈడ్చుకెళ్లిన దృశ్యాలు కూడా ఇంకా దేశం మరిచిపోలేదు. ఈ రెండు ఉదంతాల మధ్య ఎంత తేడా ఉన్నదో గమనించాలి.

నిర్బంధాలు... అణచివేతలు

ప్రజాస్వామ్య పరిరక్షణలో మహిళలకు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నామని చెప్పుకుంటున్న పాలకులు... వారిపై దాష్టీకాలు జరుగుతుంటే ఆదేమని ప్రశ్నించే అవకాశం కూడా ఇవ్వడం లేదు. నిరసనలు, ఆందోళనలను బలప్రయోగంతో అణచివేస్తున్నారు. మణిపూర్‌లో మహిళలపై జరిగిన అఘాయిత్యాలను ప్రపంచమంతా గమనించింది. ఈ దారుణాలకు సంబంధించి సామాజిక మాధ్యమాలలో వీడియోలు కూడా వైరల్ అయ్యాయి. ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, సమానత్వం అంటూ పెద్ద పెద్ద మాటలు చెప్పే పాలకులు ఈ దారుణాలను చూసి కనీసం చలించిన పాపాన పోలేదు. మణిపూర్‌లోనే కాదు... దేశంలోని అనేక ప్రాంతాలలో మహిళల పట్ల పైశాచికంగా వ్యవహరిస్తున్న ఉదంతాలను గురించి ప్రతిరోజూ వింటూనే ఉన్నాము.

మాటలకే పరిమితం

మహిళా సాధికారత వాస్తవ రూపం దాల్చాలంటే విధానపరమైన నిర్ణయాలలో మహిళలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వ పెద్దలు ప్రవచిస్తుంటారు. కానీ మాటలకు, చేతలకు ఎక్కడా పొంతన లేదు. ఏకాభిప్రాయం లేదన్న సాకు చూపి మహిళా రిజర్వేషన్ బిల్లుపై విపరీతమైన కాలయాపన చేశారు. చివరికి హడావిడిగా బిల్లును ప్రవేశపెట్టి, ఆమోదింపజేసుకొని చేతులు దులుపుకున్నారు. అమలు మాత్రం ఇప్పుడే కాదంటూ చావు కబురు చల్లగా చెప్పారు. బిల్లులోని క్లాజ్ 5 (1) ప్రకారం... జనగణన, నియోజకవర్గాల పునర్విభజన జరిగిన తర్వాతే మహిళా బిల్లు అమలులోకి వస్తుంది. వచ్చినా పదిహేను సంవత్సరాలు మాత్రమే రిజర్వేషన్లు అమలులో ఉంటాయి.

అమృత్‌కాల్, సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్, సబ్‌కా ప్రయాస్ వంటి మాటలు వినసొంపుగానే ఉన్నా ఆచరణలో మాత్రం నీటి మీద రాతలుగా మారుతున్నాయి.

ఈ ప్రశ్నలకు బదులేది?

ఒక చట్టం అమలును కొంతకాలం నిలిపివేయడం, దానిని ఇతర ప్రభుత్వ చర్యలతో ముడిపెట్టడం, పైగా అమలుకు కాలపరిమితి నిర్ణయించడం..గతంలో ఎన్నడూ జరగలేదు. 2021లో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధాని చేసిన ప్రకటనకు ఇది భిన్నంగా ఉంది. అప్పుడు మోడీ ఏమన్నారంటే...అమృతకాలం పాతిక సంవత్సరాలు. అయితే అప్పటి వరకూ వేచి ఉండాల్సిన అవసరం లేదు. ఇప్పుడే మొదలు పెట్టాలి. ఒక్క క్షణం కూడా వృథా కాకూడదు. ఇదే సరైన సమయం. మన దేశం మారాలి. ప్రజలుగా మనం కూడా మారాలి. మారుతున్న కాలానికి అనుగుణంగా మనమూ మారాల్సి ఉంటుంది... మరి అప్పుడు ప్రధాని చెప్పిందేమిటి? ఇప్పుడు చేసిందేమిటి? మహిళా బిల్లును వెంటనే ఎందుకు అమలులోకి తీసుకురాలేదు? దానికి సరైన సమయం ఇంకా రాలేదా? మహిళా రిజర్వేషన్ల విషయానికి వచ్చేసరికి అప్పుడు చెప్పిన మాటలన్నీ మర్చిపోయారా?

కుంటిసాకులతో కాలయాపన

2026 తర్వాతే మహిళా రిజర్వేషన్లు అమలు చేస్తామని చెప్పిన వారు ఇప్పుడు ఇంత హడావిడిగా బిల్లును ఎందుకు ఆమోదించాల్సి వచ్చింది? ఇది కేవలం ఎన్నికల వేళ మహిళలను మభ్యపెట్టడానికేనని అర్థమవుతోంది. ఇక్కడ ఇంకో విషయాన్ని గమనించాల్సి ఉంది. రిజర్వేషన్ల కారణంగా సీట్లు కోల్పోయే వారిని బుజ్జగించడానికే ఈ ఎత్తు వేశారు. బిల్లును ఆమోదింపజేసుకునేందుకు అవసరమైన సంఖ్యాబలం 2014 నుండే ప్రభుత్వానికి ఉంది. అనేక బిల్లుల విషయంలో ప్రతిపక్షాల నుండి అభ్యంతరాలు వ్యక్తమైనప్పటికీ మందబలంతో వాటిని ఆమోదించుకున్న ఉదంతాలు అనేకం. వ్యవసాయ చట్టాలు, కార్మిక నిబంధన లు వీటికి ఉదాహరణలు. కానీ మహిళా బిల్లు విషయంలో మాత్రం ఏకాభిప్రాయం కొరవడిందన్న సాకు చెప్పారు. వాస్తవానికి మహిళా సాధికారత విషయంలో మోడీ ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి లేదు. అనేక ప్రభుత్వ విధానాలు మహిళా లోకానికి నష్ట దాయకంగా ఉంటున్నాయి. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలకు సం బంధించిన సమాచారం సభ్య సమాజానికి ఆందోళన కలిగిస్తోంది. మహిళ లకు సరైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించడం లేదు. వారిపై ఇంటిపని భారం పెరుగుతోంది. ప్రతిరోజూ మహిళలపై దౌర్జన్యాలు, దాష్టీకాలు, అకృత్యాలు, లైంగిక వేధింపులు జరుగుతూనే ఉన్నాయి. వాస్తవాల గుట్టును చరిత్ర రట్టు చేస్తుంటే పాలకులు మాత్రం మహిళా సాధికారత అంటూ తీపి కబుర్లు చెబుతూనే ఉన్నారు. ప్రజలను మభ్యపెడుతూనే ఉన్నారు.

ప్రయివేటు సెక్యూరిటీ గార్డులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

సీఐటీయూ జాతీయ నాయకులు ఎం.సాయిబాబు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రయివేటు సెక్యూరిటీ గార్డులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జాతీయ కోశాధికారి, నేషనల్ కో ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ సెక్యూరిటీ గార్డ్స్, అలైడ్ వర్కర్స్ యూనియన్స్ జాతీయ కన్వీనర్ ఎం.సాయిబాబు డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ప్రయివేటు సెక్యూరిటీ గార్డ్స్, అలైడ్ వర్కర్స్ యూనియన్ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయివేటు సెక్యూరిటీ ఏజెన్సీల (నియంత్రణ) చట్టం, 2005- అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, ప్రయివేట్ సెక్యూరిటీ ఏజెన్సీల కార్యకలాపాలను పర్యవేక్షించటం కోసం చేశారనీ, ప్రయివేటు సెక్యూరిటీ ఏజెన్సీల సెంట్రల్ మోడల్ రూల్స్ 2006 సరిగ్గా అమలు కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు.

అనేక ఏజెన్సీలు కార్మికులకు పీఎఫ్ చెల్లించడం లేదని తెలిపారు. కనీస వేతనాలు ఇవ్వకుండా శ్రమ దోపిడి చేస్తున్నారన్నారని విమర్శించారు. మహిళా సెక్యూ రిటీ గార్డులకు ప్రసూతి ప్రయోజనాలు కల్పించాలని చట్టంలో ఉన్నప్పటకీ అమలుకు నోచుకోవడం లేదని ఆవేద వ్యక్తం చేశారు. దేశ వ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో జీ.వోల్లో ప్రకటించిన విధంగా కనీస వేతనాలు అమలు చేయటం లేదని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస వేతనాన్ని ప్రభుత్వ, ప్రయివేటు రంగ బ్యాంకుల్లో అమలు చేయడం లేదని తెలిపారు. కార్మిక చట్టాలను ప్రభుత్వాలు అమలు చేయటంలో ఉద్దేశ్యపూర్వకంగానే నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాయని విమర్శించారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు యాటల సోమన్న, మాట్లాడుతూ రాష్ట్రంలో సెక్యూరిటీ కార్మికుల వేతనాలు పెంచుతూ 2021 జూన్‌లో జీవో నెంబర్ 21ని ప్రభుత్వం విడుదల చేసిందని చెప్పారు. యాజమాన్యాల ఒత్తిడికి తలొగ్గి ఆ జీవోను గెజిట్ చేయకుండా తత్సారం చేస్తున్నారని విమర్శించారు. తక్షణం ఆ జీవోను అమల్లోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. సదస్సుకు సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె ఈశ్వర్‌రావు అధ్యక్షత వహించగా అపోలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.సత్యనారాయణ, అనురాద, దేవేం దర్, నాయకులు స్రవంతి, బుద్ధపూర్ణిమా యూని యన్ నాయకులు ఎన్ రవి కుమార్, ఎం.మధు, చర్లపల్లి పారిశ్రామిక ప్రాంత యూనియన్ నాయకులు రామకృష్ణ, జి.రామారావు, వ్యవసాయ మార్కెట్ సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి లక్షణ్, హన్మకొండ సెక్యూరిటీ గార్డ్స్ నాయకులు వెల్పుల సారంగపాణి పాల్గొన్నారు.

పప్పులకు కొరత తప్పదా?

కెనడా నుండి తగ్గిన దిగుమతులు

- దౌత్య ఉద్రిక్తతలే కారణం



న్యూఢిల్లీ : భారత్-కెనడా మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు తలెత్తిన నేపథ్యంలో మన దేశంలో పప్పులకు కొరత ఏర్పడి ధరలు పెరిగే అవకాశం కన్పిస్తోంది. భారత ఇంటెలిజెన్స్ ఏజెంట్ల పైన కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ఆరోపణలు చేసిన తర్వాత ఆ దేశం నుండి పప్పుల దిగుమతులు తగ్గిపోయాయి. పప్పులే కాదు...వంట నూనెలు, బఠాణీలు కూడా కెనడా నుండి మన దేశానికి దిగుమతి అవుతున్నాయి. ముఖ్యంగా ఎర్ర కందిపప్పు కొరతను ఎదుర్కొంటున్న తరుణంలో కెనడా దిగుమతులు ఎంతో ఉపశమనం కలిగిస్తున్నాయి. అనేక సందర్భాలలో ధరలు స్థిరంగా ఉండడానికి ఈ దిగుమతులు దోహదపడుతున్నాయి. శనగపప్పుకు కొరత ఏర్పడి, ధరలు పెరిగినప్పుడు కూడా కెనడా నుండి దిగుమతుల కారణంగా పరిస్థితి కుదుటపడింది. కెనడా నుండి ఆవనూనె దిగుమతి అవుతుండడంతో వంట నూనెల సరఫరాలో ఎదురవుతున్న కొరత తీరుతోంది. అదే విధంగా అక్కడి నుండి వస్తున్న దాణా చెక్క కోళ్ల, పశువులకు ఆహారంగా ఉపయోగపడుతోంది.

అయితే రెండు దేశాల మధ్య నెలకొన్న దౌత్యపరమైన ఉద్రిక్తతల కారణంగా ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. మన దేశంలో కరువు కాటకాలు, అతివృష్టి వంటి ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా ఇటీవలి కాలంలో వ్యవసాయ రంగం బాగా దెబ్బతిన్నది. ఉత్తర భారతంలో ఆగస్ట్, సెప్టెంబర్ నెలల్లో దాదాపు కరువు పరిస్థితులు నెలకొన్నాయి. దేశంలోని అనేక ఇతర ప్రాంతాలలోనూ ఇదే పరిస్థితి. పప్పులు, చమురు గింజల ఉత్పత్తి పడిపోయింది. ఈ సీజన్‌లో వరి సాగు విస్తీర్ణం 3% తగ్గిందని అంచనా. మన వద్ద ఉన్న వ్యూహాత్మక నిల్వలు కూడా తరిగిపోతున్నాయి.

మరోవైపు దేశంలో ఎన్నికలు ముంచుకొస్తున్నాయి. ఈ దశలో ఆహార ధాన్యాల ధరలు ఎంత తక్కువగా ఉంటే పాలక పార్టీలకు అంత మంచిది. అయితే దిగుమతులు చౌకగా లేకపోతే ధరలు తగ్గడం అసంభవం. మరోవైపు కెనడాకు మన దేశం నుండి జరుగుతున్న వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులపై కూడా నిశిత పరిశీలన జరుగుతోంది. సుంకాలు విధించి, భారత దిగుమతులను తగ్గించాలని కెనడా భావిస్తోంది. కెనడా ఆహార దిగుమతులపై కూడా మన దేశం అలాంటి ఆంక్షలే విధించవచ్చు. కానీ చివరికి నష్టపోయేది ప్రజలే.

కెనడా నుండి ఆహార ధాన్యాలు, వంట నూనెలే కాదు ఎరువులు కూడా భారత్‌కు ఎగుమతి అవుతున్నాయి. ముఖ్యంగా మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను (ఎంఓపీ)ని పెద్ద ఎత్తున మన దేశం దిగుమతి చేసుకుంటోంది. కెనడా నుండి దిగుమతులు ఆగిపోతే దాని ప్రభావం రబీ పంటల సాగుపై పడుతుంది.

కల్వకుంట్ల కవితకు బ్రిడ్జ్ ఇండియా సంస్థ ఆహ్వానం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యంపై లండన్‌లో ఏర్పాటు చేయబోయే సమావేశంలో కీలకోపన్యాసం చేయాలసిందిగా పబ్లిక్ పాలసీకి సంబంధించిన ప్రముఖ స్వచ్ఛంద సంస్థ బ్రిడ్జ్ ఇండియా (లండన్) బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఆహ్వానించింది. పార్లమెంటు ఆమోదించిన మహిళ రిజర్వేషన్ల బిల్లులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేసిన సందర్భంగా లండన్‌లో అక్టోబర్ 6న ఒక సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నామని ఆహ్వాన పత్రంలో పేర్కొంది. రాజకీయాల్లో, ప్రజాస్వామ్య ప్రక్రియలో మహిళల భాగస్వామ్యం పెరగడానికి కవిత విశేషంగా కృషి చేశారని ఆ సంస్థ ప్రశంసించింది. మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం అనేక ఆందోళనా కార్యక్రమాలను చేపట్టారనీ, వివిధ రాజకీయ పార్టీల మద్దతును కూడగట్టడంలో కీలక పాత్ర పోషించారని వివరించింది. ఇలా పలు రకాల కార్యక్రమాల ద్వారా దేశవ్యాప్తంగా మహిళా బిల్లుపై చర్చను రేకెత్తించారని పేర్కొంది. జంతర్ మంతర్‌లో దాదాపు 6000 మందితో ధర్నా నిర్వహించారని, ఈ ధర్నా కార్యక్రమానికి 18 పార్టీల నేతలు హాజరైన మద్దతు ప్రకటించారని తెలిపింది. మహిళా రిజర్వేషన్ల ఆవశ్యకతపై ఢిల్లీలో భారత్ జాగతి ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో 13 రాజకీయ పార్టీలతో పాటు మహిళా, విద్యార్థి, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారని గుర్తు చేసింది.

ఇన్నర్ రింగ్ రోడ్ కేసులో నారా లోకేష్‌కు ఏపీ సీఐడీ నోటీసులు

- అక్టోబర్ 4న విచారణకు రావాలని నోటీసుల్లో వెల్లడి

న్యూఢిల్లీ : అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్ మెంట్ కుంభకోణం కేసులో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు ఏపీ సీఐడీ అధికారులు నోటీసులు ఇచ్చారు. ఈ కేసు వ్యవహారంలో నారా లోకేష్‌కు, 41ఏ కింద నోటీసులు అందజేశారు. అక్టోబర్ 4న ఉదయం 10 గంటలకు సీడీఐ ఆఫీసులో విచారణకు హాజరుకావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఈ కేసులో విచారణకు సహకరించాలని కోరారు. శనివారం ఢిల్లీ అశోక రోడ్ 50లోని టీడీపీ ఎంపి గల్లా జయదేవ్ అధికారం నివాసంలో ఉన్న లోకేష్‌ను కలిసి సీఐడీ అధికారులను ఉద్దేశించి ఇలా ఎలా వచ్చారని ప్రశ్నించారు. నోటీసులు ఇచ్చేందుకు వచ్చామని అధికారులు తెలిపారు. అయితే ఇప్పటికే నోటీసులు పంపారు కాదా అని లోకేష్ అధికారులతో అన్నారు. అయితే దీనికి స్పందించిన అధికారులు నోటీసులు భౌతికంగా అందజేయాలని వచ్చినట్లు తెలిపారు. అయితే ఓకే అని నోటీసులను సీఐడీ అధికారుల నుంచి లోకేష్ తీసుకున్నారు. ఈ సందర్భంగా రాక రాక వచ్చారు. టీ అయిన, కాఫీ అయిన తీసుకోవాలని సీఐడీ అధికారులను లోకేష్ కోరారు. అందుకు సీఐడీ అధికారులు నిరాకరించారు. కాగా ఇన్నర్ రింగ్ రోడ్డు ఎలైన్ మెంట్ వ్యవహారంలో నారా లోకేష్‌ను సీఐడీ ఏ 41గా చేర్చింది. దీంతో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ లోకేశ్ హైకోర్టు ఆశ్రయించగా.. సీఆర్పీసీ 41 ఏ కింద నోటీసులు ఇవ్వడమంటే అరెస్ట్ కాదని అధికారులు కోర్టుకు నివేదించారు. ఈ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం... అరెస్ట్ చేసే ఆస్కారం లేనందున లోకేశ్ పెట్టుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్ ను ముగించిన విషయం తెలిసిందే.

ఆప్ గొంతు అణచివేసేందుకు బీజేపీ యత్నం

- సామాన్యుల తిరుగుబాటు తప్పదు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశ రాజకీయాల్లో బీజేపీకి ప్రత్యామ్నాయంగా ఎదుగుతున్న ఆప్ గొంతు అణచివేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నదని ఆ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ విమర్శించారు. ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌పై సీబీఐవి తప్పుడు కేసులని ఆయన ఖండించారు. శనివారం హైదరాబాద్ లోని ఆప్ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కేజ్రీవాల్ అధికారిక నివాసం పునరుద్ధరణలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ బీజేపీ సీబీఐని ప్రయోగించి తప్పుడు కేసులు పెట్టించడానికి ప్రయత్నిస్తున్నదని తెలిపారు. ఆ పునరుద్ధరణ చేసింది పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ అయితే కేజ్రీవాల్‌కు ఏమి సంబంధమని ఆయన ప్రశ్నించారు. ఆప్ నిజాయితీ పాలనను అంతమొందించే ప్రతీకార చర్యలను మానుకోవాలనీ, తప్పుడు కేసులను ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేకపోతే బీజేపీపై సామాన్యులు తిరగబడతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు బుర్ర రాము గౌడ్, ఏం.ఏ. మజీద్, అధికార ప్రతినిధులు పరీక్షణ్ రాజ్, ప్రవీణ్ యాదవ్, ఆప్ మహిళా విభాగం అధ్యక్షురాలు హేమ జిల్లోజు, దివ్యంగుల విభాగం అధ్యక్షులు దర్శనం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫొటో జర్నలిస్టు భరత్ భూషణ్ కుటుంబానికి డబుల్ రూమ్ ఇల్లు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సాహిత్యం, చిత్రకళ, ఫొటోగ్రఫీ తదితర సాంస్కృతిక, సృజనాత్మక రంగాల ద్వారా తెలంగాణ జీవితాన్ని ప్రతిబింబిస్తూ, జీవిత కాలం కృషి చేసిన కళాకారుల కుటుంబాలను ఆదుకోవాలనే నిర్ణయంలో భాగంగా ప్రఖ్యాత ఫోటో జర్నలిస్టు, చిత్రకారుడు, భరత్ భూషణ్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. ఈ మేరకు భరత్ భూషణ్ కుటుంబానికి సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు మంత్రి కేటీఆర్ హైదరాబాద్‌లోని జియాగూడలో డబుల్ బెడ్‌రూమ్ ఇల్లును శనివారం కేటాయించారు. భరత్ భూషణ్ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నప్పుడు కూడా వైద్య ఖర్చుల కోసం సీఎం ఆరోగ్య నిధి నుంచి ప్రభుత్వం చేయూతనందించిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తమకు డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కేటాయించి మరోసారి అండగా నిలిచినందుకు భరత్ భూషణ్ భార్య సుభద్రమ్మ వారి కుటుంబ సభ్యులు సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

సమ్మెలో మధ్యాహ్న భోజన కార్మికులు

- అధికారులకు వినతులు

నవతెలంగాణ- విలేకరులు

సమస్యల పరిష్కారం కోరుతూ మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మె చేపట్టారు. రంగారెడ్డి జిల్లా షాదన్‌నగర్‌లో చేపట్టిన సమ్మెకు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పి.శ్రీనునాయక్ మద్దతు తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో ఫరూఖ్‌నగర్ తహసీల్దార్ పార్థసారథికి వినతి పత్రం అందజేశారు. మంచాలలో సమ్మెకు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు జగదీష్ మద్దతు తెలిపి మాట్లాడారు. కరీంనగర్ జిలా శంకరపట్నం మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై మధ్యాహ్న భోజన పథకం కార్మికులు రాస్తారోకో చేశారు. సూర్యాపేట జిల్లాలోని మునగాల, గరిడేపల్లి, హుజూర్‌నగర్, కోదాడ మండలాల్లో మధ్యాహ్నభోజన కార్మికుల సమ్మె కొనసాగింది. యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మధ్యాహ్నభోజన కార్మికులు చెవిలో పూలుపెట్టుకొని నిరసన తెలిపారు.



కూలికి వెళితే తప్ప రోజు గడవని కుటుంబంలో పుట్టారు. చదువుకుంటే తప్ప ఈ సమాజంలో గౌరవంగా బతకలేం అనే మాటలు వింటూ పెరిగారు. అందుకే అక్షరాలనే తన ప్రాణంగా మలుచుకున్నారు. చదువునే తన ఆయుధం చేసుకున్నారు. ఎన్ని కష్టాలు ఎదురైనా ధైర్యంగా ఎదుర్కొన్నారు. ఇప్పుడు ఉస్మానియా యూనివర్సిటీ హిందీ విభాగానికి అధిపతిగా నిలిచారు. ఐదుగురు చెల్లెళ్లకు మంచి జీవితాన్ని ఇచ్చారు. ఆమే ప్రొ.నివర్తి మాయావతి. ఆమె స్ఫూర్తిదాయక జీవిత పరిచయం నేటి మానవిలో...



చదువే ఆమె ఆయుధం

తెలంగాణలోనే అత్యంత వెనుకబడి ప్రాంతమైన ఆదిబాద్ జిల్లాలోని ఇంద్రవెల్లి గ్రామంలో మాయావతి పుట్టారు. తండ్రి నివర్తి వాగ్‌బిజే. ఆయన ఒక మిల్లులో హమాలీగా పని చేసేవాడు. తల్లి సునంద పొలంలో కూలి పనులు చేసేది. వీరికి ఆరుగురు సంతానం. ఐదుగురు ఆడపిల్లలు, ఒక అబ్బాయి. అందరిలో మాయనే పెద్దది. బుద్ధుడు, అంబేద్కర్, జ్యోతిబాపూలే, సావిత్రీబాయి, బసవేశ్వర్ ప్రభావం ఆ కుటుంబంపై ఎక్కువగా ఉండేది. పండగలంటే వీరికి ఆ మహానుభావుల జయంతులు, వర్ధంతులే. ఆ ప్రభావంతోనే నిరుపేద కుటుంబమైనా తండ్రి పిల్లల్ని చదివించాలనుకున్నాడు. ఆయన ప్రోత్సహంతో మాయ ఊళ్ళోనే పదోతరగతి పూర్తి చేశారు. చదువుకుంటూనే కుటుంబ అవసరాల కోసం సెలవల్లో బీడీలు చుట్టడానికి, పత్తి, కలుపు తీయడానికి, కూరగాయాలు తెంపడానికి వెళ్ళేవారు. అలా పది పూర్తి చేసి ఇంటర్ కాలేజీకి. కాలేజీలో అందరూ చక్కగా రెడీ అయి వస్తే తను మాత్రం పనికి పోయి మురికి బట్టలతో వెళ్ళేవారు. దాంతో మాయకు చాలా ఏడుపొచ్చేది. కానీ ఏదేమైనా చదువుకోవాలనే కోరికతో తన బాధలన్నీ

కోసం హైదరాబాద్ వచ్చారు.

ప్రింటింగ్ ప్రెస్‌లో పని చేస్తూ...

ఏదైనా పని చేసుకుంటే తప్ప చదువుకోలేని పరిస్థితి. దాంతో ముషీరాబాద్ సోషల్ వెల్ఫేర్ హాస్టల్లో ఉంటూ బడిచౌడీలోని హిందీ మహావిద్యాలయ సాయంత్రం కాలేజీలో చేరారు. అక్కడే ఇంటర్, డిగ్రీ పూర్తి చేశారు. ఓ లెక్చరర్ సహాయంతో ఇంటర్‌లో ఉన్నప్పుడే ప్రింటింగ్ ప్రెస్‌లో పనికి చేరారు. రోజుకు పది రూపాయలు ఇచ్చేవారు. ఉదయం పది గంటల నుండి సాయంత్రం 4 గంటలకు వరకు పనికి పోవాలి.
ఆటునుండి అటే

దు:ఖం ఆగలేదు

'పి. హెచ్‌డీ చేసే సమయంలో వారి జీవితాలు నన్ను చాలా ప్రభావితం చేశాయి. రీసర్చ్ వర్క్ చేసేటపుడు చాలా ఏడుపొచ్చింది. 'మీరు చదువుకుంటే ఊరంతా ఎవరు శుభ్రం చేస్తారు' అన్న అగ్రకుల అహంకారం చూశాను. ఓ తల్లి తిండి లేక బిడ్డకు పాలివ్వలేక పోతే ఆ బిడ్డ చని పోయిన సంఘటర చదివినప్పుడు దు:ఖం ఆగలేదు. ఇలా ఎన్నో దుర్భరమైన జీవితాలను నా రీసర్చ్ ద్వారా ఈ ప్రపంచానికి పరిచయం చేయగలిగాను. అంటరాని వారంటే ఎప్పుడూ ఊరవతలే ఉండాలి. మురుగు దొడ్డు శుభ్రం చేయాలి, రోడ్లు శుభ్రం చేయాలి. ఇంతటి దారుణమైన జీవితాన్ని దళితులు అనుభవిస్తున్నారు. భయంకరమైన ఆర్థిక సమస్యలు. వర్ణ వ్యవస్థను సృష్టించి శూద్రులు పై కులాల వారందరికీ సేవలు చేయాలని నిర్ణయించారు. ఇలాంటి సమాజంలో దళితులు గౌరవంతో బతకాలంటే చదువు మాత్రమే ఆయుధం అని నేను నమ్ముతున్నాను' అంటారు మాయాదేవి.

మర్చిపోయేవారు. కాలేజీలో చేరేటపుడే ఐదేండ్ల పాటు ప్రతి ఏడాది క్లాస్ ఫస్ట్ వస్తే గోల్డ్‌మెడల్ ఇస్తారని తెలుసుకున్నారు. ఎలాగైనా ఆ మెడల్ తనకే రావాలని చాలా కష్టపడి చదివారు. చివరికి గోల్డ్‌మెడల్ సాధించారు. తన తర్వాత చెల్లెళ్ళను కూడా ఒక్కొక్కరిని హైదరాబాద్ తీసుకొచ్చి కాలేజీలో చేర్పించారు. డీటీపీ నేర్చుకుని ఆ జాబ్‌లో చేరారు. అక్కడ వారానికి ఏడు వందలు ఇచ్చేవారు. దాంతో ఆమె కష్టాలు కొంత వరకు తీరాయి. తర్వాత హెచ్.సి.యులో ఎం.ఏ హిందీలో చేరారు. అయితే అప్పుడే బీఎడ్ రాస్తే అందులో సీటు వచ్చింది. దాంతో ప్రొఫెసర్స్ సలహాతో ఎం.ఏ మధ్యలో ఆపేసి ముందు బీఎడ్ పూర్తి చేశారు. తర్వాత మళ్ళీ ఎంట్రన్స్ రాసి ఎం.ఏ కూడా పూర్తి చేశారు. అక్కడ కూడా రెండు గోల్డ్‌మెడల్స్ తెచ్చుకున్నారు. అలాగే మెరిట్ స్కాలర్‌షిప్ కూడా వచ్చింది.

దళిత సాహిత్యంపై...

బీఎడ్ పూర్తి చేయడంతో స్కూల్ అసిస్టెంట్‌గా జాబ్ సంపాదించారు. కుటుంబానికి మరింత అండగా నిలిచారు. చెల్లెళ్ల చదువుపై మరింత దృష్టి పెట్టారు. అదిలాబాద్‌కు చెందిన భరత్ వాగ్మారేతో ఆమె పెండ్లి జరిగింది. భర్త సలహాతో ఉద్యోగానికి సెలవు పెట్టి ఎం.ఫిల్ పూర్తి చేశారు. హిందీ - మరాఠీ తులనాత్మక అధ్యయనంలో దళిత సాహిత్యంపై ఆమె తన ఎంఫిల్ పూర్తి చేశారు. 'హిందీ ఔర్ మరాఠీ దళిత్ ఆత్మ్ కథావోంమే దళిత్ అస్మిత' అనే సబ్జెక్ట్‌పైనే తన ఎం.ఫిల్, పి.హెచ్‌డీ చేశారు. అంటే హిందీ, మరాఠీలో వచ్చిన స్ఫూర్తిదాయక జీవిత చరిత్రలను అధ్యయనం చేయడం.

తండ్రి మరణంతో...

పీహెచ్‌డీ తర్వాత తెలంగాణ యూనివర్సిటీలో జాబ్ కోసం అప్లయ్ చేశారు. ఇంటర్వ్యూలో సెలక్ట్ అయ్యారు. 2008లో అక్కడ జాయిన్ అయ్యారు. అప్పటి నుండి నిజామాబాద్‌లోనే ఉండేవాడు. అయితే 2007లో మాయ తండ్రి చనిపోయాడు. దాంతో చెల్లెళ్ళ పెండ్లి బాధ్యత ఈమె తీసుకోవల్సి వచ్చింది. అందుకే తెలంగాణ యూనివర్సిటీలో లీవ్ పెట్టి హైదరాబాద్ వచ్చి ఉస్మానియాలో ట్రై చేస్తే పోస్ట్ వచ్చింది. హైదరాబాద్ వచ్చిన తర్వాత చెల్లెళ్లందరికీ పెండిండ్లు చేశారు. వాళ్ళందరూ ఇప్పుడు మంచి కుటుంబాల్లో సెటిల్ అయ్యారు. తమ్ముడికి కూడా ఒక దారి చూపించారు.

బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్‌పర్సన్‌గా

మామ కుటుంబంలో సమాజ సేవకులు చాలా మంది ఉన్నారు. తన భర్త కూడా సోషల్ వర్కరే. మాయ కూడా తన సొంత ఊరు వెళ్ళినప్పుడల్లా అక్కడి బుద్ధ విహార్‌కి వెళ్ళి పిల్లలకు అవగాహన సదస్సులు పెడుతుంటారు. పేద పిల్లలకు కావల్సిన సహకారం అందిస్తుంటారు. ఆమె చెల్లెళ్ళలో ఒకరు హైదరబాద్‌లో ఆనాథ ఆశ్రమాన్ని నడుపుతున్నారు. అలాగే మాయవతి మొన్నటి వరకు బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్‌పర్సన్‌గా కూడా పని చేశారు. తను ఆ బాధ్యతల్లో ఉన్నప్పుడు ప్రస్తుత సమాజానికి అవసరమైన సిలబస్‌ను పాఠ్యపుస్తకాల్లో పెట్టేందుకు ఎంతో కృషి చేశారు.
ఎక్కడో మారుమూల గ్రామంలో పుట్టి కాలేజీలు, యూనివర్సిటీలు అంటే ఏమిటో తెలియని ఆమె పాఠ్యపుస్తకాలు రూపొందించే స్థాయికి ఎదిగారు. పీహెచ్‌డీలు చేసే విద్యార్థులకు సహకరిస్తున్నారు. ఇలా తన జాతికే కాకుండా ఎందరో మహిళలకు స్ఫూర్తిగా నిలిచారు.

- సలీమ
- శ్రీనివాస్
ఓయూ రిపోర్టర్

కాలాన్నీ, వయసునూ ఆపలేం. రెండూ సాగిపోతూనే ఉంటాయి. అయితే... ముసలితనాన్ని కాస్త వాయిదా వేయవచ్చు. కొంతమంది 40 ఏండ్ల నుంచే ముసలి వారిలా కనిపిస్తారు. కొంత మందికి 80 ఏండ్లు వచ్చినా చురుగ్గానే ఉంటారు. ఇందుకు ప్రధాన కారణం వాళ్లు తినే ఆహారమే. మనం తినే పదార్థాలకూ, మన శరీరం, ఆరోగ్యానికీ సంబంధం ఉంటుంది. వయసులో ఉన్నప్పటి నుంచే సరైన ఆహారం తింటూ ఉంటే త్వరగా ముసలితనం రాదు. వచ్చినా అనారోగ్యాలు పెద్దగా ఉండవు. అలాంటి పరిస్థితి రావాలంటే డాక్టర్లు కొన్ని రకాల పదార్థాల్ని తినడం మానేయమంటున్నారు. ఎప్పుడో ఒకసారి తింటే పర్లేదు గానీ రెగ్యులర్‌గా మాత్రం వాటిని తినకూడదు. అవేంటో తెలుసుకుందాం.

వీటికి దూరంగా ఉండండి

- పిజ్జాలు, బర్గర్లు టేస్టీగా ఉంటాయి కానీ... ఆరోగ్యాన్ని సర్వనాశనం చేస్తాయి. ఇవి మన చర్మంపై ఉండే కాంతిని పూర్తిగా పోగొడతాయి. అంతేనా శరీర భాగాలకు కొవ్వును అతికిస్తాయి. ఫలితంగా పొట్ట వచ్చేస్తుంది. దాని చుట్టూ కొవ్వు పేరుకుంటుంది. అది వస్తే చాలు... చాలా రోగాలు వచ్చేందుకు దారి తీస్తుంది. ఫాస్ట్ ఫుడ్ ఎంత తింటే... అంతలా ఫ్యాటీ యాసిడ్స్ పెరుగుతాయి. ఫాస్ట్ ఫుడ్ తినేవాళ్లకు హార్ట్ ఎటాక్ వచ్చే ప్రమాదం ఎక్కువ. దాన్ని ఎంత తగ్గిస్తే... అంతలా మీరు ముసలితనానికి దూరమవుతారని డాక్టర్లు చెబుతున్నారు.
- కేక్‌లు, పేస్ట్రీలు, ఫ్యాట్స్... ఇవన్నీ మనలో కొవ్వును పెంచుతాయి. కొవ్వు ఎంత పెరిగితే ముసలి తనం అంత త్వరగా వస్తుంది. సో.. వాటికి దూరంగా ఉండాలి.
- చిప్స్ బాగా ఇష్టంగా తినే అలవాటుంటే ఒక్కసారి ఆలోచించండి. వాటిని ఫ్యాటీనూనెలో వేపుతారు. సాల్ట్ ఎక్కువగా వాడుతారు. అలాంటివి తింటే ఆరోగ్యం పాడై పోతుంది. అవి మీకు తెలియకుండానే మీ శరీర భాగాలను నాశనం చేసి ముసలితనం త్వరగా వచ్చేలా చేస్తాయి.
- ఎనర్జీ డ్రింకులు, కూల్ డ్రింకులు తాగడం మానేయడం మేలు. వాటి బదులు ఫ్రూట్ జ్యూస్‌లు తాగితే మేలు. ఇలాంటి డ్రింక్స్ కూడా బాడీలో నీటిని కోల్పోయేలా చేస్తాయి. వీటిలోని కెఫైన్ శరీరానికి హాని చేస్తుంది. త్వరగా ముసలితనం వచ్చేలా చేస్తుంది.



కరువు జిల్లాపై కనికరం కరువు

(మొదటిపేజీ తరువాయి)

సందర్భంగానైనా ఈ ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పిస్తూ ప్రకటన చేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. జిల్లాకో నవోదయ పాఠశాల ఏర్పాటు చేసి పేదలకు నాణ్యమైన విద్య అందిస్తామని చెప్పారు. ముఖ్యంగా వనపర్తి, నారాయణపేట, నాగర్‌కర్నూల్ జిల్లాలకు రైల్వే లైను లేదు. మూడు జిల్లాల నుంచి పేదలు కర్నాటక, ముంబాయితో పాటు ఇతర దేశాలకు వలస పోతారు. రైల్వే సౌకర్యం లేక అవస్థలు పడుతున్నారు. పారిశ్రామికంగా ఎదగాలన్నా.. రైల్వే వ్యవస్థ ఉండాలి. రైల్వే లైను కోసం సర్వేలు తప్ప పనులు జరగడం లేదు. పరిశ్రమలు ఏర్పాటు చేయడం ద్వారా ఉపాధి కల్పిస్తామన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారం చేపట్టిన నాటి నుంచి తొమ్మిదేండ్ల కాలంలో పరిశ్రమల ఏర్పాటుపై దృష్టి పెట్టలేదు. ముఖ్యంగా పాలమూరు యూనివర్సిటీకి గ్రాంట్ ద్వారా నిధులు కేటాయించడంలోనూ వివక్ష చూపుతున్నారు.

మోడికి ఇల్లు లేదని..

ప్రధాని మోడీకి ఇల్లు లేదట... అందుకని పేదలకు ఇల్లు లేకున్నా.. అంతగా పట్టించుకోవద్దని ప్రధాని బహిరంగ సభల్లో చెబుతుండటం గమనార్హం. మధ్యప్రదేశ్‌లో బహిరంగ సభలోనే పేదల సొంతింటి కల నెరవేర్చాలనే విషయంలో మోడీ 'నాకే సొంతిల్లు' లేదని దాటవేసే ధోరణిప్రదర్శించారు. కేంద్రం తీసుకొచ్చిన ప్రధానమంత్రి ఆవాజ్‌యోజన పథకం ఆధ్వర్యంలో ఇప్పటి వరకు జిల్లాలో ఏ ఒక్కరికీ పక్కా ఇంటి నిర్మాణం జరగలేదు.

నాటి హామీలు ఏమయ్యాయి

ఎ. రాములు, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి, మహబూబ్‌నగర్

ఎన్నికలకు ముందు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ముందు అమలు చేయాలి. ప్రధాని మోడీ ఏ మొఖం పెట్టుకొని జిల్లాకు వస్తున్నారు. పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు జాతీయ హోదా లేదు. కేంద్రీయ, నవోదయ పాఠశాలలకు అంకురార్పణ లేదు. రైల్వే లైనుపై దృష్టి పెట్టడం లేదు. మోడీ జిల్లాకు వస్తున్న సందర్భంగా గతంలో ఇచ్చిన హామీలు అమలు అయ్యేలా చూడాలి.

చంద్రబాబు అరెస్టు దురదృష్టకరం

(మొదటిపేజీ తరువాయి)

కర్మాగారానికి శనివారం మంత్రి హరీశ్‌రావు భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. గతంలో ఆంధ్రాలో ఒక ఎకరా భూమి అమ్మితే తెలంగాణలో వందల ఎకరాల భూమి కొనేవారమని, నేడు పరిస్థితి మారిందని ఆంధ్రాలో వందల ఎకరాల భూములు అమ్మితే తెలంగాణలో ఎకరా భూమి వస్తుందని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఒక మంచి మాట అన్నారని గుర్తు చేశారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలోనే తెలంగాణ వచ్చిందని, రాష్ట్రంలో జై జవాన్ జై కిసాన్ అనే నినాదాన్ని నిజం చేశారని అన్నారు. రైతులను లక్షాధికారులను చేయాలని నాటి నినాదమని, అది నేడు కేసీఆర్ వల్ల నిజమైందని అన్నారు. 50 సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో రైతుల ఆత్మహత్యలు, ఎర్రబారిన నేలలు మిగిలాయని, గాలిలో దీపం లాగా కరెంటు ఉండేదని, సిగ్గు లేకుండా కాంగ్రెస్ నాయకులు కరెంటు సరఫరా పై వ్యాఖ్యలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. నేడు కేసీఆర్ పాలనలో నీటి తీరువాలేదని, కరెంటు బిల్లులు లేవని, ఉచిత కరెంటు ఇస్తున్నామని, రైతు బంధు ఇచ్చి ఆదుకుంటున్నామని, ఒక గుంట భూమి పంట ఎండిందా అని అన్నారు.

బీజేపీ, కాంగ్రెస్ పాలకులకు సోయి లేదు

బీజేపీ, కాంగ్రెస్ పాలకులకు సోయిలేక, దూరదృష్టి లేకపోవడంతోనే ప్రతి సంవత్సరం రూ.1.56 కోట్ల విలువైన మంచి నూనెను దిగుమతి చేసుకుంటున్నామని మంత్రి హరీశ్‌రావు అన్నారు. దేశంలో ఒక వ్యక్తి సంవత్సరానికి 19 కిలోల నూనె వాడుతున్నాడని, అందులో 40 శాతం మనదేశంలో ఉత్పత్తి అయితే, 60 శాతం ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నామని, అందుకు గత పాలకులకు ముందుచూపు లేకపోవడమే కారణమని అన్నారు. మన కూరల్లోకి విదేశీ నూనెలను ఉపయోగించాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎమ్మెల్యే సతీష్, ఎఫ్డిసి చైర్మెన్ ప్రతాపరెడ్డి, ఆయిల్ ఫెడ్ కమిషనర్ హనుమంతరావు, ఎండి సురేందర్ రెడ్డి, చైర్మెన్ రామకృష్ణారెడ్డి, కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, జెడ్పీ చైర్ పర్సన్ రోజా శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

(మొదటిపేజీ తరువాయి)

ఆశాలకు పారితోషికాల పేరుతో కేవలం రూ.9750 ఇస్తూ పని భారం మోపుతూ.. దేశంలోనే మూడు సార్లు పారితోషికాలు పెంచామని పాలకులు గొప్పలు చెబుతున్నారని విమర్శించారు. టార్గెట్లు, పని ఒత్తిడి వల్ల ఆశాలు చిన్న వయస్సులోనే బీపీ, షుగర్, థైరాయిడ్, గుండెపోటు వంటి రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈఎస్ఐ, పీఎఫ్, ఉద్యోగ భద్రత కల్పించాలని, 6 నెలల పీఆర్సీ బకాయిలు, 18 నెలల కరోనా రిస్క్ అలవెన్స్ వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఆశాలకు రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం వెంటనే యూనియన్‌తో చర్చలు జరిపి సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో సీఐటీయూ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.వెంకటేష్, ఐద్వా నగర కార్యదర్శి నాగలక్ష్మి, సీఐటీయూ నగర సహాయ కార్యదర్శులు మహేందర్, ఎం.సత్యనారాయణ, నాయకులు పి.మల్లేష్, ఆశా వర్కర్స్ యూనియన్ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు యాదమ్మ, ఎం.అనిత కోశాధికారి రాణి తదితరులు పాల్గొన్నారు.

రంగారెడ్డి జిల్లా తలకొండపల్లిలో ఆశాలు మానవహారంగా ఏర్పడ్డారు. రాజేంద్రనగర్‌లోని హైదర్‌గూడ చౌరస్తాలో ఆందోళన చేపట్టారు. వికారాబాద్ జిల్లాలో పరిగిలో ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలిపారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌక్‌లో మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. నిర్మల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట జాతీయ రహదారిపై మానవహారం నిర్వహించారు. ఆదిలాబాద్ జిల్లా దిలావర్‌పూర్, నర్సాపూర్(జి) మండలాల్లో ఆశా కార్యకర్తలు నిర్మల్-భైంసా జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. లోకేశ్వరంలో భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి మానవహారం నిర్వహించారు.

కరీంనగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట కండ్లకు నల్ల గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యలను నిరసిస్తూ చెవిలో పూలు పెట్టుకొని నిరసన తెలిపారు. ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలం పెద్దతండలో ప్రధాన రహదారిపై ఆశాలు మానవహారం చేపట్టారు. మధిరలో భారీ ర్యాలీ చేపట్టి నిరసన తెలిపారు. మధిరలో ఎమ్మెల్యే భట్టి విక్రమార్క సంఘీభావం తెలిపారు. భట్టికి ఆశాలు వినతి పత్రం అందజేశారు.

నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణంలో ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఆశాలు ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సమీపంలో మానవహారం నిర్వహించారు. మర్రిగూడలో సమ్మెకు మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సంఘీభావం తెలిపారు. నాంపల్లి మండలంలో ఆశాలు తహసీల్దార్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ తీశారు.

ఓట్ల కోసం పాట్లు..

(మొదటిపేజీ తరువాయి)

ఎమ్మెల్యేలు సెటిలర్ల 'బలాబలాల' గురించి ప్రత్యేకంగా ప్రస్తావించినట్టు తెలిసింది. వారి ఓట్లు లేకపోతే తాము ఎన్నికల్లో గెలవలేమంటూ అధినేత వద్ద తమ గోసను వెళ్లబోసుకున్నారు కాబోలు.. ఇప్పుడు మాట మార్చి సెటిలర్లను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు.

నష్ట నివారణా చర్యలు...

ఈ క్రమంలో పలు నియోజకవర్గాల్లో సెటిటర్ల బలాబలాలను పసిగట్టిన కేసీఆర్ ఆఘమేఘాల మీద నష్ట నివారణా చర్యలకు ఆదేశించారు. అందుకే కేటీఆర్ రంగంలోకి దిగి... సెటిలర్లను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. వాస్తవానికి ఖమ్మంలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణకు మంత్రి పువ్వాడ అజయకుమార్... తొలుత జూనియర్ ఎన్టీఆర్‌ను ఆహ్వానించారని వినికిడి. కానీ మారిన పరిస్థితుల నేపథ్యంలో కేటీఆర్ వ్యూహాత్మకంగా వ్యవహరించి, తానే ఆ సభకు ముఖ్య అతిథిగా హాజరై, ఎన్టీఆర్‌ను వేనోళ్లా కీర్తించారు. ఇదే సమయంలో అన్నగారిని, సీఎం కేసీఆర్‌ను పోలుస్తూ 'కేసీఆర్‌కు ఎన్టీఆర్ రాజకీయ గురువు...' అని చెప్పటం ద్వారా సెటిలర్లలో ఉన్న ఆగ్రహాన్ని, అనుగ్రహంగా మార్చుకునేందుకు ప్రయత్నించారని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. మరోవైపు సిద్ధిపేట కేంద్రంగా హరీశ్‌రావు సైతం చంద్రబాబు అరెస్టును తప్పుబట్టారు. మరి ఈ నష్ట నివారణా ప్రయత్నాలు ఫలిస్తాయా..? లేదా..? అన్నది ఎన్నికల తర్వాత గానీ తెలియదు.

ఆనాటి కేసీఆర్ మాటలు...

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఓ టెర్మినల్‌కు ఎన్టీఆర్ పేరు పెట్టాలనే ప్రస్తావన వచ్చినప్పుడు గతంలో అసెంబ్లీలో సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా పలువురు గుర్తు చేసుకుంటున్నారు. 'ఎన్టీఆర్ నాకు రాజకీయ గురువు. ఆయన ప్రోత్సాహంతోనే నేను నాయకుడిగా ఎదిగాను. కానీ ఒక ఆంధ్రా వ్యక్తి పేరును తెలంగాణ ప్రాంతంలోని టెర్మినల్‌కు ఎలా పెడతారు. మీరు అంతగా పెట్టాలనుకుంటే మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు పేరును ఆ టెర్మినల్‌కు పెట్టండి...' అంటూ కేసీఆర్ అప్పట్లో వ్యాఖ్యానించటం గమనార్హం.


బీజేపీ ఎంపీ అనుచిత తీరు

మహిళా ఎమ్మెల్యేపై చేతులు వేసి అసభ్య ప్రవర్తన

- సమావేశంలో అసౌకర్యానికి గురైన ఎమ్మెల్యే
- ఎంపీకి దూరంగా వెళ్లి కూర్చున్న వైనం
- యూపీలోని అలీఘడ్‌లో ఘటన.. వీడియో వైరల్
- ఎంపీ తీరుపై నెటిజన్ల ఆగ్రహం

లక్నో : ఇటీవల పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో మహిళల రిజర్వేషన్ బిల్లు ఆమోదించబడింది. మరోపక్క, బేటీ బచావో, బేటీ పడావో అంటూ మోడీ సర్కారు ప్రచారం చేసుకుంటున్నది. మహిళల భద్రత పట్ల తమకు చిత్తశుద్ధి ఉన్నదని పలు సార్లు బీజేపీ నాయకులు అనేక సమావేశాల్లో ప్రసంగాలు చేస్తున్నారు. అయితే, ఆ పార్టీకి చెందిన ఒక ఎంపీ.. మహిళా ఎమ్మెల్యే పట్ల వ్యవహరించిన తీరు ఇప్పుడు తీవ్ర వివాదాస్పదమవుతున్నది. మహిళా ఎమ్మెల్యే సమ్మతి లేకుండానే సదరు ఎంపీ ఆమె భుజాల మీద చేతులు వేసి అనుచితంగా ప్రవర్తించాడు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. బీజేపీ ఎంపీ తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆయన తీరును నెటిజన్లు తప్పుబడుతున్నారు. ఒక మహిళా ఎమ్మెల్యేపై అందరి ముందు ఒక ఎంపీ ఇలా చేతులు వేయటం ఏమిటనీ ప్రతిపక్షాలు సైతం ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నాయి.

ఈ ఘటన యూపీలోని అలీఘఢ్‌లో చోటు చేసుకున్నది. అలీగఢ్ ఎంపీ సతీశ్ గౌతమ్, స్థానిక ఎమ్మెల్యే ముక్తా రాజాలు కోల్ ప్రాంతంలో సెప్టెంబర్ 25న దీన్ దయాల్ ఉపాధ్యాయ జన్మదినం సందర్భంగా జరిగిన ఓ



కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇందులో సతీశ్ గౌతమ్.. ముక్తా రాజా చేతిలో చేయి వేసి నవ్వాడు. అనంతరం ఆమె భుజాలపై చేతులు వేశాడు. ఎంపీ తీరుతో మహిళా ఎమ్మెల్యే ఇబ్బందికరంగా భావించింది. అతనిని వెంటనే ఆ చర్య నుంచి నిరోధించింది. ఈ సమయంలో మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు, బీజేపీ నాయకులు అక్కడే ఉన్నారు. ఈ ఘటనతో వారంతా ఆశ్చర్యానికి లోనయ్యారు. ఎంపీ తనపై చేతులు వేయటంతో అసౌకర్యానికి గురైన మహిళా ఎమ్మెల్యే వెంటనే తన సీటును మార్చుకున్నది. ఎంపీ, ఎమ్మెల్యే మధ్యలో మరో బీజేపీ నాయకుడు కూర్చున్నాడు.

సోషల్ మీడియాలో ఆగ్రహం

వీడియో వైరల్ అయిన వెంటనే ప్రజలు బీజేపీ నాయకుడి అసభ్యకరమైన చర్యపై విస్తృతంగా విమర్శించారు. మహిళల భద్రతపై కాంగ్రెస్ ప్రశ్నలు లేవనెత్తింది. ఇది సంస్కారవంతమైన బీజేపీ వాస్తవికత అని కాంగ్రెస్ పార్టీ జాతీయ మీడియా ప్యానలిస్ట్ సురేంద్ర రాజ్‌పుత్ అన్నారు. సతీశ్ గౌతమ్ చర్యను బాధిత మహిళా ఎమ్మెల్యే వ్యతిరేకిస్తున్నట్టు చూపుతున్న ఘటనను కేరళ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ కూడా ఖండించింది.

పిల్లల గుండె ఆపరేషన్లు నిరంతర ప్రక్రియ

(మొదటిపేజీ తరువాయి)

సెంటర్‌లో యూకే డాక్టర్లకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీరప్ప మాట్లాడుతూ.. ఈ వారంలో కనీసం 500 మంది చిన్నారులకు స్క్రీనింగ్ చేసినట్టు తెలిపారు. చిన్నారుల్లో సమస్య తీవ్రతను గుర్తించి నిమ్స్‌లోని స్పెషాలిటీ బ్లాక్‌లో ప్రతి గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రూం నెంబర్ 10లో ప్రత్యేకంగా కార్డియాలజీ ఓపీ కన్సల్టేషన్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. డాక్టర్ అంబిరిస్ రావు మాట్లాడుతూ.. ఈ దఫా 15 ఆపరేషన్లను విజయవంతంగా పూర్తి చేశామని, మిగతా వారికి కూడా ఆపరేషన్లు నిరంతరంగా కొనసాగిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ గోపాల్, డాక్టర్ రమణ, వైద్యుల బృందం, చిన్నారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఐక్యంగా పోరాడాల్సిన సమయమిది

(మొదటిపేజీ తరువాయి)

మనం ఒక్కటైతే విజయం సాధించగలం' అన్నారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, మన భవిష్యత్తుకు ముప్పు పొంచి ఉందని, ఆర్‌ఎస్ఎస్‌కు ప్రజాస్వామ్యంపై నమ్మకం లేదని కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ విమర్శించారు. 'దాదాపు 100 ఏండ్లుగా ఆర్ఎస్ఎస్ తన కేంద్ర లక్ష్యాల నుంచి కదలలేదు. ముసుగు మారుతుంది. కానీ లక్షణం కాదు. ఆర్ఎస్ఎస్‌తో ఎప్పుడూ రాజీపడని పార్టీ కాంగ్రెస్' అని ఆయన అన్నారు.

సదస్సులో చర్చలను వివరిస్తూ సామాజిక కార్యకర్త యోగేంద్ర యాదవ్ ఎన్నికల్లో ఇండియా కూటమి విజయ సాధనకు కృషిచేయాలని తాము నిర్ణయించుకున్నామని అన్నారు. 'మేము వాలంటీర్లను రిక్రూట్ చేస్తాము. శిక్షణ ఇస్తాము. పర్యవేక్షిస్తాము. డిసెంబరు నాటికి వాలంటీర్లను ఏర్పాటు చేస్తాం' అని చెప్పారు. కమ్యూనిస్ట్ మార్క్సిస్ట్ పార్టీ (సీఎంపీ) నాయకుడు సీపీ జాన్ మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్య ధర్మాలను ధ్వంసం చేసిన శక్తులపై పోరాడాల్సిన సమయం ఇదేనని తీర్మానం స్పష్టం చేసిందన్నారు.

లిప్‌స్టిక్‌లు పెట్టుకున్నవాళ్లే...

(మొదటిపేజీ తరువాయి)

ముజఫర్‌పూర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో అబ్దుల్ బారీ మాట్లాడుతూ.. "మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందింది కాబట్టి ఇకపై లిప్‌స్టిక్‌లు పెట్టుకునే అడవాళ్ళు, బాబ్ కట్ చేసుకునే ఆడవాళ్ళు మహిళా రిజర్వేషన్ పేరు చెప్పి హంగామా చేయటం మొదలు పెడతారు చూడండి" అని అన్నారు. అయితే, ఈయన వ్యాఖ్యలపై స్వంత పార్టీ నేతలతో సహా ఇతర పార్టీల నుంచి సైతం విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామస్థులకు అర్థమయ్యే విధంగా చెప్పటం కోసం తాను అలా మాట్లాడాల్సి వచ్చిందని అబ్దుల్ బారీ తన వ్యాఖ్యలను సరి చేసుకునే ప్రయత్నం చేశారు. ఈ రిజర్వేషన్ బిల్లుకు మొదటి నుంచి తమ పార్టీ మద్దతిస్తున్నదని గుర్తు చేశారు. పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో ఆర్జేడీ బిల్లుకు మద్దతిచ్చిందనీ, అయితే బిల్లులో ఓబీసీలను చేర్చకపోవటంపై మాత్రం తమ పార్టీ తీవ్ర స్థాయిలో విభేదించిందని ఆయన చెప్పారు.

ఒకప్పుడు బీజేపీ నేతను...

- ఇప్పుడు గవర్నర్‌ను : డాక్టర్ తమిళిసై

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తాను ఒకప్పుడు బీజేపీ నేతనే తప్ప ప్రస్తుతం గవర్నర్‌నని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ తెలిపారు. చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ల బిల్లుకు రాష్ట్రపతి సంతకం చేసిన నేపథ్యంలో శనివారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో కృతజ్ఞత సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించినందుకు ప్రధాని మోడీకి కృతజ్ఞతలు తెలిపారు. మహిళా రిజర్వేషన్ల బిల్లు లింగ సమానత్వానికి సంబంధించి చరిత్రలో మైలురాయిగా నిలిచిపోతుందని ఆమె అభివర్ణించారు. తనపై రాళ్లు వేసేవారు, పూలువేసే వారుంటారనీ, వాటిని తాను పట్టించుకోకుండా ప్రజా సేవ చేస్తానని తెలిపారు.

పసిడి మోత

హాంగ్జౌ ఆసియా క్రీడల్లో మనోళ్లు పసిడి మోత మోగించారు. స్క్వాష్‌లో మెన్స్ జట్టు పసిడి పోరులో పాకిస్థాన్‌ను చిత్తు చేసి బంగారు పతకం గెల్చుకోగా.. టెన్నిస్‌లో మిక్స్‌డ్ డబుల్స్ ఈవెంట్‌లో రోహన్ బోపన్న, రుతుజ జోడీ స్వర్ణం సొంతం చేసుకుంది. దీంతో భారత్ పసిడి పతకాల సంఖ్య పదికి చేరుకుంది. అథ్లెటిక్స్‌లో స్ప్రింటర్లు ఒకే ఈవెంట్లో రెండు మెడల్స్ అందించగా, షూటింగ్‌లో మనకు మరో వెండి పతకం సొంతమైంది. ఓవరాల్‌గా 38 మెడల్స్‌తో పతకాల పట్టికలో భారత్ నాల్గో స్థానంలో కొనసాగుతుంది.

- స్క్వాష్‌లో మెన్స్ జట్టుకు స్వర్ణం
- టెన్నిస్‌లో బోపన్న, రుతుజకు గోల్డ్
- అథ్లెటిక్స్‌లో డబుల్ ధమాకా
- హాంగ్జౌ ఆసియా క్రీడలు 2023

నవతెలంగాణ-హాంగ్జౌ

స్క్వాష్‌లో టీమ్ ఇండియా ఉద్విగ్న పసిడి పతకం సొంతం చేసుకుంది. స్క్వాష్ మెన్స్ జట్టు విభాగంలో ఫైనల్స్‌కు చేరుకున్న టీమ్ ఇండియా.. పసిడి పోరులో దాయాది పాకిస్థాన్‌పై ఘన విజయం నమోదు చేసింది. ఫైనల్లో తొలి మ్యాచ్‌లో ఆధిపత్యం చెలాయించిన పాకిస్థాన్.. భారత్‌పై ఒత్తిడి పెంచింది. అయినా, చివరి రెండు మ్యాచులను అద్వితీయ రీతిలో గెల్చుకున్న భారత్ ఈ విభాగంలో పసిడి పతకం దక్కించుకుంది. తొలి రెండు మ్యాచుల అనంతరం భారత్, పాకిస్థాన్ 1-1తో సమవుజ్జీలుగా నిలిచాయి. దీంతో నిర్ణయాత్మక మూడో మ్యాచ్‌పై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. మూడో మ్యాచ్‌లో అభయ్ సింగ్ ఐదు గేముల మ్యాచ్‌లో మెరుపు విజయం అందించాడు. పాక్ ఆటగాడు జమాన్ నూర్‌పై 11-7, 9-11, 8-11, 11-9, 12-10తో కండ్లుచెదిరే విజయం సాధించాడు. తొలి గేమ్ నెగ్గిన అభయ్ సింగ్.. తర్వాత వరుసగా రెండు గేముల్లో నిరాశపరిచాడు. పాకిస్థాన్ పసిడికి మరో గేమ్ దూరంలో నిలిచిన తరుణంలో అభయ్ సింగ్ అద్భుతమే చేశాడు. చివరి రెండు గేముల్లో సత్తా చాటాడు. భారత్‌కు పసిడి పతకం అందించాడు. అంతకముందు తొలి మ్యాచ్‌లో మహేశ్ మనోహర్ నిరాశపరిచాడు. ఇక్బాల్ నజీర్‌కు 8-11, 3-11, 2-11తో వరుస గేముల్లో ఓటమి పాలయ్యాడు. కీలక రెండో మ్యాచ్‌లో భారత స్టార్ ఆటగాడు సౌరవ్ ఘోషల్ అదరగొట్టాడు. 11-5, 11-3, 11-2తో వరుస గేముల్లో మహ్మద్ ఆసీం ఖాన్‌ను చిత్తు చేశాడు. స్క్వాష్ మహిళల జట్టు విభాగంలో భారత్‌కు కాంస్య పతకం దక్కిన సంగతి తెలిసిందే.



పసిడి పరవశం: స్క్వాష్ మెన్స్ టీమ్ ఫైనల్లో పాకిస్థాన్‌పై చివరి మ్యాచ్‌లో ఉత్కంఠ విజయం సాధించిన ఆనందంలో అభయ్ సింగ్, భారత ఆటగాళ్లు

టెన్నిస్‌లో స్వర్ణం

పురుషుల డబుల్స్‌లో రజతంతో సరిపెట్టుకున్న భారత్.. మిక్స్‌డ్ డబుల్స్‌లో బంగారానికి తగ్గలేదు. భారత వెటరన్ ఆటగాడు రోహన్ బోపన్నతో కలిసి బరిలోకి దిగిన రుతుజ సంపత్‌రావు ఆసియా క్రీడల్లో స్వర్ణం సొంతం చేసుకుంది. పసిడి పోరులో చైనీస్ తైపీ జోడీ లియాంగ్, హుయాంగ్ జంటతో పోటీపడిన బోపన్న, రుతుజ జోడీ.. తొలి సెట్లో నిరాశపరిచారు. 33 నిమిషాల పాటు సాగిన తొలి సెట్‌ను 6-2తో చైనీస్ తైపీ జంట కైవసం చేసుకుంది. దీంతో రెండో సెట్లో తప్పక నెగ్గాల్సిన పరిస్థితి మనోళ్లకు ఏర్పడింది. 30 నిమిషాల్లోనే రెండో సెట్ లాంఛనం ముగించిన బోపన్న, రుతుజ 6-3తో స్కోరు సమం చేసింది. పసిడి పోరును నిర్ణయాత్మక టైబ్రేకర్ సెట్‌కు తీసుకెళ్లింది. టైబ్రేకర్‌లో 10-4తో సత్తా చాటిన బోపన్న, రుతుజ స్వర్ణం ముద్దాడింది. బోపన్న, రుతుజ జోడీ ఎనిమిది ఏస్‌లు, ఓ బ్రేక్ పాయింట్ సాధించారు. పాయింట్ల పరంగా భారత జోడీ 60-56తో చైనీస్ తైపీపై పైచేయి సాధించింది.



గురి తప్పలేదు: సరబ్జోత్, దివ్య

షూటింగ్‌లో మరో సిల్వర్

భారత షూటర్లు హాంగ్జౌ ఆసియా క్రీడల్లో చరిత్ర సృష్టించారు. 1986 ఆసియా క్రీడల్లో షూటర్లు భారత్‌కు 14 పతకాలు అందించగా.. తాజా ఆసియా క్రీడల్లో ఏకంగా 19 పతకాలు గెల్చుకున్నారు. శనివారం జరిగిన 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత్ వెండి పతకంతో మెరిసింది. యువ షూటర్లు సరబ్జోత్ సింగ్, దివ్య సుబ్బరాజు జోడీ సిల్వర్‌తో సత్తా చాటింది. 13, 14వ రౌండ్ వరకు 13-13, 14-14తో చైనా షూటర్లతో సమవుజ్జీగా నిలిచిన మనోళ్లు.. చివర్లో ఆతిథ్య చైనాకు పసిడి కోల్పోయారు. 15వ రౌండ్‌లో చైనా షూటర్లు 21.0, 10.7, 10.3 స్కోరు చేయగా.. భారత షూటర్లు 20.4, 9.9, 10.5తో కాస్త తడబడ్డారు. ఇక్కడే రెండు పాయింట్ల ఆధిక్యం సాధించిన చైనా బంగారు పతకం కైవసం చేసుకుంది. సరబ్జోత్ సింగ్, దివ్య సుబ్బరాజు జోడీ సిల్వర్ మెడల్ దక్కించుకుంది.

ట్రాక్‌లో డబుల్ ధమాకా

అథ్లెటిక్స్‌లో భారత్ జోరు కొనసాగుతుంది. తొలి రోజు పోటీల్లో కిరణ్ బలియన్ మహిళల షాట్‌పుట్‌లో పతకం సాధించి చరిత్ర సృష్టించగా.. శనివారం జరిగిన రేసుల్లో మెన్స్ 10000 మీటర్ల రేసులో భారత్‌కు ఏకంగా రెండు పతకాలు వచ్చాయి. కార్తీక్ కుమార్, గుల్వీర్ సింగ్‌లు రజత, కాంస్య పతకాలు దక్కించుకున్నారు. 28.15.38 సెకండ్లలో రేసు పూర్తి చేసిన కార్తీక్ కుమార్ సిల్వర్ మెడల్ సొంతం చేసుకున్నాడు. గుల్వీర్ సింగ్ 28.17.21 సెకండ్ల టైమింగ్‌తో కాంస్య పతకం దక్కించుకున్నాడు. 10000 మీటర్ల ఈవెంట్‌లో భారత్ చివరగా 1998లో మెడల్ సాధించింది. 1998లో గులాబ్ చంద్ కాంస్య నెగ్గగా..1978 బ్యాంకాక్‌లో హరిచంద్ పసిడి సాధించాడు. 1974లో శివనాథ్ సింగ్ (సిల్వర్), 1962లో తర్లోక్ సింగ్ (గోల్డ్), 1951లో గుర్బచాన్ సింగ్ కాంస్యంతో మెరిశారు. ఈ విభాగంలో పతకాల పంట పండించిన మన స్ప్రింటర్లు 1998 తర్వాత మెడల్ నెగ్గటం ఇదే ప్రథమం.



ట్రాక్ హీరోలు : కార్తీక్, గుల్వీర్ సింగ్

షట్లర్లకు సిల్వర్ ఖాయం!

భారత షట్లర్లు జట్టు విభాగంలో కనీసం రజతం ఖాయం చేసుకున్నారు. శనివారం జరిగిన సెమీఫైనల్లో భారత మెన్స్ జట్టు దక్షిణ కొరియాపై 3-2తో ఘన విజయం సాధించింది. సెమీస్‌లో తొలి మ్యాచ్‌లో హెచ్.ఎస్ ప్రణయ్ 18-21, 21-16, 21-19తో జియోన్‌పై గెలుపొంది శుభారంభం చేశాడు. రెండో మ్యాచ్‌లో సాత్విక్, చిరాగ్ జోడీ నిరాశపరిచింది. 13-21, 24-26తో సియో, కాంగ్‌ల చేతిలో పోరాడి ఓడింది. మూడో మ్యాచ్‌లో యువ షట్లర్ లక్ష్యసేన్ దుమ్మురేపాడు. 21-7, 21-9తో వరుస గేముల్లో ఏకపక్ష విజయం నమోదు చేసి భారత్‌కు 2-1 ఆధిక్యం అందించాడు. నాల్గో మ్యాచ్‌లో ఎంఆర్ అర్జున్, ధ్రువ్ జోడీ 16-21, 11-21తో నిరాశపరచగా స్కోర్లు 2-2తో సమం అయ్యాయి. నిర్ణయాత్మక మ్యాచ్‌లో భారత అగ్రశ్రేణి షట్లర్ కిదాంబి శ్రీకాంత్ అదరగొట్టాడు. మూడు గేముల మ్యాచ్‌ను 2-1తో గెలుపొందాడు. తొలి గేమ్‌లో 12-21తో తడబడినా.. 21-16, 21-14తో చెలరేగాడు. భారత్‌కు 3-2తో దక్షిణ కొరియాపై విజయాన్ని అందించాడు. మరో సెమీఫైనల్లో జపాన్‌పై చైనా 3-1తో గెలుపొంది ఫైనల్స్‌కు చేరుకుంది. నేడు జరిగే పసిడి పోరులో చైనా, భారత్ తలపడన్నాయి.



బోపన్న, రుతుజ పసిడి వెలుగు


హాకీ ఇండియా గ్రూప్ దశలో అజేయంగా నిలిచింది!. తొలుత సింగపూర్‌పై 16-0, జపాన్‌పై 4-2తో విజయాలు సాధించిన భారత్ తాజాగా పాకిస్థాన్‌ను 10-2తో చిత్తు చేసింది. గ్రూప్-ఏ మ్యాచ్‌లో పాక్‌పై పంజా విసిరిన హాకీ ఇండియా గోల్స్ వర్షం కురిపించింది. వరుణ్ కుమార్ (54, 41వ నిమిషం), లలిత్ ఉపాధ్యాయ్ (49వ నిమిషం), షంషేర్ సింగ్ (46వ నిమిషం), హర్మన్‌ప్రీత్ సింగ్ (34, 33, 17, 11వ నిమిషం), సుమిత్ (30వ నిమిషం), మన్‌దీప్ సింగ్ (8వ నిమిషం) గోల్స్ నమోదు చేశారు. పాకిస్థాన్ తరఫున రానా, ఎం.ఎస్ ఖాన్‌లు చెరో గోల్ కొట్టి ఊరట అందించారు. గ్రూప్ దశలో 2న బంగ్లాదేశ్‌తో భారత్ తలపడనుంది.

బాక్సర్ల దూకుడు

బాక్సింగ్‌లో మనోళ్లు సత్తా చాటుతున్నారు. తెలుగు తేజం నిఖత్ జరీన్ ఇప్పటికే పారిస్ ఒలింపిక్స్ బెర్త్‌తో పాటు పతకం ఖాయం చేసుకోగా ఆమె బాటలోనే లవ్లీనా బొర్గొహైన్, ప్రీతి నడిచారు. మహిళల 75 కేజీల విభాగం క్వార్టర్‌ఫైనల్లో వరల్డ్ చాంపియన్ లవ్లీనా బొర్గొహైన్ 5-0తో కొరియా బాక్సర్‌ను చిత్తు చేసింది. 30-27, 30-27, 30-27, 30-27, 30-27తో ఐదుగురు న్యాయమూర్తులు లవ్లీనా ఏకగ్రీవ విజేతగా ప్రకటించారు. మహిళల 54 కేజీల విభాగంలో ప్రీతి సైతం సెమీస్‌కు చేరుకుంది. కజకిస్థాన్ బాక్సర్‌పై 4-1తో విజయం సాధించింది. మెన్స్ 91 కేజీల విభాగంలో నరేందర్ 5-0తో ఇరాన్ బాక్సర్‌ను చిత్తు చేసి సెమీస్‌కు చేరుకున్నాడు. లవ్లీనా, ప్రీతి, నరేందర్‌లు సెమీఫైనల్లోకి ప్రవేశించి పతకంతో పాటు పారిస్ ఒలింపిక్ బెర్త్‌ను ఖాయం చేసుకున్నారు.

20న హెచ్‌సీఏ ఎన్నికలు

11 నుంచి నామినేషన్ల స్వీకరణ
ఎన్నికల షెడ్యూల్ ప్రకటన



నవతెలంగాణ-హైదరాబాద్ : ఎట్టకేలకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఎన్నికల నగారా మోగింది. అక్టోబర్ 20న హెచ్‌సీఏ ఆఫీస్ బేరర్ల ఎన్నికకు శనివారం ఎలక్షన్ నోటిఫికేషన్ విడుదలైంది. అక్టోబర్ 20న ఎన్నికలు జరుగనుండగా.. 11 నుంచి 13 వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. 14న నామినేషన్ల పరిశీలన, 16న నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువుగా ఎన్నికల అధికారి, భారత ఎన్నికల కమిషన్ మాజీ చీఫ్ కమిషనర్ వి.ఎస్ సంపత్ ఓ ప్రకటనలో వెల్లడించారు. 20న జరిగే ఎన్నికల్లో అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, కోశాధికారి పదవులకు అవసరమైతే ఓటింగ్ నిర్వహించి, అదే రోజు ఫలితాలు వెల్లడించనున్నారు. సుప్రీంకోర్టు నియమిత ఏకసభ్య కమిటీ జస్టిస్ లావు నాగేశ్వరరావు ఇదివరకే బహుళ యాజమాన్య ఆధీనంలోని క్లబ్‌లకు తాజా ఎన్నికల్లో ఓటు హక్కు రద్దు చేసిన సంగతి తెలిసిందే. హెచ్‌సీఏ అనుబంధ క్లబ్‌లు, సంస్థలు, మాజీ క్రికెటర్లతో కలిపి 173 మందికి ఓటు హక్కు కల్పించారు. ఈ మేరకు పూర్తి వివరాలను హెచ్‌సీఏ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు.



హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ టోర్నీ షురూ

హైదరాబాద్ : 14వ హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్ ఘనంగా ఆరంభమైంది. మాదాపూర్‌లోని ఎన్‌వీకే టెన్నిస్ అకాడమీలో సైబరాబాద్ పోలీసు కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర శనివారం పోటీలను అధికారికంగా ప్రారంభించారు. పురుషుల సింగిల్స్, డబుల్స్‌లో ఈవెంట్లలో 30, 40, 50, 60, 70 ప్లస్ వయో విభాగాల్లో పోటీలు నిర్వహిస్తుండగా, మహిళలు ఓపెన్ విభాగంలో పోటీపడనున్నారు. ఓపెన్ విభాగంలో మిక్స్‌డ్ డబుల్స్‌లో ఈవెంట్‌ను గత సీజన్ నుంచి నిర్వహిస్తున్నారు. దేశవ్యాప్తంగా 451 మంది టెన్నిస్ క్రీడాకారులు పోటీపడుతున్న ఈ టోర్నమెంట్ అక్టోబర్ 2న అన్ని విభాగాల్లో ఫైనల్స్‌తో ముగియనుందని హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ సంఘం (హెచ్‌ఓటీఏ) ఫౌండర్ ప్రెసిడెంట్ నంద్యాల నర్సింహారెడ్డి తెలిపారు. టోర్నీలో పోటీపడుతున్న క్రీడాకారులకు నాలుగు రోజుల పాటు ఉచిత వసతి, భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు. సింగిల్స్ విభాగంలో 303, డబుల్స్ విభాగంలో 149 మంది టైటిల్ వేటలో బరిలోకి దిగుతుండగా.. విజేతలకు రూ. 5 లక్షల భారీ నగదు బహుమతి ఇవ్వనున్నట్టు నిర్వాహకులు ప్రకటించారు. కార్యక్రమంలో సైబరాబాద్ డిప్యూటీ కమిషనర్ జి. ప్రదీప్, పి.వి రావు, హరికష్ణా రెడ్డి, ఏ.ఆర్ రావు, సదాశివా రెడ్డి, అనిరుధ్, లగ్గాని శ్రీనివాస్, జె.వి రమణ తదితరులు పాల్గొన్నారు.

భారత్, ఇంగ్లాండ్ వార్మప్ వర్షార్పణం

గువహటి : 2023 ఐసీసీ ప్రపంచకప్‌పై వాతావరణ ప్రభావం పడుతోంది!. తిరువనంతపురంలో దక్షిణాఫ్రికా, అఫ్ఘనిస్థాన్ మ్యాచ్ ఇప్పటికే వర్షం కారణంగా రద్దు కాగా.. తాజాగా భారత్, ఇంగ్లాండ్ వార్మప్ సైతం వరుణుడి ఖాతాలో పడింది. డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లాండ్‌తో వార్మప్‌తో ప్రపంచకప్ వేటలోకి పడిపోదామని ఆతిథ్య భారత్ ఆశించినా.. గువహటిలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం ప్రణాళికలను తలకిందులు చేసింది. దీంతో టాస్ పడకుండానే వార్మప్ మ్యాచ్ రద్దయ్యింది. మంగళవారం తిరువనంతపురంలో నెదర్లాండ్స్‌తో టీమ్ ఇండియా రెండో వార్మప్ ఆడనుంది.

నవచిత్రం



మోహన్‌లాల్

లూసిఫర్ 2తో లైకా ప్రొడక్షన్స్ మాలీవుడ్ ఎంట్రీ

మోహన్‌లాల్, పృథ్వీరాజ్ సుకుమారన్ కాంబినేషన్‌లో రూపొందిన 'లూసిఫర్' సినిమా ఎంతటి ఘన విజయాన్ని సాధించిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇదే చిత్రాన్ని తెలుగులో 'గాడ్‌ఫాదర్'గా రీమేక్ చేసి చిరంజీవి సైతం ఘనం విజయం సాధించారు. ఇప్పుడు దీనికి కొనసాగింపుగా 'ఎల్2ఇ: ఎంపురాన్' చిత్రం ఇదే కాంబోలో తెరకెక్కనుంది. అయితే ఈ సినిమా ఆంటోని పెరంబవూర్ చైర్మన్‌గా కొనసాగుతున్న ఆశీర్వాద్ సినిమాస్ బ్యానర్‌తో పాటు ప్రముఖ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ కలయికలో జి.కె.ఎం.తమిళ్ కుమరన్ నేతృత్వంలో రూపొందనుండటం విశేషం.

'సంస్కృతి, సాంప్రదాయలకు విలువనిచ్చే మాలీవుడ్‌లోకి లైకా ప్రొడక్షన్స్ సంస్థ అధినేత సుభాస్కరన్ అడుగుపెట్టడం ఆనందంగా ఉంది. అలాగే లైకా ప్రొడక్షన్స్ మలయాళంలో సినిమాలు తీయటానికి సిద్ధమవటం అనేది చిత్ర పరిశ్రమ అభివృద్ధికి ఎంతో దోహదం చేయటమే కాదు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సినీ అభిమానులకు ఎన్నో కొత్త కథాంశాలతో సినిమాలను చూసే అవకాశాలను కలిగించొచ్చు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ కోసం మాతో చేతులు కలపడం ఆనందంగా ఉంది' అని ఆశీర్వాద్ సినిమాస్ సంస్థ పేర్కొంది.

మంచు విష్ణు 'కన్నప్ప'లో మోహన్ లాల్

హీరో మంచు విష్ణు పాన్ ఇండియా సినిమాగా నిర్మిస్తున్న చిత్రం 'కన్నప్ప'. అవా ఎంటర్‌టైన్‌మెంట్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్‌లపై 'మహాభారత్' సిరీస్ ఫేమ్ ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు.
ఈ సినిమాలో ప్రభాస్ ఓ ముఖ్య పాత్రను పోషించబోతున్న విషయం తెలిసిందే. తాజాగా మరో స్టార్ మోహన్ లాల్ సైతం ఇందులో ఓ ముఖ్య పాత్రలో కనిపించబోతున్నారు. ప్రస్తుతం 'కన్నప్ప' టీం న్యూజిలాండ్‌లో ఉంది. పరుచూరి గోపాలకృష్ణ గారు, విజయేంద్ర ప్రసాద్, తోటపల్లి సాయి నాథ్, తోట ప్రసాద్, నాగేశ్వర రెడ్డి, ఈశ్వర్ రెడ్డి.. తదితరులు ఈ స్క్రిప్ట్‌ను అద్భుతంగా మలిచారని మంచు విష్ణు చెప్పారు.

సర్‌ప్రైజ్ చేసే సినిమా



ఇషా రెబ్బా

సుధీర్ బాబు, హర్షవర్ధన్ కలయికలో తెరకెక్కిన యాక్షన్ థ్రిల్లర్ 'మామ మశ్చీంద్ర'. శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పిపై సునీల్ నారంగ్, పుస్కుర్ రామ్ మోహన్ రావు నిర్మించారు. తెలుగు, హిందీ భాషల్లో రూపొందిన ఈ ద్విభాషా చిత్రాన్ని సృష్టి సెల్యులాయిడ్ సోనాలి నారంగ్, సృష్టి సమర్పిస్తున్నారు. ఈనెల 6న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తున్న సందర్భంగా నాయిక ఈషా రెబ్బా మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.
'హర్షవర్ధన్ దర్శకత్వంలో ఈ సినిమా చేయటం, ఇందులో విశాలాక్షి పాత్రకు నేను అయితే బావుంటుందని హీరో సుధీర్ బాబు నాపేరు సజెస్ట్ చేయటం హ్యాపీగా అనిపించింది. ఇది చాలా మలుపులు, ఎంటర్‌టైనర్‌మెంట్ ఉన్న కథ ఇది. ఇందులో ప్రతి పాత్రకు ప్రాముఖ్యత ఉంటుంది. అలాగే ఒక బ్యాక్ స్టోరీతోపాటు ప్రతి పాత్రకు లేయర్స్ ఉన్నాయి. సుధీర్ బాబు ట్రిపుల్ రోల్ లుక్స్‌తో పాటు డైలాగ్స్ కూడా భిన్నంగా ఉంటాయి. మూడు పాత్రల్లో ఆయన అద్భుతంగా నటించారు. ఇక ప్రతి పది నిమిషాలకు ఒక సర్‌ప్రైజ్ చేసే ఎలిమెంట్ ఉంది. మృణాలిని రవితో పని చేయడం మంచి అనుభవం. ప్రస్తుతం తమిళంలో విక్రమ్ ప్రభు ప్రాజెక్ట్ చేస్తున్నాను. తెలుగులో మరో మూవీ త్వరలోనే స్టార్ట్ అవుతుంది' అని ఈషా తెలిపింది.

ఇందులో నా పాత్ర పేరు వైరల్ విశాలాక్షి, టిక్ టాక్ వీడియోలు చేసే పాత్ర. ఇలాంటి పాత్ర చేయడం నాకు చాలా కొత్త. వైరల్‌గా ఉండే వీడియోస్ చేసే నా పాత్ర చాలా హైపర్‌గా ఉంటుంది.

అద్భుతమైన లైఫ్ డ్రామా



యశ్వంత్ ములుకుట్ల

నవీన్ చంద్ర, స్వాతిరెడ్డి ప్రధాన పాత్రలలో నటించిన చిత్రం 'మంత్ ఆఫ్ మధు'. దర్శకుడు శ్రీకాంత్ నాగోతి ఈ చిత్రానికి రచన, దర్శకత్వం వహించగా, క్రిషివ్ ప్రొడక్షన్స్, హ్యాండ్‌పిక్డ్ స్టోరీస్ బ్యానర్ పై యశ్వంత్ ములుకుట్ల నిర్మించారు. ఈ చిత్రం ఈనెల 6న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానున్న నేపథ్యంలో నిర్మాత యశ్వంత్ మీడి యాతో మాట్లాడుతూ, 'ఇదొక ఒక లైఫ్ డ్రామా. ప్రతి ఒక్కరి లైఫ్‌లో హనీమూన్ పీరియడ్ బ్యూటీఫుల్‌గా ఉంటుంది. అయితే అది లైఫ్ లాంగ్ ఉండాలని లేదు. దీనితో పాటు ఎత్తుపల్లాలు ఉంటాయనేది వాస్తవం. ఈ వాస్తవాన్ని చూపించే ప్రయత్నం చేసేది ఈ చిత్రం. ఇందులో ఓ పాత్రకు అమెరికా నుంచి వచ్చిన అమ్మాయి కావాలి. అలాగే నటన కూడా వచ్చి ఉండాలి. అందుకే శ్రేయాని ఎంపిక చేశాం. ఈ పాత్రను తను చాలా అద్భుతంగా చేసింది. ఇక నవీన్‌చంద్ర, స్వాతిరెడ్డి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఇది గొప్ప థియేటర్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే సినిమా. దాదాపు అన్నీ లైవ్ లోకేషన్స్‌లో సింక్ సౌండ్‌తో షూట్ చేశాం. అచ్చు రాజమణి అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. ఆడియన్స్‌కి ఖచ్చితంగా ఒక డిఫరెంట్ అనుభూతినిస్తుంది. ముఖ్యంగా ఈ సినిమా స్క్రీన్ ప్లే చాలా కీలకంగా ఉంటుంది. దీన్ని రవికాంత్ అద్భుతంగా చేశారు. ఈనెల 6న ఎక్కువ సినిమాలు విడుదలవుతున్నప్పటికీ మాకు థియేటర్స్ సమస్య లేదు. ఎన్ని రిలీజ్ అవుతున్నా మన ఆడియన్స్ ఎవరు అనేది ఎంపిక చేసుకోవడం చాలా ముఖ్యం. మా ఆడియన్స్‌ని ఇప్పటికే మేం ఎంపిక చేసుకున్నాం. మా జోనర్ చాలా డిఫరెంట్. ట్రైలర్ రిలీజ్ తర్వాత బజ్ పెరిగింది. బిజినెస్ పరంగా కూడా హ్యాపీగా ఉన్నాం' అని అన్నారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886

మహిళా బిల్లు

ఇలలో
సగమయిన మహిళ
ఇంటికే
పరిమితం కావాలా!

వంటగదిలో
గరిట తిప్పడం కాదు
ఇల్లునంతా
సగబెడుతుంది!

ఆలి అయి
ఇల్లు నేలుతుంది
తల్లి అయి
పిల్లలను లాలిస్తుంది!

సగభాగం
తను అయినపుడు
సమ భాగం
ఆమెకివ్వడం సమంజసం!

అవకాశం కల్పిస్తే
ఆకాశమంత ఎదిగి చూపిస్తది
ఆడబిడ్డ నుదుట పెట్టిన
బొట్టుబిల్ల
ఈ మహిళా బిల్లు!

ఇకపై మహిళ.....
కుక్కిన పేను కాదు
పులిపై ఎక్కిన దుర్గ!

- జగ్గయ్య.జి,
9849525802



కన్నీళ్ల ఆనకట్ట..

నీ అంతులేని వ్యథను చూసి
మనసెంతో గాయపడింది
జన జీవనస్రవంతిలో కలిశాక
నా భావోద్వేగాలు గుండె గూటిలో
భద్రంగా ఉండినాయి..

గత కొన్ని రోజుల నుండి
అవి ఘనస్థితిలోనే ఉండి
మళ్ళీ ఇవ్వాళ తమ
వాస్తవస్థితికి తిరిగిచేరుకున్నాయి..

నిను చూడలేని
కష్టకాలంలో కనుచూపుమేరలో
కన్నీళ్ల ప్రవాహం
ఉరకలెత్తి ప్రవహించింది..

కానీ చాలారోజులకు
నిను చూశాక కూడా ఎందుకో..
అవి
ఇవ్వాళ తమ ఆనకట్టను తెంపి
కిందికి దూకుతున్నాయి..

నువ్వొక్కడివే తనతో
కలిస్తే సరిపోతుందా...
మేము కూడా తనను
కలిసేవాళ్లమని నా హృదయంతో
పొట్లాడి కిందికి ధారగా దూకుతున్నాయి..

- సర్ఫరాజ్ అన్వర్
9440981198



పది రూపాయల డాక్టరమ్మ...

సమాజ సేవే పరమావధిగా భావించింది ఆ యువ వైద్యురాలు.. ఎవరో వస్తారు.. ఏదో చేస్తారని.. అని ఎదురుచూడలేదు. సంకల్పంతో ముందడుగు వేసి తన కలను సాకరం చేసుకుంటోంది. సామాజ సేవకు ఎలాంటి తారతమ్యం అవసరం లేదని గళమెత్తుతోంది. బడుగు బలహీన వర్గాలకు నాణ్యమైన వైద్యసాయమందించడమే తన కర్తవ్యమంటూ అందరి మన్ననలు పొందుతోంది పాతికేళ్ల యువ వైద్యురాలు **నూరి పర్వీన్**. పేదలకు సాయపడడంలో, సమాజసేవలో తాత ముందుండేవారని తండ్రి చెప్పిన మాటలు వింటూ పెరిగింది. పెరిగి పెద్దై తాను కూడా ఆ బాటలోనే నడుస్తోంది. అయితే ఇప్పుడు ఆమె గుర్తింపు ఆ తాత మనవరాలిగా కాదు... 10 రూపాయల వైద్యురాలుగా నూరీ పర్విన్‌గా ఎంతోమందికి పరిచితం.

నూరీ స్వస్థలం విజయవాడ ఆటోనగర్. వన్‌టౌన్ మౌలానా ఆజాద్ ఉర్దూ స్కూలులో పదవతరగతి వరకు చదివింది. ఆ తరువాత ఓ ప్రైవేటు కాలేజీలో ఇంటర్ పూర్తిచేసింది. కడప ఫాతిమా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ (ఎఫ్ఐఎంఎస్)లో ఎంబిబిఎస్ సీటు రావడంతో వైద్యవిద్య పూర్తిచేసింది. కోర్సు మొదటి సంవత్సరం నుంచే ఎఫ్ఐఎంఎస్ విద్యార్థి ఆర్గనైజేషన్ ద్వారా పలు వృద్ధాశ్రమాలకు, అనాథాశ్రమాలకు వెళ్లి సేవలు చేసింది. అప్పుడే వైద్యం కోసం పేదలు పడే ఇబ్బందులు ఆమె దృష్టికి వచ్చాయి. ఎలాగైనా పేదలకు అందుబాటులో వైద్యం అందించాలన్న సంకల్పంతో కడప మాసాపేట సర్కిల్ పెద్ద దర్గా రోడ్డులో ఓ ప్రైవేట్ క్లినిక్ తెరిచింది. చాలా చిన్న క్లినిక్ అది. అక్కడికి వచ్చే రోగులకు నామమాత్రంగా పది రూపాయల ఫీజే తీసుకుంటుంది. బెడ్ అవసరమైన వారికి రూ.50, రూ.500లోపే మందులు అక్కడ లభిస్తాయి. ఐదుగురు సిబ్బందితో 24 గంటలూ పనిచేస్తోంది ఆ క్లినిక్. రోజుకు 50 మంది వరకు రోగులు ఆ క్లినిక్‌కు వస్తున్నారు. 'గది అద్దె, సిబ్బంది జీతభత్యాల కోసమే ఈ ఫీజు వసూలు చేస్తాం' అంటోంది ఆమె. అంత తక్కువ ఫీజు ఎందుకంటే 'నా లక్ష్యం డబ్బు సంపాదించడం కాదు.. సేవ చేయడం' అంటుంది ఈ యువ డాక్టరు. ఆ ప్రాంతం వారికి 10 రూపాయల డాక్టరమ్మగా ఆమె సుపరిచితురాలు. ఏడాది కాలంలోనే అంత పేరు తెచ్చుకుంది నూరీ పర్విన్.

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగుల బెడ్ ఛార్జీలను రోజుకు ఆమె రూ.50 మాత్రమే ఛార్జ్ చేస్తోంది. ఇలా రోజుకు పర్వీన్ 50 నుంచి 60 మందికి వైద్య సేవలను అందిస్తూ కడప ప్రాంతంలో సుపరిచితురాలిగా మారింది నూరి పర్వీన్. దీంతోపాటు ఆమె ఇతర సేవ కార్యక్రమాలను కూడా ఆమె ముందుండి నడిపిస్తుంటుంది.

కోవిడ్‌కు సరిగ్గా నెల రోజుల ముందే అంటే 2020 ఫిబ్రవరి 7న క్లినిక్ ప్రారంభించింది. తన దగ్గరకు వచ్చే రోగులకు ఓ ఎంబిబిఎస్ డాక్టరుగా వీలైన చికిత్స ఇస్తూనే ఇతర వైద్య అవసరాల నిమిత్తం ప్రముఖ వైద్య నిపుణుల దగ్గరకు పంపిస్తుంది. అలా ఆమె దగ్గరకు వచ్చిన ఎంతో మంది రోగులు సకాలంలో మెరుగైన చికిత్స తీసుకుని వ్యాధి నయం చేసుకున్నారు. ఆరోగ్యవంతులుగా తిరిగివస్తున్న రోగుల ముఖాలు చూస్తుంటే ఇంత చిన్న క్లినిక్‌లో ఏమాత్రం వైద్యం అందుతుంది అని విమర్శించేవాళ్ల నోర్లు మూతపడుతున్నాయి.

ఆదర్శ కుటుంబం

నూరీ తాతగారు నూర్ మహమ్మద్. 1980లో వామపక్ష నాయకుడుగా ప్రజా సేవలో నిమగ్నమైన ఆయన నూరీ తండ్రి చిన్నప్పుడే మరణించారు. అయితే పిల్లలకు తండ్రి గొప్పతనం గురించి ఆయన తరచూ చెబుతుండేవారు. అలా తాత సేవగుణాన్ని వింటూ పెరిగిన ఆమె ఆయన వారసత్వాన్ని పుణికి పుచ్చుకుంది. సామాన్య కుటుంబంలో ఒకరు వైద్యవిద్య అభ్యసించడమే కష్టమైన ఈ రోజుల్లో నూరీ తండ్రి తన ముగ్గురు బిడ్డలనూ వైద్య విద్యార్థులుగా తీర్చిదిద్దారు. 'తండ్రి జ్ఞాపకార్థమే నాకు ఆయన పేరు పెట్టారు' అంటుంది నూరీ. అలా ఆ తాత సేవాతత్పరత... తండ్రి క్రమ శిక్షణలో పెరిగిన నూరీ తల్లిదండ్రులు మెచ్చే బిడ్డగానే కాక... తాత పేరు నిలబెట్టిన మనవరాలిగా ఎదిగింది.



లాక్‌డౌన్ సమయంలో ...

'లాక్‌డౌన్ కాలంలో క్షణం తీరిక లేకుండా గడిపాను. నుంచోడానికి, చివరికి మంచీనీళ్లు తాగేందుకు కూడా సమయం ఉండేది కాదు. వాస్తవానికి లాక్‌డౌన్ వల్ల క్లినిక్ ప్రారంభించిన నెలరోజులకే మూసేయాల్సి వచ్చింది. అయితే రెండు రోజులు కూడా నేను ఖాళీగా కూర్చోలేకపోయాను. అప్పటికే నాకు ఎన్నో ఫోను కాల్స్ వచ్చేవి. జ్వరం, దగ్గుతో బాధపడుతూ కోవిడ్ భయంతో ఎంతోమంది రోగులు నన్ను సంప్రదించేవారు. పెద్ద పెద్ద క్లినిక్‌ల వారు సిటీ స్కాన్ తీయించుకోమంటున్నారని, ఆర్థికంగా అంత భారం మోయలేక పోతున్నామని చెప్పేవారు. ప్రతి జ్వరమూ, దగ్గు కోవిడ్ కాదని వారికి ధైర్యం చెప్పి క్లినిక్‌లోనే మందులు ఇచ్చేదాన్ని. అను మానమున్న వారిని పరీక్షలకు పంపించే దాన్ని. అంతేగాని వైద్యం చేయడానికి నిరాకరించేదాన్ని కాదు. వైద్యవృత్తి సేవా గుణంతో నిండి ఉండాలి. ప్రతిదీ వ్యాపారమైన ఈ రోజుల్లో కొంతమంది ఈ కోవిడ్ సమయంలో లాభార్జన కోసం అధిక ఫీజులకు వైద్య పరీక్షలు, చికిత్సలు చేయడం నాకు తెలుసు. తాతయ్య స్ఫూర్తి నాపై ఉంది. పేదలకు సాయం చేయాలని చిన్నప్పటి నుంచి అమ్మ, నాన్న చెప్పేవారు. ఆ మాటలే నన్ను ఈ మార్గం వైపు నడిపించాయి. క్లినిక్ మొదలుపెట్టే సంగతి నా తల్లిదండ్రులకు మొదట చెప్పలేదు. ఎంబిబిఎస్ చదివి 10 రూపాయలకు వైద్యం చేయడమేంటని అంటారని వారికి చెప్పలేదు. కాని విషయం చెప్పగానే ఎంతో సంతోషించారు. నన్ను ఎంతగానో ప్రోత్సహించారు. ఇప్పుడు నేను నూర్ మహ్మద్ మనవరాలిగా కాదు, 10 రూపాయల డాక్టరు నూర్ పర్విన్‌గా సొంత పేరు తెచ్చుకున్నాను' అంటారు ఆమె. తన సేవకు గుర్తింపుగా పలు స్వచ్ఛంద సంస్థలు ఎన్నో అవార్డులు ఇచ్చాయి. అయితే వాటన్నిటికంటే పేదలకు సేవ చేయడమే సంతృప్తినిస్తుంది అంటుంది ఆమె.

బహుముఖ ప్రజ్ఞ

చిన్నప్పటి నుంచి చదువులో ముందుండే నూర్ సాధించిన ఘనత ఆమె చదివిన స్కూలు పిల్లలకు స్ఫూర్తిమంత్రమైంది. ఉర్దూ పాఠశాల ఉపాధ్యాయులు ఆమె సేవాగుణాన్ని ప్రశంసిస్తూ ఫోన్లు చేస్తుంటారు. అక్కడి విద్యార్థులు తనను కలుసుకోవాలనుకుంటున్నారని, కాని తీరిక లేని పని ఒత్తిడితో వారిని కలవలేకపోతున్నానని అంటారు నూర్. రెండు సంవత్సరాల క్రితం ఓ 20 షార్ట్‌ఫిలిమ్స్ చేశారు. వరకట్న సమస్యలు, ఆత్మహత్యలు, స్త్రీ వివక్ష వంటి వాటిపై తీసిన ఆ డాక్యుమెంటరీలను దర్శకత్వం చేయడమే కాదు, వాటిలో నటించారు నూర్. భవిష్యత్తులో పేదల కోసం ఓ మల్టీస్పెషాలిటీ హాస్పటల్ తెరవాలని, అందులో కూడా తక్కువ ఖర్చుతోనే వైద్యం అందించాలని కలలు కంటున్నారు. ఆమె కల తప్పక నెరవేరాలని మనమూ కోరుకుందాం. వైద్యం వ్యాపారమైన ఈ రోజుల్లో సేవే ప్రధానంగా సాగుతున్న ఆమె మార్గం స్ఫూర్తిదాయకం.

- మోహన్‌కృష్ణ అనంతోజు



పయనం...

విన్నాను...
ఆకలైన పేగులలో
దాగిన అలసత్వాన్ని..
పిడికెడు మట్టిలో ఆవిరైన నా మనోవేదనని....

చూస్తున్నాను...
మల్లె మొగ్గ లాంటి నా కనులలో
మెరిసే మెరుపులను
ఏ సంధ్య కిరణం కసిగా కోసేసిందని...

అడుగుతున్నాను...
ఈ కాలాన్ని...
నాలుగు చుక్కల కన్నీటితో
కడుపు నింపుకోవడం ఎలా అని...?

వెదుకుతున్నాను....
మనసు మాటున దాగిన మాటలను
ఏ మరు భూమిలో మర్మంగా దాచానని...

ఏరుతున్నాను...
ఎండిపోయిన ఊబిలో
ఎగసి ఎగసి వచ్చే
ఆశల బుడగలని...

దేహిస్తున్నాను....
దౌర్జన్యపు రాజకీయ కుట్రలో
విరిగిన మొక్కల మొండలను...
అమ్ముడు పోయిన ఒట్లెన్ని
కసాయి కత్తులుగా మారాయని...

చేరుతున్నాను...
కనిపించని కీర్తిని చేతపట్టి
నాలుగు భుజాల పై...
రారాజుగా ఊరేగుతూ...
అందరూ కన్నీటి పూలనీ వర్షంగా కురిపిస్తుంటే..
భూతల్లి ఒడిలో సేదతీరుతూ
మట్టి పాలని తాగడానికి..
మరో ప్రపంచానికి పయనమవుతున్నను.....!!

- గోపి.జి, 9052871896

నింగిలోని రంగులు

నగరాన్ని పులుమున్న
సమావేశాలలో సక్కగా సూపుడు కాదు..
బుగులు లేని బతుకు కావాలి..



నగ్నంగా దేశాన్ని బజారున బెట్టిన
మౌనం దేనికి సంకేతం..

లౌకిక పునాదులు ఊడబెరుకడం
గాలిలో పేకమేడలే..
నీటి మీద రాతలే..
అన్ని రోజులు అందలం అసాధ్యం
అందిన కాడికి దండుకునుడు
ఏదో రోజు జైలుకు వెళ్ళడం తథ్యం.

మనిషిని మనిషిగా
మార్చే పవనాలు వీచెలా
మానవత కుసుమాలు
భరత వృక్షానికి పూసెలా
ఆ వైపుగా సట్టాలు చేసేలా
ఉండాలి మీ ఆలోచనలు...
అప్పుడే సమ్మిట్ లకు అర్థం..పరమార్థం.

- నాగరాజు మద్దెల, 6301993211

మనసు....??



ఎన్నో కలలు
కలలనే వెంటాడుతుంటే
కాలం కత్తి లా
గుచ్చుకుంటుంది...

మనసు మబ్బుల్లా
దూది పింజమ్లా తెలుతుంటే
వ్యధ భారం బరువెక్కి
చీకటి వెలుగును కమ్మేస్తుంది...

వెక్కి వెక్కి ఏడుస్తున్న కళ్లు
కన్నీళ్లు నిండుకొని
ఆనందం పోయి
హృదయం బరువెక్కి
ఎండుటాకుల రాలిపోతుంది...

స్వప్నాల్ని నిజం చెయ్యలేదని
మనసు ఆత్మహత్య కు
సిద్ధమౌతుంటే
శరీరం బెలగా నిస్తేష్టులై
కాళ్ళు పుడమిపై కూలబడుతుంటే
ఆకాశం నిండుగా కన్నీళ్లు కురిపిస్తూ
కన్నీళ్లను తన గుండెల్లో
కలుపుకుంది...

- ఎలగొండ రవి
9848770345

వేకువ రాగం

చీకటి చుట్టిన జీవన పయనంలో వెన్నెల
రెక్కలు కట్టి తలుపు తడితే..

మది నిద్దుర మరచిన కన్నుల్లోకి
ఇంద్ర ధనస్సు వచ్చి పలకరిస్తే..

చెలిమి తాకిన హృదయ రాగంలో
అనురాగపు మధురిమలు
ఆప్యాయతను అల్లుకొని..
మమతలన్నీ తీగలా చుట్టుకున్నాయి..

వెన్నెలను ఎక్కుపెట్టిన ఆ నిశి రాతిరి
అద్భుతమైన స్వప్న లోకంలో విహరింపజేసింది...
జీవితాన్ని సరికొత్తగా మార్చేసింది.
మెలుకువ రాగాలు కంటి రెప్పలని
తట్టి లేపుతూన్నాయి..!!

కలలకు ఇపుడు కొత్తగా
వెలుగు రేఖలు పూస్తున్నాయి.!!

- స్వప్న మేకల, 9052221870

